గురువారం 13.2.2020
కరీంనగర్
మన రాష్ట్రం • మన పత్రిక
# నమస్తే తెలంగాణ
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 229 • పేజీలు : 12 + 16
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






## 16న కేజ్రీవాల్ ప్రమాణస్వీకారం

- చారిత్రక రామ్‌లీలా మైదానంలో కార్యక్రమం
- భారీ ఎత్తున ప్రజల తరలింపునకు ఏర్పాట్లు

5

## చెప్పుకోలేని కష్టాలు

- అధిక పనివేళలతోఅలసిపోతున్న చైనా వైద్యులు
- కఠిన ఆంక్షల నేపథ్యంలో నోరువిప్పని పరిస్థితులు
- వేలమంది డాక్టర్లు, సిబ్బందికి 'కరోనా' లక్షణాలు
- జపాన్ నౌకలోని ఇద్దరు భారతీయులకు వైరస్

4



## హఫీజ్ సయీద్‌కు ఐదున్నరేండ్ల జైలు

- రెండు కేసులలో శిక్ష విధించిన పాక్ కోర్టులు
- ఉగ్రసంస్థలకు నిధులు సమకూర్చినట్టు నిర్ధారణ

4



### తుపాకులగూడెం ఇక ..
# సమ్మక్క బరాజ్

వనదేవత పేరు పెట్టిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు • నేడు లక్ష్మీ బరాజ్ సందర్శన



గురువారం లక్ష్మీ బరాజ్‌ను సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు పువ్వాడ అజయ్, గంగుల కమలాకర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, ఈఎన్సీ మురళీధర్‌రావు కూడా ఉన్నారు

- రానున్న వానకాలం నుంచి పెరుగనున్న వరదనీటి ప్రవాహం
- ప్రాణహిత నీటిని ఎప్పటికప్పుడు ఎగువకు ఎత్తిపోసేందుకు.. కాల్వలకు మళ్లించేందుకు ఇప్పట్నుంచే అప్రమత్తం కావాలి
- సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం ఆదేశం
- తొలిసారిగా లక్ష్మీ బరాజ్‌లో 14 టీఎంసీల నీటినిల్వ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

గోదావరినది మీద నిర్మాణమవుతున్న తుపాకులగూడెం బరాజ్‌కు ఆదివాసీ వీరవనిత, వనదేవత సమ్మక్క పేరుపెట్టాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. తుపాకులగూడెం బరాజ్‌ను సమ్మక్క బరాజ్‌గా పేరుమారుస్తూ జీవో జారీచేయాలని ఈఎన్సీ మురళీధర్‌రావును ఆదేశించారు. ముక్కోటి దేవతల కరుణాకటాక్షాలు బలంగా ఉన్నందున తెలంగాణలో అభివృద్ధి అనుకున్నరీతిలో సాగుతున్నదని ముఖ్యమంత్రి తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయి తెలంగాణ బీళ్లలోకి కాళేశ్వరం జలాలు చేరుకుంటున్న శుభసందర్భంలో ఇప్పటికే పలు బరాజ్‌లు, రిజర్వాయర్లకు దేవతామూర్తుల పేర్లు పెట్టుకున్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌లో తొలిసారిగా అత్యధికస్థాయిలో నీటిని నిల్వచేశారు. సముద్రనీటి మట్టానికి వందమీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ బరాజ్‌లో ప్రస్తుతం 99.4 మీటర్ల ఎత్తులో 14.287 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం లక్ష్మీబరాజ్‌ను సందర్శించనున్నారు. కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత ఆయన బరాజ్ వద్దకు చేరుకుంటారు. ఈ పర్యటన నేపథ్యంలో బుధవారం సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కాళేశ్వరం ప్రాజెక్టులోకి

మిగతా 2వ పేజీలో



బుధవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఐటీమంత్రి కే తారకరామారావు, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, కమిషనర్ మాణిక్‌రాజ్, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ

# కంపెనీల వెల్లువ

రాష్ట్రానికి వచ్చే సంస్థలకు పూర్తి సహకారం • ప్రభుత్వ విధానాలపై సర్వత్రా అభినందనలు

సంగారెడ్డి జిల్లాలో 207 కోట్లతో హట్‌సన్ కంపెనీ • నాలుగు వేల రైతు కుటుంబాలకు లబ్ధి

ద్వితీయశ్రేణి నగరాలకూ ఐటీ పరిశ్రమ • 18న కరీంనగర్‌లో ఐటీ టవర్ ప్రారంభం

ఐటీ, పరిశ్రమలు, టెక్స్‌టైల్స్‌శాఖలపై సమీక్షలో మంత్రి కే తారకరామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వ విధానాలతో అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున వస్తున్న పరిశ్రమలకు మరింత ఊతమిచ్చేలా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విధానాలపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. మరిన్ని కంపెనీలకు అవసరమైన మౌలిక వసతుల రూపకల్పన, ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో ఐటీ, పరిశ్రమలు, టెక్స్‌టైల్‌శాఖల కార్యకలాపాలపై బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ రంగాల్లో టీఎస్ఐఐసీ, ప్రభుత్వం సిద్ధంచేస్తున్న పలు పారిశ్రామిక పార్కులు, ఇతర మౌలిక వసతుల కల్పన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని బుగ్గపాడు, బండమైలారం, బండ తిమ్మాపూర్ వంటి ఫుడ్‌పార్కుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న కంపెనీల వివరాలను అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పలు కంపెనీలు ఫుడ్ ప్రాసెసింగ్

మిగతా 2వ పేజీలో

# గోల్డెన్ అవర్‌కు ఆరోగ్యశ్రీ!

ప్రమాదం జరిగిన వెంటనే వైద్యసాయం • తొలి గంటలో సంభవించే మరణాల నివారణే లక్ష్యం



- రోడ్డు ప్రమాదాల చికిత్స ఆరోగ్యశ్రీతో అనుసంధానం
- వాహన ప్రమాదాల నిధి కూడా ఏర్పాటు
- రూ.50వేల నుంచి రూ.5లక్షలవరకు ఉచిత వైద్యం!
- ప్రభుత్వానికి రవాణాశాఖ ప్రతిపాదన

2018లో దేశవ్యాప్తంగా గోల్డెన్ అవర్‌లోనే 4.69 లక్షల మంది మృతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రోడ్డు ప్రమాదాలు జరిగిన తొలి గంటలో సంభవిస్తున్న మరణాలను నివారించేందుకు కసరత్తు మొదలైంది. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందుతున్నది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అక్కడికక్కడే మరణించేవారికంటే ప్రమాదం జరిగిన తర్వాత సుమారు గంట నుంచి మూడు గంటల వ్యవధిలో సరైన వైద్య చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నవారే ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. ప్రధానంగా రక్తస్రావం, రక్తం గడ్డకట్టడం, కృత్రిమ ఆక్సిజన్‌ను అందించకపోవడం, తల, వెన్నెముకకు తగిలిన గాయాలకు సరైన సమయంలో వైద్యం అందకపోవడంతో తొలి గంటలో వీటి ప్రభావం పెరిగి ప్రాణాలు విడుస్తున్నట్టు గుర్తించారు. రోడ్డు ప్రమాదాల్లో సంభవిస్తున్న మరణాల్లో 35శాతం తొలి గంటలో ఉన్నట్టు తేల్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణాశాఖ ఈ 35 శాతం మరణాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా నూతన రవాణా చట్టాన్ని అనుసరిస్తూ గోల్డెన్ అవర్‌కు మరింత భద్రత కల్పించేందుకు పలు ప్రతిపాదనలుచేసింది. రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ పథకంలో గోల్డెన్ అవర్‌ను చేర్చే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది. ఆరోగ్యశ్రీ కింద అందుతున్న వైద్యసేవల్లో రోడ్డుప్రమాదాలను చేర్చాలని, దీంతో ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స అందించేందుకు సులువుగా ఉంటుందని భావిస్తున్నది. దీనిపై వైద్యారోగ్యశాఖకు కూడా ప్రతిపాదనలు పంపింది. గోల్డెన్ అవర్‌ను ఆరోగ్యశ్రీతో అనుసంధానిస్తే రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నదని అధికారులు వివరించారు.

**జీవచ్ఛవాల్లా బతుకులు**

దేశంలో ఏటా లక్షల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. తీవ్రంగా గాయపడినవారు

మిగతా 4వ పేజీలో

### పల్లెప్రగతి పర్యవేక్షణకు
# మంత్రులు



- జిల్లాలకు ఇంచార్జీలుగా బాధ్యతలు
- ఈ నెల 25లోగా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశాలు
- ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న పల్లెప్రగతి ప్రణాళిక నిర్వహణ, పర్యవేక్షణకు జిల్లాలవారీగా మంత్రులకు ఇంచార్జీ బాధ్యతలను అప్పగించారు. మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ పల్లెప్రగతిపై దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రణాళిక అమలుకు జిల్లాలవారీగా మంత్రులకు బాధ్యతలను అప్పగించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ప్రగతి పనుల్లో పాల్గొనాలని చెప్పారు. దీంతో జిల్లాలవారీగా మంత్రులకు పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 25వ తేదీలోగా ఇంచార్జీలు జిల్లాల పరిధిలో మంత్రులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు అధికారులతో సమావేశం ఏర్పాటుచేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. జిల్లాలవారీగా సమావేశాలు ఏర్పాటుచేసి పల్లెప్రగతి లక్ష్యాలను వివరించాలని సూచించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని నిర్మల్, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇంచార్జిగా వ్యవహరించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు మంత్రి కేటీఆర్, కరీంనగర్‌కు

మిగతా 2వ పేజీలో

## వంటగ్యాస్ మంట

- గృహ వినియోగ సిలిండర్‌పై రూ.144.50 వడ్డన
- హైదరాబాద్‌లో రూ.913.50కి పెరుగుదల
- ప్రతిపక్షాల ఆగ్రహం
- పెరిగిన భారం భరిస్తామన్న కేంద్రం

5



**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 65.00 | రిటైల్ లైవ్ | 87.00 |
| డ్రెస్డ్ | 126.00 | స్కిన్‌లెస్ | 144.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 380.00 | రంగారెడ్డి | 380.00 |
| మెదక్ | 380.00 | కరీంనగర్ | 383.00 |
| వరంగల్ | 383.00 | డజన్ ధర | 60.00 |

# వణికిస్తున్న చలిగాలులు

- మరో రెండ్రోజులు ఇదే పరిస్థితి
- ఆపై పెరుగనున్న ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చలిగాలులు వణికిస్తున్నాయి. చాలాచోట్ల పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువకు పడిపోయాయి. ఉపరితల ద్రోణుల ప్రభావంతోపాటు ఆగ్నేయ దిశనుంచి చలిగాలులు జోరుగా వీస్తుండటంతో వారం రోజులనుంచి తీవ్రత మళ్లీ పెరిగింది. సాధారణంగా గంటకు 5 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, కానీ ప్రస్తుతం ఆగ్నేయ దిశనుంచి గంటకు 10 నుంచి 15 కి.మీ. వేగంతో చలిగాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. నాలుగురోజులుగా గాలులు మరింత వేగంగా వీస్తున్నాయని చెప్పారు. గురు, శుక్రవారాల్లోనూ చలిగాలులు ఇలాగే ఉంటాయని, తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని తాళ్లపల్లి, చందనవెల్లి, సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిన్నెధరి, సిర్పూర్ యూలో రాత్రి ఉష్ణోగ్రతలు 13 నుంచి 15 డిగ్రీల వరకు నమోదయ్యాయి.

**గ్రేటర్ హైదరాబాద్‌లో తగ్గిన ఉష్ణోగ్రతలు**

ఆగ్నేయ దిశనుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మొన్నటివరకు అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురవగా, రెండ్రోజుల నుంచి వాతావరణం చల్లగా మారింది. నగరంలో బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.6 డిగ్రీలు, గాలిలో తేమ 56 శాతంగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

# జీఎస్టీలో తెలంగాణ బెస్ట్



బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన 15వ ఆర్థిక కమిషన్ సభ్యుడు అజయ్ నారాయణ ఝాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ సోమేశ్‌కుమార్

రాబడిలో రాష్ట్రం ముందున్నది

- 15వ ఆర్థికసంఘం సభ్యుడు అజయ్‌నారాయణ కితాబు
- ప్రగతి ఆధారంగా వెయిటేజీ ఇవ్వాలని రాష్ట్ర అధికారుల వినతి

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

తెలంగాణలో జీఎస్టీ నిర్వహణ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదని 15వ ఆర్థికసంఘం సభ్యుడు అజయ్ నారాయణ ఝా కితాబిచ్చారు. బుధవారం ఆయన బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య తెలంగాణలో జీఎస్టీ రాబడి ఇతర రాష్ట్రాల కంటే పెరుగడానికి గల కారణాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో వాణిజ్యపన్నుల సర్కిళ్లను హేతుబద్ధంచేసి అధికారులందరికీ సమానంగా బాధ్యతలు అప్పగించామని సీఎస్ తెలిపారు. సర్కిళ్ల పరిధిలో ఉన్న అంతరాలను తగ్గించి పరిపాలనకు అనుకూలంగా మార్చామని, అవసరమైనచోట కొత్త డివిజన్లు, సర్కిళ్లను ఏర్పాటుచేశామని వివరించారు. పన్ను ఎగవేతను అరికట్టి పకడ్బందీగా వసూలు చేయడానికి ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లను, స్ట్రాటజిక్ ట్యాక్స్ యూనిట్లను నెలకొల్పి భారీ సంఖ్యలో ట్రేడర్లను ట్యాక్స్ నెట్‌లోకి తెచ్చామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తెచ్చిన విధానాన్ని వివరించారు. వాణిజ్యపన్నులశాఖలో ఉన్నతస్థాయి నుంచి కిందిస్థాయివరకు అధికారులు, సిబ్బంది యాప్‌లను ఉపయోగించి

మిగతా 2వ పేజీలో

## చుక్కల్లోకి ధరలు

- జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం మరింత పైకి
- ఆరేండ్ల గరిష్ఠాన్ని తాకుతూ 7.59 శాతంగా నమోదు
- కూరగాయలు, ఆహారోత్పత్తుల ధరల ప్రభావం

8

## ఆసక్తిగా ఎదురుచూస్తున్నా!

- 50-70 లక్షల మంది స్వాగతం పలుకవచ్చు
- భారత పర్యటనపై ట్రంప్

5

## సిద్ధమవుతున్న స్కూల్ యూనిఫాం వస్త్రాలు

- వచ్చే నెలలో మండలాలకు చేరవేత
- 4.5 లక్షల కుటుంబాలకు రంజాన్ తోఫా తయారీ షురూ

2



సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు. చిత్రంలో మేయర్ రామ్మోహన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు

## ఘనంగా బాలమల్లు బర్త్‌డే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తన పుట్టినరోజు సందర్భంగా టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు బుధవారం సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రగతిభవన్‌లో బాలమల్లును కేసీఆర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బాలమల్లు వెంట మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. టీఎస్ఐఐసీ కార్యాలయంలో టీఆర్ఎస్ నాయకులు బాలమల్లును గజమాలతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్టీఐ కమిషనర్లు అమీర్, శంకర్‌నాయక్, విద్యామౌలిక సదుపాయాల కల్పనా సంస్థ చైర్మన్ నాగేందర్‌గౌడ్, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పావని విషయాన్ని వివరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## పావని పైలట్ శిక్షణకు సీఎం భరోసా

- రూ.35 లక్షలు మంజూరుచేయాలని అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోప్లాపురానికి చెందిన వీర్ల పావని అమెరికాలో కమర్షియల్ పైలట్ శిక్షణ తీసుకుంటున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సాయం కోసం మంత్రి గంగుల కమలాకర్ ద్వారా బుధవారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి శిక్షణకు అవసరమైన రూ.35 లక్షలను మంజూరుచేయాలంటూ అధికారులకు ఆదేశాలిచ్చినట్టు మంత్రి తెలిపారు. వీర్ల లక్ష్మయ్య, మంజుల దంపతుల కుమార్తె పావని 2019 ఏప్రిల్‌లో కమర్షియల్ పైలట్ శిక్షణ కోసం అమెరికాకు వెళ్లారు. గల్ఫ్‌లో ఉపాధి పొందుతున్న లక్ష్మయ్య ఇప్పటికే కూతురు శిక్షణ కోసం భారీగా ఫీజు చెల్లించారు. ఈ శిక్షణ పూర్తిచేసేందుకు మరో రూ.40 లక్షల మేర అవసరంకాగా.. ఈ విషయాన్ని పావని మంత్రి గంగుల దృష్టికితేగా ఆయన సీఎం వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆమె పైలట్ శిక్షణ సరిపడా నగదు అందజేయాలంటూ సీఎం ఆదేశించినట్టు మంత్రి తెలిపారు.



## అమరుడి కుటుంబానికి రూ.10 లక్షలు

మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన సల్వల నారాయణ కుటుంబానికి తెలంగాణ అమరవీరుల పథకం కింద రూ.10 లక్షలు మంజూరుచేసింది. దీంతోపాటు అర్హత ఉన్నవారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావ్‌పేట మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన సల్వల నారాయణ 2006లో ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన బైక్‌ర్యాలీలో ప్రమాదవశాత్తు మరణించారు. పెద్దదిక్కును కోల్పోయిన నారాయణ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది.

## పొద్దున్నే క్షేత్రస్థాయికి కమిషనర్లు

- 5నుంచి 9 గంటలదాకా పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలి
- మంత్రి కేటీఆర్ ఆదేశాలను అమల్లోకి తెచ్చిన సీడీఎంఏ
- వార్డులవారీగా చెత్తసేకరణ జాబితా రూపొందించాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణాల్లో పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలంటూ ఇటీవల జరిగిన సమావేశంలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కమిషనర్లు ఉదయం 5 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలని సీడీఎంఏ సత్యనారాయణ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో ఉదయం 9 గంటల వరకు పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. పట్టణాల్లో కీలకమైన ప్రాంతాలతోపాటు, గతంలో దృష్టి సారించని ప్రదేశాల్లోనూ పారిశుద్ధ్యాన్ని చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్య పనులను తూతూమంత్రంగా ఒకట్రెండు రోజులు మాత్రమే నిర్వర్తించడం కాకుండా.. నిరంతరంగా కొనసాగాలని చెప్పారు. ఈ ఆదేశాలను పాటించకుండా, పరిశుభ్రత విషయంలో పురోగతి కనిపించకపోతే తగినచర్యలు తీసుకుంటామని కూడా స్వయంగా మంత్రి కేటీఆర్ ఇటీవల జరిగిన సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని 141 పట్టణాలు (జీహెచ్ఎంసీ కాకుండా) సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా అడుగులువేయనున్నాయి.

### పట్టణ పారిశుద్ధ్య ప్రణాళికకు రూపకల్పన

కమిషనర్లు ప్రత్యేకంగా పట్టణ పారిశుద్ధ్య ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. నివాస, నివాసయేతర భవనాల నుంచి విధిగా చెత్తను సేకరించేలా చర్యలు చేపట్టాలి. ఇందుకు సంబంధించి వార్డులవారీగా జాబితాను సిద్ధంచేయాలి. వ్యర్థాల సేకరణ, వాటిని వేరుచేయడం, అక్కడ్నుంచి తరలించడమే కాకుండా ప్రాసెసింగ్ మొత్తం పక్కాగా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలి. ప్రతిరోజూ ఘనవ్యర్థాల సేకరణ వందశాతం తప్పనిసరిగా చేపట్టాలి. ఘనవ్యర్థాల్ని వేరుచేయడాన్ని శాస్త్రీయ పద్ధతిలో పకడ్బందీగా చేపట్టాలి. డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటుచేయాలి. పార్కులు, అపార్టుమెంట్లు, వాణిజ్యసముదాయాలు, ఫంక్షన్‌హాళ్లు వంటి స్థలాల్లో కంపోస్టుయార్డులను ఏర్పాటుచేయడంపై దృష్టిసారించాలి. వీటిసంఖ్య వీలైనన్ని ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి పట్టణంలో నర్సింగ్ హోంలు, దవాఖానలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, పారామెడికల్ దవాఖానల్లో బయోవ్యర్థాల నిర్వహణపై కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలి. వాటిని వేరుచేసే ప్రక్రియలో నిబంధనలను పాటించని దవాఖానలపై తగినచర్యలు తీసుకోవాలి. ప్రమాదకర వ్యర్థాలను సేకరించే పనిని ప్రతి మున్సిపాలిటీ ముమ్మరం చేయాలి.

# సమ్మక్క బరాజ్

మొదటిపేజీ తరువాయి...

అనుకున్నరీతిలో సాగునీరు చేరుకుంటున్నది. రానున్న వానకాలం నుంచి వరదనీటి ప్రవాహం పెరుగనున్నది. ప్రాణహిత ద్వారా లక్ష్మీ బరాజ్‌కు చేరుకునే వరద నీటిని ఎప్పటికప్పుడు ఎగువకు ఎత్తిపోసుకునేందుకు, అటునుంచి కాల్వలకు మళ్లించే దిశగా నీటిపారుదలశాఖ ఇప్పట్నుంచే అప్రమత్తం కావాలి. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలి' అని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్, రైతు సమన్వయసమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న సమ్మక్క (తుపాకులగూడెం) బరాజ్

### గోదారమ్మ పరవశం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రాణహితజలాల్ని ఒడిసిపట్టేందుకు గోదావరిపై నిర్మించిన లక్ష్మీబరాజ్‌లో నీటినిల్వ తొలిసారిగా 14.287 టీఎంసీలకు చేరుకున్నది. వందమీటర్ల ఎత్తులో దాదాపు 28 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహాన్ని తట్టుకునేలా నిర్మించిన ఈ బరాజ్‌ను గతేడాది జూన్ 21న సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఆ రోజు నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా వేల టీఎంసీల గోదావరిజలాలు ఈ బరాజ్ మీదుగా ప్రవహించాయి. అధికారులు బరాజ్‌లో అవసరమైన మేరకు జలాలను నిల్వచేస్తూ.. లక్ష్మీ పంపుహౌస్ ద్వారా ఎగువకు ఎత్తిపోశారు. బరాజ్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా.. ఇప్పటివరకు గరిష్ఠంగా ఎనిమిది టీఎంసీల వరకు మాత్రమే నిల్వచేశారు. ప్రస్తుతం గోదావరిలో వరద తగ్గుముఖం పట్టడంతో కొన్నిరోజుల క్రితం అధికారులు బరాజ్‌కు చెందిన 85 గేట్లు మూసివేశారు. ఇప్పటికీ సరాసరి వస్తున్న 2,600 క్యూసెక్కుల వరదతో బరాజ్‌లో నిల్వను పెంచుతూ వచ్చారు. ఈ క్రమంలో బుధవారం రాత్రికి నీటినిల్వ 99.4మీటర్ల ఎత్తులో 14 టీఎంసీలకు చేరుకున్నది. దీని ఎగువన ఉన్న సరస్వతి (అన్నారం) బరాజ్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 10.87 టీఎంసీలకు 6.09 టీఎంసీలు, ఆపైన ఉన్న పార్వతి (సుందిల్ల) బరాజ్‌లో 8.83 టీఎంసీలకు 4.777 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్-1 పరిధిలో గోదావరిపై ఉన్న మూడుబరాజ్‌లు దాదాపు 25 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయి.

### కరీంనగర్ చేరుకున్న సీఎం

పద్నాలుగు టీఎంసీల నీటినిల్వతో కనువిందు చేస్తున్న లక్ష్మీబరాజ్‌ను గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రే ఆయన కరీంనగర్ చేరుకున్నారు. తీగలగుట్టపల్లిలోని కేసీఆర్‌భవన్ నుంచి గురువారం ఉదయం హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకుంటారు. కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత బరాజ్‌ను సందర్శిస్తారు. అక్కడే భోజనం చేసుకుని తిరిగి కరీంనగర్ చేరుకుంటారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మూడ్రోజులుగా ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను నంది, గాయత్రీ పంపుహౌస్‌ల ద్వారా శ్రీరాజరాజేశ్వర జలాశయం.. ఆపై లోయర్‌మానేరుకు తరలిస్తున్నారు. బుధవారం ఎల్లంపల్లిలో నీటినిల్వ 12.29 టీఎంసీలకు చేరుకున్నది. ఇందు లో నాలుగైదు టీఎంసీల మేర లోయర్‌మానేరుకు తరలించనున్నారు. లక్ష్మీబరాజ్ సందర్శన నేపథ్యంలో సీఎం కేసీఆర్ అధికారులకు పలు సూచనలు చేయనున్నట్టు సమాచారం.

### అతిథిగృహం అంచనా వ్యయసవరణకు ఆమోదం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద అతిథిగృహం, కార్యాలయాలతోపాటు ఇతర భవనాలు, వాటిల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి సవరణ అంచనా వ్యయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రిజర్వాయర్ సమీపంలోని పల్లగుట్ట వద్ద అతిథిగృహం, భవనాలు, ఫర్నిచర్‌కు సంబంధించి గతంలోనే టెండర్లు పూర్తిచేశారు. నవ్‌తేజ్ ఇన్‌ఫ్రాకు పనులు కూడా అప్పగించారు. రూ.11.76 కోట్లతో సవరణ అంచనావ్యయంపై నీటిపారుదలశాఖ ప్రతిపాదనలు పంపగా.. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలుపుతూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

### సీఎం కేసీఆర్‌కు మంత్రి సత్యవతి రాథోడ్ కృతజ్ఞతలు

తెలంగాణలో గిరిజనులకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని.. తుపాకులగూడెం బరాజ్‌కు సమ్మక్కబరాజ్‌గా నామకరణం చేయడం హర్షణీయమని గిరిజనసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నిర్ణయంతో అమ్మవారి కటాక్షం తెలంగాణపై సంపూర్ణంగా ఉంటుందని ఆకాంక్షించారు. సీఎం నిర్ణయం గిరిజనులందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ సంయుక్త గౌరవ కార్యదర్శి ప్రొఫెసర్ రమణ నాయక్ పేర్కొన్నారు.



బుధవారం రాత్రి కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌లోకి వెళ్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి గంగుల కమలాకర్ కూడా ఉన్నారు.

## సీఎం కేసీఆర్ పర్యటన షెడ్యూల్

- బుధవారం రాత్రి కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి చేరుకున్న సీఎం కేసీఆర్..
- గురువారం ఉదయం 8.50 గంటలకు అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కరీంనగర్ కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 9.05 గంటలకు హెలికాప్టర్‌లో కాళేశ్వరం బయలుదేరుతారు.
- 9.30 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కాళేశ్వరం ఆలయానికి చేరుకుని శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకుంటారు. గోదావరిఘాట్‌ను కూడా సందర్శిస్తారు.
- ఉదయం 10.10 గంటలకు అక్కడి నుంచి తిరిగి పయనమవుతారు.
- ఉదయం 10.30 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అంబట్‌పల్లి గ్రామ పరిధిలోని లక్ష్మీబరాజ్‌కు చేరుకుంటారు. బరాజ్‌ను సందర్శిస్తారు.
- మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం చేసి.. రెండుగంటలకు హెలికాప్టర్‌లో కరీంనగర్‌కు బయలుదేరుతారు.
- 2.40 గంటలకు కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి చేరుకుని..వీలును బట్టి హైదరాబాద్ తిరుగుపయనమవుతారు.

## తప్పుల సవరణకు టీఎస్‌పీఎస్సీ ఎడిట్ ఆప్షన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు తప్పుగా నమోదైన వివరాలను సవరించుకునేందుకు టీఎస్‌పీఎస్సీ ఎడిట్ ఆప్షన్ అవకాశం కల్పించింది. దరఖాస్తులో ఒకసారి మాత్రమే వివరాలను సవరించేందుకు అనుమతినిచ్చింది. గురువారం నుంచి శనివారం వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.45 గంటలకు

సూర్యాస్తమయం: 6.10 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం పంచమి రాత్రి 8.47 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: హస్త ఉదయం 9.26 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.19 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి సాయంత్రం 4.38 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.47 నుంచి 6.15 వరకు.

**లోకం పోకడ**




# కంపెనీల వెల్లువ

మొదటిపేజీ తరువాయి...

రంగంలో త్వరలోనే తెలంగాణ ప్రభుత్వంతో తమ పెట్టుబడులపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్ సంస్థ రూ.207 కోట్ల పెట్టుబడులను పెట్టిందని, సంగారెడ్డి జిల్లా గోవింద్‌పూర్‌లో దేశంలోనే అతిపెద్ద ఐస్‌క్రీం తయారీప్లాంటును ఏర్పాటుచేస్తున్నదని తెలిపారు. అక్కడ ప్లాంటు నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయని, దీనిద్వారా స్థానికంగా ఉన్న 4 వేల డెయిరీ రైతు కుటుంబాలకు ప్రయోజనం కలగడంతోపాటు దాదాపు 500 మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఈ ప్లాంటు ద్వారా ప్రతిరోజు 100 మెట్రిక్‌టన్నుల ఐస్‌క్రీం తయారవుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌నాటికి ప్లాంటు నిర్మాణం పూర్తయి ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

### ద్వితీయశ్రేణి నగరాలకు ఐటీ

రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే పలు ప్రముఖ కంపెనీలు వరంగల్ నగరానికి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో కేంద్రీకృతమైన ఐటీ పరిశ్రమను ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. ఆ దిశగా ఇతర ప్రాంతాల్లోనూ ఐటీ పరిశ్రమకు అవసరమైన పార్కుల అభివృద్ధి, కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాట్లపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఇంకా అనేక కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటుకు సుముఖంగా ఉన్నాయని చెప్పారు. కరీంనగర్‌లో ప్రభుత్వం నిర్మించిన ఐటీ టవర్‌ను ఈ నెల 18న ప్రారంభించనున్నట్టు తెలిపిన కేటీఆర్.. ఇక్కడ పలు కంపెనీలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తాయన్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మంలోనూ ఐటీ భవనాల నిర్మాణం వేగంగా కొనసాగుతున్నదని అధికారులు తెలుపగా.. ఆయా భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన కంపెనీలతో మాట్లాడి నిర్మాణాలు పూర్తికాగానే ఏర్పాటుచేసేలా చూడాలని ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్‌కు సూచించారు. టీహబ్ రెండోదశ భవనం త్వరలోనే పూర్తవుతుందని, ఈ భవనం ప్రారంభం తర్వాత ఇది అతిపెద్ద ఐటీ ఇంక్యుబేటర్ అవుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. త్వరలో టీవర్క్స్ ప్రారంభంతోపాటు ఈ ఏడాది జూలైలో అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్ ఏర్పాటవుతుందని చెప్పారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కుపై మరిన్ని కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ మాణిక్‌రాజ్, చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ పాల్గొన్నారు.



బుధవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో నిర్వహించిన సమీక్ష అనంతరం శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లతో మంత్రి కే తారకరామారావు

# జీఎస్టీలో తెలంగాణ బెస్ట్

మొదటిపేజీ తరువాయి...

ట్రేడర్లు, డీలర్ల నుంచి సకాలంలో పన్నులను రాబట్టారన్నారు. పన్ను ఎగవేతదారులకు వెంటనే నోటీసులు పంపడం, జీఎస్టీ రిటర్న్‌లను పెండింగ్‌లో ఉంచినవారికి ఎస్ఎంఎస్ పంపడం, పన్ను ఎగవేస్తున్నవారిని గుర్తించి 3-ఏ నోటీసులు ఆటోమేటిక్‌గా వెళ్లిపోయేలా రూపొందించిన వ్యవస్థను అజయ్ నారాయణకు కండ్లకు కట్టినట్టు చూపారు. పటిష్ఠమైన వ్యవస్థ వల్ల జీఎస్టీ ప్రారంభమైననాటి నుంచి రాష్ట్రంలో ఇబ్బందులు లేవని, రాబడిలో తెలంగాణ ముందువరుసలో ఉన్నదని ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ ప్రశంసించారు. సీఎస్ సోమేశ్‌కుమార్ ఇచ్చిన కొన్ని సూచనలు, సలహాలను ఆయన స్వీకరించి ప్రత్యేకంగా నోట్ చేసుకున్నారు. ఐజీఎస్టీ డాటా షేరింగ్, కేంద్రానికి రాష్ట్రానికి మధ్య సమన్వయం, సహకారం వంటి అంశాలపై అజయ్ చర్చించారు. జీఎస్టీతోపాటు చాలా రంగాల్లో తెలంగాణ దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే మంచి ఫలితాలను సాధిస్తున్నదని రాష్ట్ర ఉన్నతాధికారులు అజయ్‌కు వివరించారు. బెస్ట్ ఫర్ఫార్మింగ్ స్టేట్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలిచ్చేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. ప్రగతి ఆధారంగా వెయిటేజీని పెంచితే రాష్ట్రాలు అభివృద్ధికి పాటుపడుతాయని చెప్పారు. అజయ్‌నారాయణతో జరిగిన సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జీఆర్ రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు, వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ నీతూప్రసాద్, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ సోమేశ్‌కుమార్‌తో భేటీ అయిన ఆర్థికసంఘం సభ్యుడు అజయ్‌నారాయణ

## చంచల్‌గూడ జైలుకు అనధికార సందర్శకుల కమిటీ నియామకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చంచల్‌గూడ జైలు అనధికార సందర్శకుల కమిటీని 2021 అక్టోబర్ 19 వరకు కాలపరిమితితో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో డాక్టర్ పార్థసారథి, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ కేవీ కృష్ణకుమారి, చెన్ను శివప్రసాదరావు, ఏఎస్ బాలాజీ, ఎస్ వాణి ఉన్నారు. వైద్యులు, న్యాయవాదులు, సామాజిక సేవకులు ఇద్దరేసి చొప్పున సభ్యులుంటారు.

## ఎక్సైజ్‌శాఖలో పదోన్నతుల ప్రక్రియ!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎక్సైజ్‌శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియపై కసరత్తు జరుగుతున్నది. వీలైనంత త్వరగా పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిసింది. ఖాళీగా ఉన్న అదనపు కమిషనర్ పోస్టులో జాయింట్ కమిషనర్ అజయ్‌రావు ఇంచార్జీగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు జాయింట్ కమిషనర్లకు ఒక్కరు, 12 మంది డిప్యూటీ కమిషనర్లకు ఐదుగురు, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్లు 16 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్లు మొత్తం 29 మందికి 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులన్నీ పదోన్నతులతో భర్తీచేసేందుకు సీఎం కేసీఆర్ నుంచి ఆదేశాలు వచ్చినట్టు సమాచారం.



నుమాయిష్ విజయవంతానికి కృషిచేసిన పోలీసు అధికారికి బహుమతి ప్రదానంచేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ

# ఔన్నత్యానికి ప్రతీక నుమాయిష్

- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు
- ఎగ్జిబిషన్ మరో మూడ్రోజులు పొడిగింపు
- హోంమంత్రి మహమూద్‌అలీ
- ఘనంగా నుమాయిష్ బహుమతుల ప్రదానోత్సవం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఇంటిల్లిపాది షాపింగ్ దాహాన్ని తీర్చే నుమాయిష్.. హైదరాబాద్ ఔన్నత్యానికి ప్రతీకని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నుమాయిష్ అంటే హైదరాబాద్ సంస్కృతికి చిహ్నమని, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చిన అద్భుతమైన ప్రదర్శనని పేర్కొన్నారు. బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన నుమాయిష్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్‌అలీ, హరీశ్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నుమాయిష్ విజయవంతానికి కృషిచేసిన జీహెచ్ఎంసీ, పోలీసు, ట్రాఫిక్, అగ్నిమాపకశాఖ, విద్యుత్, ఆదాయపన్నుశాఖ, జీఎస్టీ సహ పలుశాఖల ప్రభుత్వ విభాగాలు, అధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు, ఉత్తమంగా నిర్వహించిన స్టాళ్ల నిర్వాహకులకు బహుమతులను ప్రదానంచేశారు.

**సిద్దిపేటలో మహిళా కళాశాల ఏర్పాటుచేయండి**

ఏటా జనవరి 1న ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుండటంతో హైదరాబాదీలకు న్యూఇయర్ అంటే నుమాయిష్‌గా స్థిరపడిందని హరీశ్‌రావు అన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంతో 18 విద్యాసంస్థలను నడపటం, 30 వేలమంది పేదగ్రామీణ విద్యార్థులకు విద్యనందించడంపై సొసైటీ నిర్వాహకులను అభినందించారు. సిద్దిపేట నియోజకవర్గంలో బాలికలు/మహిళల కోసం ఫార్మసీ, వ్యవసాయ సంబంధ కోర్సులు నిర్వహించే కళాశాలను ఏర్పాటుచేయాలని ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులను హరీశ్‌రావు కోరారు. ఇందుకు సంబంధించిన అనుమతులు, స్థల సేకరణ విషయాలను తాను చూసుకుంటానని హామీఇచ్చారు. ఇందుకు ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు సైతం సుముఖత తెలుపడంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు. నుమాయిష్‌కు కొద్దిరోజులే గడువు ఉండటంతో రద్దీ పెరిగిందని, విజ్ఞప్తుల ఈ నేపథ్యంలో ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి ఈటల రాజేందర్ తో చర్చించగా, నుమాయిష్‌ను మరో మూడురోజులు పొడిగించేందుకు అంగీకరించినట్టు హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. రెండువేల స్టాళ్లతో దేశంలోనే అతిపెద్ద ప్రదర్శనగా నుమాయిష్ నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి ప్రభాశంకర్ మిశ్రా, సంయుక్త కార్యదర్శి బీ హనుమంతరావు, కోశాధికారి వినయ్‌కుమార్, సలహాదారు ఎన్వీఎన్ చార్యులు పాల్గొన్నారు.

## సిద్ధమవుతున్న స్కూల్ యూనిఫాం

- వచ్చేనెలలో మండలాలకు చేరవేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే యూనిఫాం వస్త్రాల తయారీ చివరి దశకు చేరుకొన్నది. సిరిసిల్ల మరమగ్గాలపై తయారైన వస్త్రం.. డైయింగ్, ప్రిటింగ్ పూర్తిచేసుకొని మండలాలవారీగా పంపిణీకి సిద్ధమవుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 24 లక్షల మంది విద్యార్థులకు 1.05 కోట్ల మీటర్ల వస్త్రాన్ని నేసి పంపిణీ చేయనున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున ఉచితంగా యూనిఫాంను ప్రభుత్వం అందిస్తున్నది. వస్త్రాల సరఫరా ఆర్డర్‌ను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకుండా మరమగ్గాలపై పనిచేసే కార్మికులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో సిరిసిల్లలోనే యూనిఫాం వస్త్రాన్ని తయారుచేయిస్తున్నారు. ఇప్పటికే నేతపని పూర్తిచేసుకొని డైయింగ్, ప్రింటింగ్ పనుల నిమిత్తం పంపించారు. దీని కోసం రూ.80 కోట్ల నిధులను టెస్కోకు పాఠశాల విద్యశాఖ చెల్లించనున్నది. వేసవి సెలవులు మొదలయ్యేలోగా పంపిణీ చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. వచ్చేనెలలో ఎంఈవోలకు చేరవేసే ప్రక్రియను ప్రారంభించి.. అక్కడి నుంచి పాఠశాలలకు అందించనున్నారు.

### తయారవుతున్న రంజాన్ తోఫాలు

పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే రంజాన్ తోఫాల తయారీ ప్రారంభమైంది. సిరిసిల్ల మరమగ్గాలపై తోఫాల తయారీ ప్రక్రియ మొదలుపెట్టారు. రూ.17 కోట్ల ఖర్చుతో 4.50 లక్షల కుటుంబాలకు పంపిణీ చేసేలా దుస్తులను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో తోఫాలో పైజామా, లాల్చి, చీరె, జాకెట్టు, పంజాబీ సూట్ అందిస్తున్నారు.

## పల్లెప్రగతి పర్యవేక్షణకు మంత్రులు

మొదటిపేజీ తరువాయి...

మంత్రి గంగుల కమలాకర్, పెద్దపల్లికి మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాలకు మంత్రి ఈటల రాజేందర్‌కు బాధ్యతలను అప్పగించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంత్రి పువ్వాడ అజయ్, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలకు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు మంత్రి హరీశ్‌రావు, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు మంత్రి జగదీశ్‌రెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరికి మల్లారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్‌కు మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వరంగల్ రూరల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు మంత్రి సత్యవతి రాథోడ్‌కు పల్లెప్రగతి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.



బుధవారం గచ్చిబౌలి అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన మేసినేని మంజుల, రాజశేఖర్‌రావు కుమార్తె డాక్టర్ వైష్ణవి వివాహం శరణ్‌తో జరిగింది. ఈ పెండ్లికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న సీఎం కేసీఆర్, శోభ, మంత్రి కేటీఆర్, శైలిమ

వధూవరులను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మాజీ ఎంపీ కవిత, అనిల్





# లాభాలొస్తే కార్మికులకే..

- ఉద్యోగుల సమస్యలు రెండునెలల్లో తీరుస్తాం
- సీఎం కేసీఆర్ వ్యూహంతో విద్యుత్‌శాఖ పురోభివృద్ధి
- విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఈటల



తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్. చిత్రంలో ప్రొఫెసర్ హరగోపాల్, సాయిలు, శ్రీధర్ కూడా ఉన్నారు.



టీవీఈయూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ సంస్థలు అన్నివిధాలా లాభాల్లోకి వస్తే వాటిని కార్మికులకే పంచుతామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రెండునెలల్లో తీరుస్తామని, ఎవరూ ఆగం కావొద్దని భరోసా ఇచ్చారు. బుధవారం మింట్‌కాంపౌండ్‌లో తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీని తెలంగాణ విద్యుత్‌శాఖ వణికిస్తున్నదని, ఆ భయంతోనే తెలంగాణ మీద విషం కక్కుతున్నారని అన్నారు. మన రాష్ట్రంలో సృష్టించిన సంపద అందరికీ సమానంగా అందుతున్నదని, అదే గుజరాత్‌లో 10 శాతం మంది చేతుల్లోకి వెళ్లిపోతున్నదని, అందుకే అక్కడ పేదరికం పెరిగిపోయిందని చెప్పారు. అన్ని రంగాల్లో ఎక్కువ వేతనం అందుకుంటున్న ఉద్యోగులు తెలంగాణలోనే ఉన్నారని తెలిపారు.

**అభివృద్ధిలో దూసుకెళ్తున్న రాష్ట్రం**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ వ్యూహంతో విద్యుత్‌శాఖను పురోభివృద్ధివైపు నడిపించారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. దేశంలోనే విద్యుత్‌ను అతి ఎక్కువగా వినియోగిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. మరో 20 ఏండ్ల వరకు అవసరాలు తీర్చేవిధంగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసిన ఘనత తెలంగాణ సొంతమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక విద్యుత్ కోతలకు అవకాశం లేదన్నారు. రెప్పపాటు కరంటు పోకుండా చూస్తామని ఆనాడు అసెంబ్లీలో సీఎం కేసీఆర్ మాట్లాడితే.. అదే నిజమైతే పార్టీకి రాజీనామా చేస్తానని జానారెడ్డి అన్న మాటలు ఇంకా గుర్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, వనమాలతోపాటు విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సాయిలు, శ్రీధర్‌గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ద్రాక్ష పండుగ

- నేటినుంచి వారంపాటు రాజేంద్రనగర్ ద్రాక్ష పరిశోధన క్షేత్రంలో నిర్వహణ
- ద్రాక్ష సాగు విస్తీర్ణం పెంచడంపై ఉద్యానశాఖ దృష్టి



ద్రాక్ష పరిశోధన క్షేత్రంలో ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ రాంరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/బండ్లగూడ:** ద్రాక్ష పండుగ నిర్వహణకు కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ ద్రాక్ష పరిశోధన స్థానం ప్రాంగణం వేదిక కానున్నది. ద్రాక్ష సాగువైపు రైతులను మళ్లించేందుకు అవగాహన కల్పించడం, జంటనగరవాసులకు పండ్ల రుచులు చూపించేందుకు వినూత్న రీతిలో ఈ 'గ్రేప్ ఫెస్టివల్' నిర్వహించనున్నారు. గురువారం నుంచి వారంపాటు దీనిని నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధంచేశారు. ఒకప్పుడు పెద్దఎత్తున పండిన ఈ పంటకు పూర్వవైభవం తెచ్చేందుకు ఉద్యానశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, రాయితీలు ఇచ్చి రైతులను ప్రోత్సహించడం, సస్యరక్షణ, యాజమాన్యాలు చర్యలు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహనసహా హైదరాబాద్ జంటనగరవాసులకు రుచులు చూపించేందుకు ఉద్యాన వర్సిటీ శ్రీకారం చుట్టింది. ఈ పండుగ కోసం రాజేంద్రనగర్‌లోని ద్రాక్ష పరిశోధన కేంద్రంలోని 3.5 ఎకరాల్లో పండించిన 59 రకాల పండ్లను ఉద్యానశాఖ కమిషనర్ లోక వెంకట్రామిరెడ్డి బుధవారం పరిశీలించారు. ద్రాక్ష సాగు పట్ల ఆసక్తి ఉన్న రైతులను రప్పించి ఈ క్షేత్రాన్ని చూపించాలని శాస్త్రవేత్తలకు సూచించారు.

**అధ్యయనంలో ఆసక్తికర విషయాలు**

తెలంగాణ ప్రజల ఆహారపు అలవాట్లపై వ్యవసాయ వర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ద్రాక్ష పండ్లను రాష్ట్రంలో ప్రతిరోజూ 3.52 లక్షల మంది సగటున 160 గ్రాములు తింటున్నట్టు తేలింది. ప్రస్తుతం రాష్ట్రానికి మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ద్రాక్ష సరఫరా అవుతున్నది. రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చేలా రెండువేల ఎకరాల్లో ద్రాక్షను సాగు చేయాల్సిన అవసరమున్నదని కమిషనర్ వెంకట్రామిరెడ్డి చెప్పారు. రైతులకు పెట్టుబడి పెద్ద సమస్యగా మారిన నేపథ్యంలో 40 శాతం రాయితీ ఇవ్వాలని యోచిస్తున్నట్టు సమాచారం. ద్రాక్ష పరిశోధన క్షేత్రంలో 3.20 ఎకరాల్లో పండించిన పండ్లకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

# ఇద్దరికి 'జీనోమ్ వ్యాలీ' అవార్డులు

- లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగాల్లో విశేషకృషికి కార్ల్ హెచ్ జూన్, వసంత్ నరసింహన్ ఎంపిక
- 17 నుంచి జరిగే బయోఏషియా సదస్సులో ప్రదానం



కార్ల్ హెచ్ జూన్, వసంత్ నరసింహన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్యాన్సర్ చికిత్స విధానంలో నూతన విధానాలను కనుగొన్న డాక్టర్ కార్ల్ హెచ్ జూన్, నోవార్టిస్ అంతర్జాతీయ కంపెనీ సీఈవో డాక్టర్ వసంత్ నరసింహన్ ప్రతిష్ఠాత్మక జీనోమ్ వ్యాలీ అవార్డులను అందుకోనున్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి హెచ్ఐసీసీలో జరిగే బయోఏషియా సదస్సు సందర్భంగా వీరికి పురస్కారాలను ప్రదానంచేయాలని సదస్సు నిర్వాహకులు నిర్ణయించారు. సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలనుంచి 1800 మంది ఫార్మా, లైఫ్‌సైన్సెస్, బల్క్‌డ్రగ్ విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, సంస్థల నిర్వాహకులు, నిపుణులు హాజరుకానున్నారు. బయోఏషియా సదస్సులు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి సంవత్సరం లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగాల్లో కృషిచేసినవారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తున్నారు. లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగాల్లో విశేష కృషిచేసిన ఈ ఇద్దరికి అవార్డు ప్రదానం చేయనుండటం ఎంతో సంతోషంగా ఉన్నదని ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు.

**క్యాన్సర్‌కు మెరుగైన వైద్యం**

అమెరికాకు చెందిన డాక్టర్ కార్ల్ హెచ్ జూన్ ఆంకాలజిస్ట్. ఈయన క్యాన్సర్ చికిత్సలో చిమిరిక్ యాంటిజెన్ రిసెప్టర్ (సీఏఆర్) -టీ సెల్ థెరపీ విధానాలను కనుగొన్నారు. దీని ద్వారా క్యాన్సర్‌కు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. కార్ల్ హెచ్ జూన్ అమెరికా పెన్సిల్వేనియా యూనివర్సిటీలో పాథాలజీ, ల్యాబరేటరీ మెడిసిన్ విభాగంలో సేవలందించారు.

**అంచెలంచెలుగా ఎదిగి నోవార్టిస్ సీఈవోగా**

డాక్టర్ వసంత్ నరసింహన్ నోవార్టిస్ సీఈవోగా పనిచేస్తున్నారు. నరసింహన్ పూర్వీకులది తమిళనాడు. యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో బయోలాజికల్ సైన్సెస్‌లో డిగ్రీ చేసిన ఆయన.. హార్వర్డ్ మెడికల్ స్కూల్ నుంచి ఎండీ చేశారు. జాన్‌ఎఫ్ కెన్నడీ స్కూల్‌లో పబ్లిక్ పాలసీలో పీజీ అభ్యసించారు. 2005 నుంచి నోవర్టిస్‌లో పనిచేస్తున్న వసంత్.. 2017లో కంపెనీ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఇదే సంస్థలో గ్లోబల్ హెడ్ ఆఫ్ డెవలప్‌మెంట్ హోదాలో పనిచేశారు. నోవార్టిస్ సంస్థను అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ కంపెనీగా తీర్చిదిద్దడంలో కృషిచేశారు. అమెరికా జాతీయ మెడిసిన్ అకాడమీ సభ్యుడిగా కూడా ఉన్నారు.

# ఐటీ హబ్ దిశగా వరంగల్

## సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి కృతజ్ఞతలు







క్వాడ్రంట్ కంపెనీ నూతన భవనం నమూనా

**మడికొండ:** తెలంగాణలో రెండో అతిపెద్ద నగరంగా విస్తరిస్తున్న వరంగల్‌లో ఐటీ అభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం కేసీఆర్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్‌ను ఐటీహబ్‌గా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలు సఫలమవుతున్నాయని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ విజ్ఞప్తుల మేరకు వరంగల్‌ను ఐటీరంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దే యజ్ఞంలో ఒక్కో కంపెనీ భాగస్వామ్యం అవుతున్నాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే సైయంట్, టెక్ మహీం ద్రా కంపెనీలు తమ కార్యకలాపాలు సాగిస్తుండగా మరో అంతర్జాతీయ ఐటీ కంపెనీ మైండ్‌ట్రీ కూడా వరంగల్‌లో సంస్థ ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. తాజాగా 1.5 ఎకరాల్లో క్వాడ్రంట్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించి.. సుమారు 500 మందికి ఉపాధి కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తంచేశారు. కంపెనీ సీఈవో వంశీరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీ రాకతో యువతకు పెద్దఎత్తున ఉపాధి లభించనుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

# మే 20న ఐసెట్

## మార్చి 9 నుంచి దరఖాస్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2020 షెడ్యూల్ విడుదలైంది. కాకతీయ వర్సిటీ ఆధ్వర్యంలో మే 20, 21 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు ఐసెట్ కన్వీనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450, ఇతరులకు రూ.650 ఫీజుగా నిర్ణయించారు. మే 14 నుంచి వెబ్‌సైట్లో హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. జూన్ 12న ఫలితాలు విడుదల చేయనున్నారు. యూజీసీ జాయిం ట్ కమిటీ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సి ల్/డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు గుర్తింపు కలిగి న యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పొం దినవారు మాత్రమే ఐసెట్ రాసేందుకు అవకాశం కల్పించినట్టు ఉన్నతవిద్యామండలి పేర్కొన్నది.

# పనివాళ్లుగా చేరి.. దోచేశారు

- బీహార్ అంతర్రాష్ట్ర ముఠాలోని ముగ్గురు అరెస్టు
- రూ.1.50 కోట్ల విలువైన ఆభరణాలు స్వాధీనం
- అడ్డొస్తే అంతమొందించేందుకు కూడా వెనుకాడరు
- వివరాలు వెల్లడించిన హైదరాబాద్ నగర సీపీ అంజనీకుమార్



బీహార్ ముఠా నుంచి స్వాధీనం చేసుకొన్న ఆభరణాలను చూపిస్తున్న నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ .. (ఇన్‌సెట్లో) రామాశిష్ ముఖియా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** పనివాళ్లుగా ఇళ్లలో చేరి దొంగతనాలకు పాల్పడుతున్న బీహార్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ నగర పోలీసులు అరెస్టు చేశారు. గత డిసెంబర్ 8వ తేదీన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వజ్రాల వ్యాపారి కపిల్ గుప్తా ఇంటి నుంచి దోచుకొన్న ఆభరణాల్లో నుంచి దాదాపు రూ.కోటిన్నర సొత్తును స్వాధీనం చేసుకొన్నారు. ఈ ముఠాను పట్టుకొనేందుకు నగర పోలీసులు బీహార్ రాష్ట్రంలో నెలన్నర కాలంగా తీవ్రంగా గాలించి చివరకు విజయం సాధించారు. బీహార్ రాష్ట్రం మధుబని జిల్లాకు చెందిన ఈ ముఠాపై ఎనిమిది రాష్ర్టాల్లో 50కి పైగా కేసులు ఉన్నాయి. బుధవారం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు, సొత్తు రికవరి విషయాలను మీడియాకు వెల్లడించారు. బీహార్ రాష్ట్రంలోని మధుబని జిల్లా సిజోల్ గ్రామానికి చెందిన రామాశిష్ ముఖియా అలియాస్ కరణ్ వంటమనిషిగా చలమణి అవుతూ కొందరితో కలిసి దొంగతనాలు, దోపిడీలు చేస్తుంటాడు. ఇతడి గ్యాంగ్‌లో సిజోల్‌కు చెందిన భాగవత్ ముఖియా, రాహుల్ ముఖియా, పితాంబర్ మండల్, హరీశ్చంద్ర ముఖియా సభ్యులుగా ఉన్నారు. ముఠా నేత రామాశిష్ ముఖియా దోపిడీకి ఒక నగరాన్ని ఎంచుకొని అక్కడి సంపన్నులు నివసించే ప్రాంతంలో రెక్కీ నిర్వహిస్తాడు. అనంతరం దోపిడీకి ఎంచుకొన్న ఇంట్లో పనిలో చేరుతాడు. చోరీ చేయాలనుకొనే సమయానికి 10-15 రోజుల ముందు మిగతా సభ్యులకు సమాచారం అందిస్తాడు. దాంతో వారు వచ్చి ముఠా నేత ఉండే ఇంటికి సమీపంలోని ఇండ్లలో వంటమనిషి, డ్రైవర్, తోటమాలి, వాచ్‌మెన్.. ఇలా ఏదో ఒక పనిలో కుదురుతారు. ఆయుధాలు కూడా వెంట ఉంచుకొంటారు. ఆ తర్వాత అనుకొన్న విధంగా దోపిడీ చేసి పరారవుతారు. దొంగతనాలు చేసే క్రమంలో చంపడానికి కూడా వెనుకాడరు.

**పోలీసుల చేతికి చిక్కారిలా!**

హైదరాబాద్‌లో చోరీకి పథకం వేసిన రామాశిష్ ముఖియా.. నాలుగునెలలక్రితం బంజారాహిల్స్ చేరుకొని రోడ్ నంబర్ 12లోని వజ్రాల వ్యాపారి కపిల్‌గుప్తా ఇంట్లో వంటమనిషిగా చేరాడు. పక్కాగా ప్లాన్ వేయడంతో మిగతా ముఠా సభ్యులు కూడా వచ్చి బంజారాహిల్స్‌లోని వివిధ ప్రాంతాల్లో పనులకు కుదిరారు. యజమానులకు తమపై నమ్మకం కుదిరేలా ప్రవర్తిస్తారు. డిసెంబర్ 8న వ్యాపారి తన కుటుంబసభ్యులతో కలిసి శంషాబాద్‌లో పెండ్లికి హాజరయ్యేందుకు వెళ్లడాన్ని అదునుగా భావించిన రామాశిష్.. ఇంట్లో దాచిన సుమారు రూ.2.5 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, నగదు తీసుకొని ఉడాయించాడు. మిగతా సభ్యులతో కలిసి ముంబై మీదుగా బిహార్‌లోని తమ స్వస్థలానికి చేరుకొన్నారు. వ్యాపారి ఇంట్లో దొంగతనం ఫిర్యాదు అందగానే రంగంలోకి దిగిన బంజారాహిల్స్ పోలీసులు శాస్త్రీయమైన ఆధారాలు సేకరించి రామాశిష్ ముఠా పనే అని నిర్ధారణకు వచ్చారు. రామాశిష్‌ను పనిలో కుదిర్చిన బోలా ముఖియాను విచారించగా.. గ్యాంగ్‌కు సంబంధించిన ప్రాథమిక సమాచారం లభించింది. బంజారాహిల్స్ డీఐ రవికుమార్ నేతృత్వంలో ఎస్సై భరత్‌భూషణ్ ఆధ్వర్యంలో బీహార్ వెళ్లిన ప్రత్యేక బృందం.. ఎట్టకేలకు గత నెలలో ముఠాకు చెందిన భాగవత్ ముఖియా, హరిశ్చంద్ర ముఖియాను అరెస్టు చేసి వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు ముఠా నాయకుడు రామాశిష్ ముఖియాను పట్టుకొన్నారు.

**విజయవంతంగా అపరేషన్ 'సిజోల్'**

సిజోల్ గ్రామంలో 20 మంది వరకు ఇలాంటి దొంగలు ఉన్నట్టు గుర్తించిన బంజారాహిల్స్ పోలీసులు.. వ్యాపారి ఇంట్లో దోపిడీ మూలాలు సిజోల్‌లోనే ఉన్నట్టు నిర్ధారించుకొని 'ఆపరేషన్ సిజోల్' చేపట్టారు. 45 రోజులపాటు బీహార్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో దొంగల జాడ కోసం జల్లెడ పట్టారు. చివరకు మధుబని జిల్లా పోలీసులు, స్థానికుల సహకారంతో ముఠాను పట్టుకోగలిగారు. దోచుకొన్న ఆభరణాల నుంచి వజ్రాలను వేరుచేసి అత్తగారింటి గోడల్లో దాచి సిమెంట్‌తో మూశారు. కొన్నింటిని పశువుల కొట్టంలో దాచిపెట్టారు. కాగా, ముఠాలో కీలక సభ్యుడైన రాహుల్ ముఖియా పరారీలో ఉన్నాడు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన బంజారాహిల్స్ డీఐ రవికుమార్, ఎస్సై భరత్‌భూషణ్, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుళ్లు జయరాజ్, అహ్మద్, శివశంకర్, హోంగార్డ్ కిషన్‌నాయక్, సిరాజ్, రితేశ్, రామును పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, వెస్ట్‌జోన్ జాయింట్ సీపీ ఏఆర్ శ్రీనివాస్, బంజారాహిల్స్ ఏసీపీ కేఎస్‌రావు తదితరులు అభినందించారు.

# గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల టీచర్ పోస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎన్ బాలాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో లేదా స్థానిక బీసీ స్టడీ సర్కిళ్లలో ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040-24071178, 6302427521 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# అంబేద్కర్ వర్సిటీ సెమిస్టర్ పరీక్ష తేదీల్లో మార్పులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ నాలుగో సెమిస్టర్ పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పులు చేసినట్టు వర్సిటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి ప్రారంభం కావాల్సిన ఈ పరీక్షలను ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలను మార్చి 28 నుంచి, మూడోసెమిస్టర్ పరీక్షలను ముందుగా ప్రకటించినట్టు మార్చి ఒకటి నుంచి ఏడువరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష సమయాల్లో ఎలాంటి మార్పులేదని స్పష్టంచేశారు.. వివరాలకు www.braouonline.in, www.braouonline.ac.in వెబ్‌సైట్లో గానీ లేదా 040-23680241 ఫోన్‌నంబర్లోగానీ సంప్రదించాలని అధికారులు సూచించారు.

# కాకినాడ, తిరుపతి మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 14 నుంచి 16 వరకు సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ మార్గాల్లో నాలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేసినట్టు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి రాకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మార్గంలో రెండు రైళ్లు కేటాయించామని, ఇవి నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరం టౌన్, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ మార్గంలో రెండు ప్రత్యేక రైళ్లు కేటాయించామని, ఇవి నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయని వివరించారు.

**పలు రైళ్లు రద్దు, దారిమళ్లింపు**

సౌత్ వెస్టర్న్ రైల్వేలోని యెలహంక-ధర్మవరం సెక్షన్‌లో డబ్లింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు, కొన్నింటిని తాత్కాలికంగా రద్దు చేయడంతోపాటు మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్టు తెలిపింది. ఈ నెల 17న బెంగళూరు కంటోన్మెంట్-ధర్మవరం, ధర్మవరం-బెంగళూరు కంటోన్మెంట్ మధ్య నడిచే రైళ్లను రద్దుచేసినట్టు పేర్కొంది. 16, 17 తేదీల్లో భువనేశ్వర్-బెంగళూరు, బెంగళూరు-భువనేశ్వర్, కాచిగూడ-యశ్వంతపూర్, యశ్వంతపూర్-కాచిగూడ మార్గాల్లో నడిచే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపింది. 15, 16, 17 తేదీల్లో న్యూఢిల్లీ-బెంగళూరు, ట్యుటికోరిన్-ఓఖా, కోర్బా-యశ్వంతపూర్, ముంబై-నాగర్‌కోయిల్, మైసూరు-సాయినగర్ షిర్డీ, రాజ్‌కోట్-కోయంబత్తూర్ మార్గాల్లో నడిచే రైళ్లను దారిమళ్లించినట్టు వివరించింది.


# రాష్ట్రంలో కరోనా వైరస్ లేదు

## 82 మందికి వైరస్ లక్షణాలు లేవని నిర్ధారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ పట్ల తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క పాజిటివ్ కేసు నమోదుకాలేదని బుధవారం వైద్య విభాగాలు వెల్లడించాయి. గాంధీ దవాఖానలో అనుమానిత లక్షణాలున్నవారికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి నివేదికలు సమర్పిస్తుండటంతో ఆ వైరస్ అనుమానితుల్లో ఆందోళన తగ్గుతున్నది. ఫీవర్, గాంధీ దవాఖానల్లో ఇప్పటివరకు 85 మంది చేరగా.. అందులో 82 మందిలో కరోనా వైరస్ (కొవిడ్-19) లక్షణాల్లేవని నిర్ధారణ అయింది. మిగిలిన ముగ్గురి పరీక్షల ఫలితాలు రావాల్సి ఉన్నది. కరోనా వైరస్‌కు సంబంధించిన అనుమానాల నివృత్తికోసం 040-24651119 నంబర్‌తో 24 గంటల కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.

# రెండున్నర కిలోల బంగారం పట్టివేత

- సూట్‌కేసుల్లో.. జ్యూసర్ మోటర్‌లో తరలింపు
- ఎనిమిది మందిని విచారిస్తున్న డీఆర్ఐ అధికారులు





జ్యూసర్ మోటర్, సుత్తెలో దాచి రవాణా చేస్తూ పట్టుబడిన బంగారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకరు సూట్‌కేసులో.. మరొకరు జ్యూసర్ మోటర్లో.. ఇంకొకరు పేస్ట్‌లా మార్చి.. స్మగ్లర్లు తమకు తోచిన రీతిలో అక్రమంగా బంగారం తరలిస్తున్నారు. వస్తువుల లోపల బంగారాన్ని పెట్టి విదేశాల నుంచి తరలిస్తున్న రెండు ముఠాలను డీఆర్ఐ హైదరాబాద్, ముంబై యూనిట్ల అధికారులు పట్టుకొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు మాటువేసి.. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు జైపూర్ నుంచి వచ్చిన ఇద్దరికి సూట్‌కేస్ ఇస్తుండగా గుర్తించారు. విమానాశ్రయం నుంచి బయటికెళ్లే ద్వారం వద్ద ముగ్గురిని అడ్డుకొని తనిఖీ చేయగా సూట్‌కేసులోని టూల్‌కిట్‌లో సుత్తెలో దాచి తీసుకొస్తున్న రూ.39 లక్షల విలువైన 931 గ్రాముల బంగారం పట్టుబడింది. ఇదే మాదిరిగా మంగళవారం నాడు దుబాయ్ నుంచి వచ్చిన మరో ప్రయాణికుడు జైపూర్ నుంచి వచ్చిన ఇద్దరికి సూట్‌కేస్ ఇస్తుండగా గుర్తించిన ముంబై ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని డీఆర్ఐ అధికారులు పట్టుకొని తనిఖీ చేయగా 931 గ్రాముల బంగారం బయటపడింది. ముంబై నుంచి హైదరాబాద్‌కు మంగళవారం వచ్చిన ఒక విమానంలో ఇద్దరు ప్రయాణికులు బంగారం అక్రమ రవాణా చేస్తున్నట్టు అందిన పక్కా సమాచారంతో డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు తనిఖీ చేయగా.. జ్యూసర్ మోటర్‌లో 160 గ్రాముల బంగారుకడ్డీని దాచి తీసుకొస్తున్నట్టు గుర్తించారు. మరో ప్రయాణికుడు 550 గ్రాముల బంగారాన్ని పేస్ట్ మాదిరిగా చేసి తరలిస్తూ పట్టుబడ్డాడు. దాన్ని కరిగించగా 490 గ్రాముల బంగారంగా తేలిం ది. ఒక్కరోజే రూ.కోటి విలువైన 2.512 కిలోల బంగారం స్వాధీనం చేసుకొని ఎనిమిది మందిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నట్టు డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అదనపు డీజీ డీపీ నాయుడు తెలిపారు.


**TELANGANA UNIVERSITY**
**DICHPALLY, NIZAMABAD - 503 322**

**NOTIFICATION**

Telangana University, Nizamabad invites Sketch Plans from the reputed Architects and Engineers for construction of Science Building at Main Campus TU, Dichpally within one week from the date of issue of this notice.

Selected plans of Architects will be paid remuneration for planning and structural designs / drawings. Service charges may also be furnished.

For the details visit our website **www.telanganauniversity.co.in.**

Place : Nizamabad
Date : 13-02-2020

Sd/-
**REGISTRAR**



# బ్యాలెట్‌కు తిరిగి వెళ్లే ప్రసక్తే లేదు

- సాంకేతిక సమస్యలుంటాయిగానీ.. ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం
- స్పష్టంచేసిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోరా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** బ్యాలెట్ పత్రాల విధానంలో ఎన్నికల నిర్వహణకు మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) సునీల్ అరోరా స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని చెప్పారు. బుధవారం ఆయన ఢిల్లీలో జరిగిన 'టైమ్స్ నౌ సమ్మిట్'లో మాట్లాడుతూ ఈవీఎంల ట్యాంపరింగ్‌పై రాజకీయ పార్టీల నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. ఒక పెన్ను (కలం) లేదా ఒక కారులో మాదిరిగా ఈవీఎంలలో కూడా సాంకేతిక సమస్యలు తలెత్తవచ్చు గానీ వాటిని ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమన్నారు. 20 ఏండ్లుగా దేశంలో ఈవీఎంలతోనే ఎన్నికలు నిర్వహిస్తున్నామని సునీల్ అరోరా గుర్తు చేశారు. సుప్రీంకోర్టుతోపాటు పలు న్యాయస్థానాలు ఈవీఎంలతో ఎన్నికల నిర్వహించడాన్ని సమర్థించాయని చెప్పారు. త్వరలోనే రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి ఎన్నికల సంస్కరణలు, ప్రవర్తనానియమావళిపై చర్చిస్తామని చెప్పారు. ఏకకాలంలో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహించే విషయమై రాజకీయ పార్టీలు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఒకసారి నిర్ణయం తీసుకుంటే ఏకకాలంలో అసెంబ్లీలు, లోక్‌సభకు ఎన్నికల నిర్వహణకు ఈసీ చర్యలు తీసుకుంటుందన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగంపై ఐఐటీ- మద్రాస్‌తో కలిసి ఎన్నికల సంఘం పని చేస్తుందని, ఇది అమల్లోకి వస్తే చెన్నైలో పని చేసే ఒక రాజస్థాన్ వాసి.. అక్కడి నుంచి రాజస్థాన్ ఎన్నికల్లో ఓటేయవచ్చునన్నారు. అయితే, దీనర్థం ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడం కాదని, నిర్దేశిత పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంటుందని సునీల్ అరోరా వివరించారు.

# వంటగ్యాస్ మంట



డొమెస్టిక్ సిలిండర్‌పై **144.50** పెంపు

పెరిగిన భారాన్ని భరిస్తామన్న కేంద్రం

- ఆరేండ్ల తర్వాత రికార్డుస్థాయి పెంపుదల
- కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వంటగ్యాస్ ధర మరోసారి మండింది. 14.2 కిలోల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.144.50 పెంచుతున్నట్టు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు బుధవారం ప్రకటించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మారిన చమురు ధరలకు అనుగుణంగా ధరను పెంచుతున్నట్టు పేర్కొన్నాయి. 2014 జనవరిలో సిలిండర్ ధర ఒకేసారి రూ.220 పెరిగింది. ఆ తర్వాత దాదాపు ఆరేండ్లకు మరోసారి రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయి. అయితే.. వినియోగదారులపై భారం పడకుండా పెరిగిన ధరను రాయితీగా అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గృహ వినియోగదారులకు కాస్త ఊరట లభించింది. ప్రస్తుతం ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.714గా ఉన్నది. పెంపు అనంతరం ధర రూ.858.50కు చేరుకున్నది. ఈ మొత్తాన్ని సిలిండర్ తీసుకునే సమయంలో వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత వినియోగదారుల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది. ప్రస్తుతం సాధారణ వినియోగదారులకు ఒక్కో సిలిండర్‌కు రూ.153.86, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) వినియోగదారులకు రూ.174.86 సబ్సిడీగా అందిస్తున్నారు. పెరిగిన ధరను కేంద్రం భరిస్తామని చెప్పడంతో ఇకపై సాధారణ వినియోగదారులకు రూ.291.48, పీఎంయూవై వినియోగదారులకు రూ.312.48 రాయితీ అందనున్నది. ప్రస్తుతం రాయితీని మినహాయిస్తే సాధారణ వినియోగదారులు ఒక్కో సిలిండర్‌కు రూ. 567.02, పీఎంయూవై వినియోగదారులు రూ.546.02 చెల్లిస్తున్నారు. ఇకపైనా ఈ ధరల్లో ఎలాంటి మార్పు ఉండబోదు.

**ప్రస్తుత ధర:** రూ.**714** (ఢిల్లీలో)
**పెంపు:** రూ.144.50
**కొత్త ధర:** రూ.**858.50**
**ప్రస్తుత సబ్సిడీ:**
రూ.153.86 (సాధారణ కనెక్షన్)
రూ.174.86 (పీఎంయూవై)
**నూతన సబ్సిడీ:**
రూ.291.48 (సాధారణ)
రూ.312.48 (పీఎంయూవై)

**హైదరాబాద్‌లో..**
**ప్రస్తుత ధర:** రూ.**769**
**కొత్త ధర:** రూ.**913.50**

**హైదరాబాద్‌లో..**
హైదరాబాద్‌లో సిలిండర్ ధర ప్రస్తుతం రూ.769గా ఉండగా, పెరిగిన ధరల ప్రకారం వినియోగదారులు రూ.913.50 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో రూ.200.50 సబ్సిడీ రాగా.. ఇకపై రూ.345 రాయితీ బ్యాంకు ఖాతాలో పడుతుంది. సాధారణంగా చమురు సంస్థలు ప్రతి నెల 1వ తేదీన సిలిండర్ ధరలను సమీక్షిస్తాయి. ఈసారి దాదాపు రెండు వారాలు ఆలస్యమైంది.

**ప్రజల జేబులకు షాక్: విపక్షాలు**
వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపుపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. ధరల పెంపుద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజల జేబులకు కరంటుషాక్ ఇచ్చిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుర్జేవాలా విమర్శించారు. ఏడాది కాలంలో సిలిండర్ ధరను రూ.200 వరకు పెంచారని చెప్పారు. ధరల పెంపును నిరసిస్తూ గురువారం దేశవ్యాప్త ఆందోళనలకు ఆలిండియా మహిళా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. మరోవైపు బీఎస్పీ అధినేత్రి మాయావతి తాజా ధరల పెంపును పేదలకు వ్యతిరేకంగా తీసుకున్న 'క్రూరమైన నిర్ణయం'గా అభివర్ణించారు.

# భారత్‌కు ఎప్పుడెప్పుడా..



## ఆసక్తిగా ఎదురుచూస్తున్నానన్న ట్రంప్

గుర్తుండిపోయే స్వాగతం పలుకుతాం: మోదీ

అహ్మదాబాద్‌లో భారీ రోడ్‌షోకు సన్నాహాలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** భారత పర్యటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా భారత్, అమెరికా ఒక వాణిజ్య ఒప్పందం చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రధాని మోదీ ఆహ్వానంపై ట్రంప్ ఈ నెల 24, 25 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న సంగతి తెలిసిందే. గుజరాత్‌లోని అహ్మదాబాద్ కూడా వెళ్లనున్న ట్రంప్.. అక్కడ కొత్తగా నిర్మించిన క్రికెట్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో మోదీతో కలిసి పాల్గొననున్నారు. అమెరికా అధ్యక్ష నివాసం శ్వేత భవనం వద్ద మంగళవారం రాత్రి ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, మోదీ గొప్ప వ్యక్తి అని, భారత్‌కు వెళ్లడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. భారత్‌తో సరైన ఒప్పందం చేసుకోగలిగితే.. తాను దానిపై సంతకం చేస్తానని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. మరోవైపు ట్రంప్ భారత పర్యటన మోదీతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలకు నిదర్శనం అని అమెరికాలో భారత రాయబారి తరణ్‌జిత్‌సింగ్ సంధూ చెప్పారు. గత ఏడాది ఇద్దరు నేతలు నాలుగుసార్లు కలుసుకున్నారు. 50వేల మంది భారత అమెరికన్లతో అమెరికాలోని హ్యూస్టన్‌లో జరిగిన సభలో ఇద్దరు నేతలు పాల్గొన్న సంగతి కూడా తెలిసిందే. ఇక ఈ ఏడాది ట్రంప్, మోదీ రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. 'మోదీతో మాట్లాడాను. అహ్మదాబాద్‌లో వేల మంది భారతీయులు నాకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని మోదీ చెప్పారు. అమెరికాలో 40వేల నుంచి 50వేల మంది మధ్యలో మాట్లాడాను. భారత్‌లో కూడా అదే సంఖ్యలో జనం వస్తే నాకు నచ్చదు' అంటూ ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. 'లక్షల సంఖ్యలో జనం వస్తారని మోదీ చెప్పారు. విమానాశ్రయం నుంచి కొత్త స్టేడియం వరకు 50 లక్షల నుంచి 70 లక్షల మంది నాకు స్వాగతం పలుకవచ్చు. ఆ స్టేడియం ప్రపంచంలోనే అతిపెద్దది. మోదీ ఇప్పుడు దానిని నిర్మిస్తున్నారు' అని ట్రంప్ చెప్పారు. అహ్మదాబాద్‌లో ఇటీవలే మొతెరా స్టేడియాన్ని రూ.70 కోట్లతో నిర్మించారు. ఈ స్టేడియంలో లక్ష మంది ప్రేక్షకులు కూర్చోవచ్చు.

**మన స్నేహం ఉపయోగకరం : మోదీ**
**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ ఈ నెలాఖరులో భారత్ వస్తున్నారని, వారికి 'చిరస్మరణీయ స్వాగతం' పలుకుతామని ప్రధాని మోదీ తెలిపారు. మోదీ ట్విట్టర్ వేదికగా బుధవారం స్పందిస్తూ, 'ప్రజాస్వామ్యానికి, బహుళత్వానికి భారత్, అమెరికా కట్టుబడి ఉన్నాయి. అనేక అంశాలపై ఉభయ దేశాలు విస్తారంగా సహకరించుకుంటున్నాయి. తమ మధ్య స్నేహం ఉభయ దేశాలకే కాకుండా ప్రపంచమంతటికీ ఉపయోగకరంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. హ్యూస్టన్‌లో జరిగిన 'హౌడీ మోదీ' కార్యక్రమం తరహాలో అహ్మదాబాద్‌లో ఓ భారీ రోడ్‌షోకు సన్నాహాలు జరుగుతున్నాయి. సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించనున్న ట్రంప్ ఆ తర్వాత కొత్తగా నిర్మించిన మొతెరా క్రికెట్ స్టేడియాన్ని ప్రారంభిస్తారు.



## పెరిగిపోతున్న మెజారిటీ మతోన్మాదం

అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో మెజారిటీ మతోన్మాదం (మెజారిటేరియనిజం) పెరిగిపోతున్నదని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. 'హిందూ రాజ్య' స్థాపన దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు ఉన్నాయని చెప్పారు. బుధవారం ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. తాను హిందువులకు వ్యతిరేకం కాదన్నారు. మెజారిటీ మతోన్మాదానికి వ్యతిరేకంగా మాత్రమే ఉద్యమిస్తున్నానని పేర్కొన్నారు. మెజారిటీ మతోన్మాదం దేశాన్ని నాశనం చేస్తుందని, మైనారిటీ మతోన్మాదం ఆ వర్గానికే చేటు తీసుకు వస్తుందని తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సరిగ్గానే చెప్పారని అన్నారు. కానీ బీజేపీ సర్కార్.. రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కాలదన్ని మెజారిటీ మతోన్మాదం దిశగా చట్టాలను తీసుకొస్తున్నదని విమర్శించారు.



## అనుమానాస్పద స్థితిలో కుటుంబం మృతి

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని ఈశాన్య ప్రాంతం భజన్‌పురలో ఓ కుటుంబం అనుమానాస్పద స్థితిలో మరణించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ-రిక్షా డ్రైవర్ శంభూచౌదరి (43) ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటిబయట వేసిన తాళం పగులగొట్టి లోపలకు వెళ్లారు. ఇంటిలోపల ఇద్దరు పెద్దలు, ముగ్గురు పిల్లల మృతదేహాలు ఉన్నాయని, అవి బాగా కుళ్లిపోయాయని చెప్పారు. పోస్ట్‌మార్టం తర్వాతే వారి మృతి కారణాలు తెలుస్తాయన్నారు. ఇంటిలో ఎటువంటి ఆయుధం వంటిది దొరకలేదని, దోపిడీ జరుగలేదన్నారు. బీహార్‌కు చెందిన శంభు చౌదరి ఈ ప్రాంతంలో ఈ-రిక్షాను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని పోలీసులు వెల్లడించారు.

'అరకు' హత్యాకాండతో సంబంధమున్న

## జిప్రో హబికా లొంగుబాటు



హబికాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ రిషికేష్

**మల్కన్‌గిరి, ఫిబ్రవరి 12:** ఆంధ్రప్రదేశ్‌లో అరకు టీడీపీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే శివేరి సోమల హత్యలో కీలక పాత్ర పోషించాడని అనుమానిస్తున్న మావోయిస్టు జిప్రో హబికా (30) లొంగిపోయాడు. 2018 సెప్టెంబర్ 23న సర్వేశ్వరరావు, శివేరి సోమను నక్సల్స్ కాల్చి చంపారు. ఈ కేసుతోపాటు 2016 డిసెంబర్‌లో కోరాపుట్ జిల్లా పొట్టంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయిబ్ సర్పంచ్ సుందర్‌రావు కిడ్నాప్, హత్యతోపాటు వాహనాల దగ్ధం కేసులోనూ హబికా నిందితుడని తెలుస్తున్నది. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ రిషికేష్ డీ ఖిల్లారి సమక్షంలో బుధవారం హబికా లొంగిపోయాడు. హబికా ఒడిశాలోని కోరాపుట్ జిల్లా నారాయణపేట ప్రాంత వాసి. 2012లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ఆ పార్టీ హింసాత్మక విధానాలతో విసుగెత్తి జన జీవన స్రవంతిలో కలువాలని నిర్ణయించుకున్నాడని ఎస్పీ చెప్పారు. అతడు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్నాడని, అతడిపై ఒడిశా ప్రభుత్వం రూ.4 లక్షల నగదు రివార్డును ప్రకటించిందని చెప్పారు. అతడికి పునరావాసం కల్పిస్తామని చెప్పారు.

## దళిత బాలికపై సామూహిక లైంగికదాడి

6 నెలలుగా పది మంది యువకుల అఘాయిత్యం

**సోలాపూర్:** దళిత సామాజిక వర్గానికి చెందిన బాలిక(16)పై సామూహిక లైంగికదాడి జరిగింది. పది మంది యువకులు ఆరు నెలలుగా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. గుడి వద్ద ఏడుస్తున్న బాలికను గమనించిన కొందరు పోలీసులకు తెలిపారు. వారు ఆరాతీయగా.. స్నేహితులైన ఐదుగురితోపాటు మరో ఐదుగురు వ్యక్తులు తనను పలు ప్రాంతాలకు తీసుకెళ్లి ఆరు నెలలుగా లైంగికదాడి చేస్తున్నట్లు తెలిపింది. నిందితుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వారానికి ఐదు రోజులే పని

ప్రభుత్వ సిబ్బందికి మహారాష్ట్ర సర్కార్ వరం

**ముంబై:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. సీఎం ఉద్ధవ్ ఠాక్రే అధ్యక్షతన బుధవారం సమావేశమైన మంత్రివర్గం రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు వారానికి ఐదు పనిరోజుల విధానాన్ని అమలులోకి తేవాలని నిర్ణయించింది. ఈనెల 29 నుంచి నిర్ణయం అమలులోకి రానున్నది. అయితే ప్రతి రోజూ 45 నిమిషాల పని సమయాన్ని పెంచారు. వారానికి ఐదు పని దినాల విధానాన్ని తేవాలని ఉద్యోగులు కొన్నేండ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం నుంచి పోలీసులు, అగ్నిమాపక విభాగం, ప్రభుత్వ కళాశాలలను మినహాయించారు.

## నిర్భయ ఢిల్లీకి ఎందుకు వెళ్లింది?

నిర్భయ తాతతో వైద్యాధికారి వివాదాస్పద వ్యాఖ్యలు

విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్



బుధవారం యూపీలోని బల్లియాలో నిర్భయ తాత లాల్జీసింగ్‌తో (ఫొటోలో ఎడమవైపు) వాగ్వాదానికి దిగిన ప్రీతమ్ మిశ్రా

**బల్లియా:** నిర్భయ ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లా వైద్యాధికారి (సీఎంఓ) చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. నిర్భయ స్వగ్రామమైన మెర్‌హ్వార్ కాలా గ్రామంలో ప్రభుత్వం ఆమె పేరుతో ఒక దవాఖానను ప్రారంభించింది. కానీ ఎటువంటి సదుపాయాలు కల్పించకపోగా, డాక్టర్‌ను కూడా కేటాయించలేదు. దీంతో గ్రామస్థులు కొన్ని రోజులుగా ఆందోళన బాట పట్టారు. నిరసనకారులతో మాట్లాడేందుకు మంగళవారం గ్రామానికి వచ్చిన సీఎంఓ డాక్టర్ ప్రీతమ్ మిశ్రా అనుచితంగా వ్యవహరించారు. 'నిర్భయ గ్రామంలో ఒక్కరు కూడా వైద్యవిద్యను అభ్యసించలేదు. కానీ ఇక్కడి ప్రజలకు డాక్టర్లు కావాలి. ముందు వైద్యవిద్యను అభ్యసించి.. ఇక్కడే డాక్టర్‌గా పనిచేయండి. ఈ గ్రామం ఇప్పటివరకు ఒక్క డాక్టర్‌ను కూడా చదివించలేదు. మరి ఇక్కడ దవాఖాన ఎందుకు ప్రారంభించారు' అని వ్యాఖ్యానించారు. నిర్భయ తాత లాల్జీసింగ్‌తో మాట్లాడుతూ 'అసలు నిర్భయ ఢిల్లీకి ఎందుకు వెళ్లింది. ఢిల్లీ వెళ్లాల్సిన అవసరమేమొచ్చింది' అని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ హరిప్రతాప్ షాహి వెంటనే దర్యాప్తుకు ఆదేశించారు.



ఢిల్లీలో కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తున్న ఆశాదేవి

**దోషులకు ఉరిశిక్ష జాప్యంపై కోర్టు వద్ద ఆశాదేవి నిరసన**
**న్యూఢిల్లీ:** దోషులకు ఉరిశిక్ష అమలులో జరుగుతున్న జాప్యంపై నిర్భయ తల్లి ఆశాదేవి బుధవారం ఢిల్లీ కోర్టు వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఏడేండ్లయినా తన కూతురుకు న్యాయం జరుగడం లేదంటూ భావోద్వేగానికి గురయ్యారు. దోషులకు డెత్ వారంట్ జారీ చేయాలంటూ నిర్భయ తల్లిదండ్రులు, ఢిల్లీ ప్రభుత్వం స్థానిక కోర్టును ఆశ్రయించారు. దీనిపై బుధవారం విచారణ సందర్భంగా దోషుల్లో ఒకడైన పవన్‌గుప్తా తన తరఫున వాదించేందుకు న్యాయవాదులెవరూ లేరని విన్నవించాడు. స్పందించిన అదనపు సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా దోషికి న్యాయం సహాయం అందించాలని ఆదేశించారు. దీంతో జిల్లా న్యాయ సేవల సంస్థ తమ వద్దనున్న న్యాయవాదుల జాబితాను పవన్ గుప్తా తండ్రికి ఇచ్చి వారిలో నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలని సూచించింది. డెత్ వారంట్లపై గురువారం విచారణ జరుగనుంది.

## ఢిల్లీ ప్రకంపనలు

# ఇది అమిత్‌షా ఓటమి



- బీజేపీ భావోద్వేగాల వ్యూహం చిత్తయ్యింది
- శివసేన 'సామ్నా' ఎద్దేవా

**ముంబై, ఫిబ్రవరి 12:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కేంద్ర హోంమంత్రి అమిత్ షాదే బాధ్యత అని శివసేన వ్యాఖ్యానించింది. అహంకారపూరిత ధోరణి ఘోరంగా ఓటమి పాలవుతుందని చెప్పడానికి ఆప్ విజయం ఒక సంకేతం అని శివసేన అధికార వార్తాపత్రిక 'సామ్నా' బుధవారం సంచిక సంపాదకీయం పేర్కొంది. బీజేపీ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఇటీవల బాధ్యతలు స్వీకరించినా.. ఢిల్లీ ఎన్నికల ప్రచారం అమిత్‌షా కనుసన్నల్లోనే సాగిందని గుర్తు చేసింది. బీజేపీ అధ్యక్షుడిగా వైదొలిగిన తర్వాతైన ఒక్క రాష్ట్రంలోనైనా గెలువాలన్న అమిత్‌షా కలలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని పేర్కొంది. భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల పునరేకీకరణకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని చెప్పింది. విద్య, ఆరోగ్య, రవాణా రంగాల్లో తన ప్రభుత్వం సాధించిన విజయాలే అస్త్రంగా ప్రచార బరిలో నిలిచిన ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్.. బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, ఎంపీలతోపాటు 'బీజేపీ సైన్యాన్ని' ఒంటిచేత్తో ఎదుర్కొన్నారని ప్రశంసించింది. 'భారతదేశంలో సాధారణంగా భావోద్వేగపూరిత అంశాలపై జరిగే ఎన్నికలతో పోలిస్తే.. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అరుదు' అని వ్యాఖ్యానించింది.

# 16న కేజ్రీవాల్ ప్రమాణం

వేదిక చారిత్రక రామ్‌లీలా మైదానం.. మనీశ్ సిసోడియా వెల్లడి

ఆప్ శాసనసభాపక్ష నేతగా కేజ్రీవాల్ ఎన్నిక



బుధవారం ఢిల్లీలో ఆప్ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** దేశ రాజధాని ఢిల్లీలో హ్యాట్రిక్ విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నూతన సర్కార్‌ను ఏర్పాటు చేయడానికి అడుగులు వేస్తున్నది. ముచ్చటగా మూడోసారి చారిత్రక రామ్‌లీలా మైదాన్‌లో ఈ నెల 16 ఉదయం 10 గంటలకు సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ ప్రమాణం చేయనున్నారు. ఇంతకుముందు కూడా ఇదే మైదానంలో ఆయన రెండుసార్లు సీఎంగా ప్రమాణం చేశారు. కేజ్రీవాల్‌తోపాటు క్యాబినెట్ మంత్రులంతా ప్రమాణం చేస్తారని ఆప్ సీనియర్ నేత, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బుధవారం మీడియాకు తెలిపారు. క్యాబినెట్‌లోకి ఎవరిని తీసుకోవాలన్న అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. అయితే ప్రస్తుతం క్యాబినెట్‌లో ఉన్న మంత్రులను తిరిగి తీసుకోవాలని కేజ్రీవాల్ యోచిస్తున్నట్లు సమాచారం. అయితే యువ నేతలు ఆతిషి మర్లేనా, రాఘవ చద్దాలకు క్యాబినెట్‌లో చోటు కల్పించే అవకాశం ఉంది. భవిష్యత్‌లో పార్టీలో వారు కీలక పాత్ర పోషిస్తారని ఆప్ వర్గాలు తెలిపాయి. రామ్‌లీలా మైదాన్‌లో సీఎంగా కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారాన్ని తిలకించేందుకు భారీగా ఢిల్లీ వాసులు తరలి రావాలని మనీశ్ సిసోడియా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ అసెంబ్లీలోని 70 స్థానాలకు 62 స్థానాలను ఆప్ కైవసంచేసుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు బుధవారం కేజ్రీవాల్ తన నివాసంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలంతా కేజ్రీవాల్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఇదిలా ఉంటే బుధవారం ఉదయం కేజ్రీవాల్ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటు, ప్రమాణ స్వీకారం ఏర్పాట్లపై వారు చర్చించారని సమాచారం.

## 'కేజ్రీవాల్‌కు ఉగ్రవాది అనే పదం సరైనదే!'

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే ఓపీ శర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు మనోజ్ తివారీతో బుధవారం భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'కేజ్రీవాల్ అవినీతిపరుడు. ఉగ్రవాదుల పట్ల సానుభూతి చూపాడు. పాకిస్థాన్ సైన్యం అధికార ప్రతినిధి పాత్రను పోషిస్తున్నాడు. భారత సైన్యంపై తరుచుగా ప్రశ్నలు సంధిస్తున్నాడు. తుక్డే తుక్డే గ్యాంగ్‌కు మద్దతు తెలుపుతున్నాడు. కేజ్రీవాల్‌కు ఉగ్రవాది అనే పదం తగినదే' అని శర్మ పేర్కొన్నారు.

## ఆప్ ఎమ్మెల్యే కాన్వాయ్‌పై కాల్పులు

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



నరేశ్ యాదవ్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఆప్ కొత్త ఎమ్మెల్యే నరేశ్ యాదవ్ కాన్వాయ్‌పై కాల్పులు జరిగాయి. గుడికి వెళ్లిన ఆయన కారులో ఇంటికి తిరిగి వస్తుండగా కిషన్‌గఢ్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఒక కారులో వచ్చిన వ్యక్తులు ఆప్ ఎమ్మెల్యే వాహన శ్రేణిలోని మరో కారులో ఉన్నవారిపై తుపాకీతో కాల్పులు జరుపగా, ఆప్ కార్యకర్త అశోక్ మన్ మరణించగా, మరో కార్యకర్త గాయపడినట్లు చెప్పారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని ధర్మేందర్ అలియాస్ కల్లుగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మృతుడు అశోక్, నిందితుడు ధర్మేందర్ మధ్య కొంతకాలంగా వివాదం ఉన్నదని, గత ఏడాదితోపాటు ఇటీవల ఇరువురు పోట్లాడుకున్నారని పోలీసులు చెప్పారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత కక్షలతోనే అశోక్‌పై ధర్మేందర్ కాల్పులు జరిపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌కు శస్త్రచికిత్స చేయాలి

ఢిల్లీలో పార్టీని పునర్నిర్మించాలి: మొయిలీ



**బెంగళూరు/రాయ్‌పూర్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయంపై కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పరిస్థితిపై సమీక్షించి, పునర్నిర్మించడానికి శస్త్రచికిత్స తరహాలో కార్యచరణ (సర్జికల్ యాక్షన్) చేపట్టాలని సూచించారు. బుధవారం మొయిలీ విలేకరులతో మాట్లాడుతూ 'బీజేపీని ఓడించగల శక్తి కేజ్రీవాల్‌కు మాత్రమే ఉన్నదని ఓటర్లు గ్రహించారు. కాబట్టి కాంగ్రెస్‌కు ఓటు వేసినా ప్రయోజనం ఉండదని.. పైగా ఆప్, కాంగ్రెస్ మధ్య ఓట్లు చీలి బీజేపీకి లబ్ధి చేకూరుతుందని భావించారు. అందుకే కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఆప్‌కు తరలిపోయింది' అని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ స్పందిస్తూ మతాల మధ్య విద్వేషాన్ని రగిలించడానికి ఎవరైతే ప్రయత్నిస్తున్నారో, సీఏఏను ప్రజలపై రుద్దడానికి ఎవరైతే ప్రయత్నిస్తున్నారో (బీజేపీని ఉద్దేశించి) వారిని ప్రజలు ఓడించారని చెప్పారు.

## 'ఆప్' గెలుపు ఓ వెలుగు రేఖ

**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వ చీకటి పాలనలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గెలుపు ఓ వెలుగు రేఖ లాంటిదని కశ్మీర్‌కు చెందిన సీపీఎం నేత యూసుఫ్ తరిగామి అభివర్ణించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కశ్మీర్‌లోని రాజకీయ నేతలపై తరుచుగా ప్రజా భద్రత చట్టాన్ని ప్రయోగించడం కన్నా రాష్ట్రాన్ని సెంట్రల్ జైల్‌గా ప్రకటిస్తే సరిపోతుందని సూచించారు. అప్పుడు గృహనిర్బంధంలో ఉన్న నేతలపై ప్రజా భద్రత చట్టాన్ని ప్రయోగించడం తప్పుతుందన్నారు.

## ఏఐసీసీ నేత పీసీ చాకో రాజీనామా



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ పార్టీ ఢిల్లీ ఇన్‌ఛార్జి పీసీ చాకో తన పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఎన్నికల్లో ఓటమిపై ఢిల్లీ కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారు. 2013 నుంచే ఢిల్లీలో పార్టీకి గడ్డు రోజులు మొదలయ్యాయని నాటి సీఎం దివంగత షీలా దీక్షిత్‌పై చాకో పరోక్షంగా విమర్శలు చేశారు. మరోనేత శర్మిష్ఠ ముఖర్జీ పార్టీ నేత చిదంబరంపై విరుచుకుపడ్డారు. ఆప్ విజయాన్ని చిదంబరం ప్రశంసించడాన్ని తప్పుపట్టిన శర్మిష్ఠ.. 'అన్ని రాష్ట్రాలలో బీజేపీపై ఇతరులు పోరాడుతారు.. ఇకపై మన రాష్ట్ర పార్టీ శాఖలను మూసేద్దాం' అంటూ మండిపడ్డారు. 'బీజేపీని ఓడించే బాధ్యతను కాంగ్రెస్ ప్రాంతీయపార్టీలకు వదిలేసిందా? మన ఓటమి గురించి చిం తించకుండా ఆప్ విజయంపై ఎందుకు సంబురపడుతున్నారు?' అంటూ చిదంబరాన్ని నిలదీశారు.



ఆర్టికల్ 370 రద్దు తర్వాత విదేశీ రాయబారుల రెండోబ్యాచ్ బుధవారం జమ్ముకశ్మీర్‌లో అడుగుపెట్టింది. 25 మందితో కూడిన ఈ బృందం రెండు రోజులపాటు కశ్మీర్‌లో పర్యటించనున్నది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై అధ్యయనం చేయనున్నది. ఈ సందర్భంగా వారు ప్రఖ్యాత దాల్ సరస్సులో విహరిస్తున్న దృశ్యం.



కేజ్రీవాల్ హనుమాన్ అనుగ్రహంతోనే విజయం సాధించానని చెప్పుకున్నాడు. కాబట్టి కేజ్రీవాల్ ఢిల్లీలోని అన్ని పాఠశాలలు, మదర్సాలు, విద్యాలయాల్లో హనుమాన్ చాలిసాను తప్పనిసరి చదివేలా చేయాలి. మన పిల్లలకు కూడా హనుమాన్ అనుగ్రహం కావాలి.

**విజయ్ వర్గీయ, బీజేపీ నేత**

ఢిల్లీలో ఆప్ అఖండ విజయం సాధించింది. దేశ నలుమూలల నుంచీ ఢిల్లీలో ఉన్న ప్రజలు, ఢిల్లీ వాసులు బీజేపీ అనుసరిస్తున్న విచ్ఛిన్నకర రాజకీయాలను ఓడించారు. రాబోయే ఆశావహ కాలానికి మార్గం వేసిన ఢిల్లీ వాసులకు నా వందనాలు.

**పి.చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి**



### చరిత్రలో నేడు



**1633**
సూర్యుని చుట్టూ భూమి తిరుగుతున్నదని చెప్పినందుకు రోమ్ పాలకుల ముందు విచారణ ఎదుర్కొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త గెలీలియో.

**1917**
జర్మనీ గూఢచారి అన్న అనుమానంతో అరెస్టయిన డచ్ నర్తకి మెటహరి.





**1945**
జర్మనీలోని డ్రెస్‌డెన్‌పై మిత్రరాజ్యాల వైమానిక దాడి. 22 వేల మంది మృతి.

దేశ రాజధాని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అఖండ విజయం సాధించింది. తన పాలనా విధానానికి ఢిల్లీ ఎన్నికలు 'ప్రోగ్రెస్ రిపోర్ట్'గా చెప్పుకున్న కేజ్రీవాల్ 2015 ఫలితాలను పునరావృతం చేశారు. ఎప్పటిలాగానే బీజేపీ హిందుత్వను, పాకిస్థాన్ బూచీని నమ్ముకొని ప్రచారం చేసింది. కానీ ఢిల్లీ ప్రజలు స్థానిక పాలనావిధానాలకే పట్టం గట్టారు. హిందుత్వవాదాన్ని ఢిల్లీ ఓటర్లు తిరస్కరించారు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

భారత్, శ్రీలంక మధ్య దౌత్య, సహకార సంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా ఇరుదేశాలు అడుగులు వేస్తున్నాయి. శ్రీలంక అధ్యక్షుడు గోటబయ రాజపక్స గత నవంబర్‌లో భారత్ పర్యటించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో అనేక ఒప్పందాలపై చర్చించారు. ఇందులో ఇరుదేశాల మధ్య నిఘా సమాచారం పంచుకోవటం, రక్షణ సంబంధ సహకారానికి పెద్ద పీట వేశారు. అలాగే శ్రీలంకలో విమానరంగ సర్వీసుల అభివృద్ధికి భారత్ సాయాన్ని కోరింది. అలాగే శ్రీలంక, మాల్దీవ్స్, భారత్ మధ్య త్రైపాక్షిక సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వటం గమనార్హం.

**ది హిందూ**



# గ్రామ స్వరాజ్యం

అధికారులు, నాయకులు చిత్తశుద్ధితో, సమన్వయంతో వ్యవహరిస్తే మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటుచేసిన కలెక్టర్ల సమావేశం ఒక కొత్త శకానికి నాంది పలుకుతుందనుకోవచ్చు. మొదటి పర్యాయం అధికారంలో ఉన్నప్పుడు గ్రామీణాభివృద్ధికి పునాదులు ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు, స్థానిక నాయకుల క్రియాశీల భాగస్వామ్యంతో ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలుచేయాలని భావిస్తున్నారు. ఇందుకు అధికారులను తద్వారా నాయకులను కార్యోన్ముఖులను చేసేందుకే మొదటగా కలెక్టర్ల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. చిన్న జిల్లాలను ఏర్పాటుచేయడం కేసీఆర్ వ్యూహంలో కీలకమైన అంశం. స్థానిక సంస్థలు సజావుగా ఉండటం కోసం ఒక అదనపు కలెక్టర్‌ను ఏర్పాటుచేశారంటే ప్రభుత్వ పథకాల అమలులో ఎంత కృతనిశ్చయంతో ఉన్నారో తెలుస్తున్నది. గ్రామస్థాయిలో అన్ని కార్యకలాపాలను సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి చేయడం కలెక్టర్ల ముందున్న కర్తవ్యం. వ్యవసాయరంగంలో మార్పులను, పారిశ్రామీకరణ క్రమాన్ని సులభతరం చేయడం, మానవ వనరుల సద్వినియోగం మొదలైన అంశాలూ కలెక్టర్లు దృష్టిపథంలో ఉండాల్సిందే. జిల్లా యంత్రాంగం తమ బాధ్యతలను ఏ ఒక్క రంగానికో పరిమితమని భావించకూడదు. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాలను పథకాలను అర్థం చేసుకొని వ్యవహరించాలె.

కేసీఆర్ చెప్పినట్టు తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడాలంటే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు కలిసికట్టుగా కృషిచేయాలె. ప్రజలను భాగస్వాములను చేయాలె. ప్రజలు కూడా చైతన్యవంతులై తమ బాధ్యతలను గుర్తించాలె. గ్రామస్థాయిలో ఈ పరివర్తన చోటుచేసుకుంటే మొత్తం తెలంగాణ సమాజమే మారిపోతుంది. గతంలో మాదిరిగా గ్రామ పంచాయతీలు ఏ బాధ్యతలు లేకుండా నిధులను ఉపయోగించుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇప్పుడు గ్రామాభివృద్ధి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు జవాబుదారీతనం వహించకతప్పదు. వీరు తమ విధి నిర్వహణలో విజయవంతం కావాలంటే, ప్రజలను భాగస్వాములను చేయాల్సిందే. గతంలో చైతన్యవంతులైన ప్రజలు ఉంటే వారి అడ్డు తొలిగించుకోవాలని నాయకులు భావించేవారు. ప్రజలను సమస్యలపై చర్చించకుండా ముఠాలు కట్టేవారు. ఇప్పుడు ప్రజల సహకారం కోరి తమ విధులను నిర్వర్తించుకోవడమే ఉత్తమమైన పద్ధతి అని గ్రహిస్తారు. ఈ క్రమంలో అధికారులపై కూడా ఒత్తిడి పెరుగుతుంది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించడంతోపాటు ప్రభుత్వ పథకాలను అమలుచేయవలసి ఉంటుంది. ఇందుకు గ్రామ స్థాయి నాయకులు, ప్రజలు క్రియాశీలం కావాలని వారు కోరుకోవచ్చు. కానీ ఈ క్రమంలో తమ అధికార యంత్రాంగంపై వచ్చే ఆరోపణలను కూడా స్వీకరించవలసి వస్తుంది. రాజకీయ నాయకత్వం, అధికార బృందం పరస్పరం పోటీపడాలె, జోడు గుర్రాల్లా కలిసి పరుగెత్తాలె. అటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడే రాష్ట్రస్థాయిలో ఎంతో అధ్యయనం చేసి రూపొందించిన పథకాలు సక్రమంగా అమలుకు నోచుకుంటాయి. కేసీఆర్ ఏర్పాటుచేసిన కలెక్టర్ల సమావేశం ఇందుకు నాంది కావాలె.

> **సంపూర్ణ స్వాతంత్ర్యానికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అవకాశాలు లభించాలని కూడా మహాత్మాగాంధీ భావించారు. గ్రామ సీమలను సుసంపన్నం చేసేందుకు కేసీఆర్ రూపొందించిన అనేక పథకాలు ఈ లక్ష్యానికి అనుగుణమైనవే. మహాత్మా గాంధీ 150 జయంతి సంవత్సరమిది. గ్రామస్వరాజ్యం రావాలంటూ కలలుగన్న మహాత్ముడికి ఇచ్చే నిజమైన నివాళి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచిస్తున్న కార్యాచరణను అమలుచేయడమే.**

పంచాయతీరాజ్ వ్యవస్థ ఈనాటిది కాదు. గ్రామస్వరాజ్యాన్ని ప్రబోధించిన గాంధీజీ దీనికొక తాత్విక భూమికను అందించారు. అనాదిగా భారతదేశంలో గ్రామ పాలన ఉండటమే కాదు, గ్రామాలు స్వయం పోషకంగా ఉండేవి. స్వాతంత్ర్యానంతరం 1950 దశకంలోనే దీనిపై కమిటీ వేయడంతో పునాదులు పడ్డాయి. స్థానికసంస్థలను ఏర్పాటుచేసే ప్రయత్నాలు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో దశలవారీగా సాగాయి. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో 1992 నాటి రాజ్యాంగ సవరణ మైలురాయి వంటిది. అయినా క్షేత్రస్థాయిలో మార్పు రాలేదు. ఇందుకు రాజకీయ నాయకత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం ఒక కారణమైతే, ప్రజల చైతన్యస్థాయి మరో కారణం. పరిపాలనావ్యవస్థను పరిశీలించి ప్రభుత్వ పథకాల అమలుకు, గ్రామస్థాయి రాజకీయ సంస్కృతికి ఉన్న లంకెను కనిపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు గాంధీజీ కలలుగన్న గ్రామ రాజ్యాన్ని నెలకొల్పడానికి పట్టుదలగా ఉన్నారు. అట్టడుగు స్థాయిలో రాజకీయ, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని తీసుకొనిపోయే వాహనంగా ఆయన పంచాయతీరాజ్ వ్యవస్థను అభివర్ణించారు. గ్రామ గణతంత్రాలు స్వయం పోషకాలు కావాలని, స్వావలంబన సాధించాలని ఆయన బోధించారు. ప్రజలందరు కనీస జీవన ప్రమాణాలు కలిగి ఉండాలని ఆకాంక్షించిన గాంధీజీ ఈ లక్ష్యసాధనకు స్థానికసంస్థల ప్రాధాన్యాన్ని గుర్తించారు. సంపూర్ణ స్వాతంత్ర్యానికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అవకాశాలు లభించాలని కూడా మహాత్మాగాంధీ భావించారు. గ్రామ సీమలను సుసంపన్నం చేసేందుకు కేసీఆర్ రూపొందించిన అనేక పథకాలు ఈ లక్ష్యానికి అనుగుణమైనవే. మహాత్మా గాంధీ 150 జయంతి సంవత్సరమిది. గ్రామస్వరాజ్యం రావాలంటూ కలలుగన్న మహాత్ముడికి ఇచ్చే నిజమైన నివాళి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచిస్తున్న కార్యాచరణను అమలుచేయడమే.

జనగళం

## సామాన్యుడేం చేయగలడు?

**చాపకింది నీరులా**
ప్రవహించగలడు
తూము కింద ప్రవాహమై
ముంచెత్తగలడు
చాయ్‌వాలా చేత
నీళ్ళు తాగించగలడు

సామాన్యుడేం చేయగలడు?
అప్పుడప్పుడు
వెలిగిపోగలడు
కొండొకచో
వెలిగించగలడు
వెలుగుతున్నానని విర్రవీగితే
నీ తల తెంచగలడు

సామాన్యుడేం చేయగలడు?
కన్నీళ్లు తుడువగలడు
కంటి తడిని
ఆపగలడు
లేని కన్నీళ్ళను నటిస్తే
కంట నీరు తెప్పించగలడు

సామాన్యుడేం చేయగలడు?
గల్లీని మార్చగలడు/ ఢిల్లీని ఏలగలడు
ఏమార్చే వారికి
మూర్ఛ తెప్పించగలడు

అతడు/ పేరుకే సామాన్యుడు
శివమెత్తితే అసామాన్యుడు

అతడు
జూలు విదిలిస్తే
కోట గోడలు కూలుడే
ఊడ్చుకుంటూ పోతే/ చక్రవర్తి అయినా
చెత్తలో చేరుడే/ చరిత్రలో నిలుచుడే.

**– విలాసాగరం రవీందర్, 9440932934**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



**టంకశాల అశోక్**

# రాష్ట్ర బీజేపీ వింత వైఖరి

**తెలంగాణ అభివృద్ధి అవసరాల పట్ల ఇక్కడి బీజేపీ వైఖరి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. పాలించేది ఎవరైనా అభివృద్ధి అనేది రాష్ట్రానికి ఒక మౌలిక అవసరం. ఈ వాస్తవాన్ని గుర్తించి వ్యవహరించే పార్టీలనే ప్రజలు విశ్వసిస్తారు. ఇది మరిచిన బీజేపీ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రస్థాయిలో తమ పలుకుబడిని ఉపయోగించే బదులు, కేంద్రం నుంచి రాష్ట్రం ఏదైనా కోరటమే తప్పన్నట్లు ప్రతిదానికి రాజకీయ దాడి చేస్తున్నది. ఇది ప్రజలు హర్షించగల ధోరణి కాదు. ఒక పార్టీగా ఏ రాజకీయాలు చేసుకున్నా దానిని అభివృద్ధితో కలగలపటం మాత్రం మెచ్చదగిన పని కాదు.**

మతాన్ని రాజకీయాలతో కలగలిపితే, ప్రజలు మతతత్వాన్ని గాక అభివృద్ధి-సంక్షేమం మోడల్‌నే ఎంచుకుంటారని, అప్పుడు నిన్నటి తెలంగాణ, నేటి ఢిల్లీ అసెంబ్లీల వంటి ఫలితాలే ఉంటాయని గ్రహించాలి. 2014లో తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర బీజేపీ తీసుకుంటున్న వైఖరిని ఒకసారి గమనించండి. అప్పుడు ఇక్కడ కేసీఆర్ ప్రభుత్వం, కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాయి. కొత్త రాష్ట్రం అయినందున, అనేక దశాబ్దాలుగా అంతర్గత వలస దోపిడీకి గురై వెనుకబడిపోయింది గనుక అభివృద్ధి అవసరాలు అనేకం ఉంటాయి. అందుకోసం కావలసిన సహాయానికి కేంద్రం వైపు చూడటం సహజం. సహాయాన్ని అందించవలసిన బాధ్యత కేంద్రంపై మామూలుగానే రాజ్యాంగానుసారం ఉంటుంది. వెనుకబడిన రాష్ట్రాలకు మరింత సహకరించవలసిన అదనపు బాధ్యత కూడా ఉంటుంది. నిబంధనల ప్రకారమే గాక, విచక్షణ ఆధారంగా మరిన్ని నిధులు ఇచ్చే వెసులుబాటు కేంద్ర ఆర్థిక సంఘం కల్పిస్తున్నది. ఆ ప్రకారం గతంలో కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వాలుగాని, బీజేపీ, ఎన్డీయే ప్రభుత్వాలు గాని చేస్తూ వస్తున్నదే తప్ప అందులో కొత్త లేదు. వాస్తవానికి ఈ విచక్షణ వెసులుబాటును గతంలో కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటూ వచ్చాయి. తమకు నచ్చని రాష్ట్ర ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేయటం, నచ్చినవాటికి చేతికి ఎముకలేని పద్ధతిలో నిధులివ్వటం ఒక ఆనవాయితీగా మారింది. మన ఫెడరల్ వ్యవస్థలోని కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాల్లో ఇదొక నిరంతర వివాదంగా మారింది.

ఇటువంటి పరిస్థితుల మధ్య కేంద్రం నుంచి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు సంపాదించుకోవటం వేర్వేరు రాష్ట్రాలకు వలెనే తెలంగాణకు కూడా ఒక నిరంతర యుద్ధంగా మారింది. 2014 నుంచి మొదలుకొని గత ఆరేండ్లుగా ఇదేవిధంగా సాగుతుండగా, ఈ విషయమై తెలంగాణ బీజేపీ వైఖరి ఏమిటి? ఈ నాయకత్వం ఈ గడ్డకు చెందినదే. ఇక్కడి కష్టసుఖాలు తెలిసినదే. స్వరాష్ట్ర సాధన విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల వలె దోబూచులాడటం గాక నిజాయితీగా నిలబడినటువంటిదే. దానిని బట్టి చూసినప్పుడు రాష్ట్రావతరణ తర్వాత రాష్ట్ర అభివృద్ధి అవసరాల పట్ల కూడా అదేవిధమైన తెలంగాణ భక్తిని చూపాలి. వారు ఆ పని చేసినట్లయితే రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడటమేగాక, ప్రధానమంత్రి మోదీ 2014లోనే రాష్ట్రాలకు హామీ ఇచ్చిన సహకార ఫెడరలిజం ప్రకటనకు అనుగుణంగా ఉండేది. ఇటు తెలంగాణ అవసరాలను, అటు రాజ్యాంగ నిబంధనలను, మరొకవైపు బీజేపీ చేసుకుంటూ రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువగా రాబట్టేందుకు ప్రయత్నించవలసింది. పైన అనుకున్నట్లు నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులలో కేంద్రానికి గల విచక్షణాధికారాలు తక్కువకావు గనుక, దానిని అనువుగా చేసుకుంటూ ఎంతో సాధించవలసింది. ఆ పని చేస్తూ అందుకు ప్రచారం కూడా చేసుకున్నట్లయితే, ఈ ఆరేండ్లలో తమకు ప్రజాదరణ ఎంతో లభించి ఉండేది. అంతమాత్రాన అధికారానికి వచ్చినా రాకపోయినా, ప్రజల దృష్టిలో విశ్వసనీయత మాత్రం ఇపుడు కనిపిస్తున్న దానికన్న ఎక్కువ ఉండేది. కానీ అంతా విరుద్ధంగా జరిగింది.

తెలంగాణ ఏర్పాటును గట్టిగా బలపరిచిన బీజేపీ ఆ మేరకు ప్రజలలో కొంత అభిమానాన్ని సంపాదించి కూడా సీట్లు గెలువలేకపోవటం తెలిసిందే. అందుకు కారణాల చర్చ ఇక్కడ అక్కరలేదు గాని, ఆ తర్వాత నుంచి వారు సరైన పాఠాలు గ్రహించి రాష్ట్ర అభివృద్ధికి చేయూతనిస్తూ, ప్రజల ఆదరణను సంపాదించటానికి బదులు మొదటినుంచే రాజకీయ క్రీడలు ఆరంభించారు. తమది రాజకీయ పార్టీ అయినందున ఒకవైపు అటువంటి క్రీడలు సాగించినప్పటికీ మరొకవైపు రాష్ట్ర అభివృద్ధికి సహకరించవలసింది. రాజకీయాలు ఒకస్థాయిలో ఏమి ఉన్నా, ప్రధానంగా ప్రజల విశ్వాసం సంపాదించటం సరైన వ్యూహమవుతుంది. రాష్ట్ర అభివృద్ధికి సహకరించటం వల్ల అది సాధ్యమయ్యేది. కానీ ఈ రాజకీయ సూక్ష్మం అర్థం కాని తెలంగాణ బీజేపీ నాయకులు పూర్తిగా రాజకీయ క్రీడలో పడి కొట్టుకుపోయారు. ఇప్పటికీ అదే చేస్తున్నారు. ఇది జరుగుతూ వచ్చిన క్రమమెట్టిది?

తెలంగాణ ఏర్పడిన కొత్తలో వారు ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా మోదీకి విధేయునిగా ఉండగలరని ఆశించారు. రాష్ట్ర అవసరాల కోసం కేంద్రంలోని బీజేపీకి రాజకీయంగా అండగా నిలవగలరని, రాజ్యసభలో తమకు ఆధిక్యత లేనందున అక్కడ సహకరించగలరని భావించారు.

> కేసీఆర్ ప్రభుత్వంపై దాడిచేసి, పథకాలకు, నిధులకు మోకాలడ్డి ఆ క్రమంలో లభించే పబ్లిసిటీని చూసి బీజేపీ నేతలు ఆనందించటం కనిపిస్తున్నదే. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిబంధనల ప్రకారం ఏమి అడిగినా, అవసరాల దృష్ట్యా కొన్ని అదనంగా కోరటం అన్ని రాష్ట్రాలు చేసేదే అయినందున ఆ ప్రకారం చేసినా, అదేదో మహా నేరం, దేశద్రోహం అయినట్లు వెంటనే విరుచుకుపడటం తెలంగాణ బీజేపీ నేతలకు ఒక ఆనవాయితీగా మారింది. ఉదాహరణకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా కావాలని కోరితే ఆ మాట విభజన చట్టంలో లేదంటూ వాదించేవారి తీరు జుగుప్సాకరంగా లేదా?

అదే క్రమంలో పుణ్యంతో పాటు పురుషార్థం అన్నట్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా తమ వ్యక్తిగత ప్రయోజనాలను నెరవేర్చుకోవాలనుకున్నారు. ఇది పూర్తిగా లోగడ ఇక్కడ చంద్రబాబు, ఢిల్లీలో వాజపేయి ఉండినప్పటి తరహా నమూనా. కానీ టీఆర్ఎస్ విషయానికి వచ్చేసరికి తమ అంచనాల ప్రకారం జరుగలేదు. కేసీఆర్ కేంద్రంతో మంచికి మంచి చెడుకు చెడు అన్నట్లు స్వతంత్ర వైఖరి తీసుకున్నారు. మరొకవైపు మోదీ ప్రభుత్వం తెలంగాణ కోసం ప్రత్యేకంగా ఏమీ చేయకపోగా, తన అవసరాల కోసం ఒక దశ అంతా రాజకీయంగా అస్పష్ట వైఖరిని అవలంబించింది. దీనంతటి మధ్య తెలంగాణ బీజేపీ నేతలు అయోమయానికి గురయ్యారు. ఇక్కడ తమ పార్టీ పెరుగుదల కోసం కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించాలో లేక మోదీ ప్రభుత్వానికి రాజకీయ అవసరాలుంటాయి గనుక మెతకదనం చూపాలో వారికి అర్థం కాలేదు. 2014-18 చివరి దశకు వచ్చేసరికి పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సూచన మేరకు కేసీఆర్‌పై దాడి అయితే మొదలుపెట్టారు గాని, ఇన్నాళ్ళు నీడకు నిద్రపోయిన ఎద్దు ఇప్పుడు దున్నమంటే దున్నుతుందా అన్నట్లు తయారైంది పరిస్థితి. అయితే ఈ మొదటి విడుత కాలమంతా రాష్ట్ర బీజేపీ చేసిన అతిపెద్ద తప్పు రాష్ట్ర అవసరాల సాధన కోసం కేంద్ర స్థాయిలో ఎటువంటి కృషి చేయకపోవటం. తక్కిన విషయాలు ఎట్లున్నా వారికి ప్రజల్లో విశ్వసనీయతకు సంబంధించి మొదటి విడుతలో నష్టం చేసింది, ఇప్పుడు 2019 నుంచి రెండవ విడుతలోనూ నష్టం చేస్తున్నదిదే.

సరిగ్గా ఇక్కడనే గమనించదగ్గ మరొక విషయం ఉంది. మొదటి విడుత చివరిదశలో అమిత్ షా సూచనల మేరకు వీరు టీఆర్ఎస్ ప్రభుత్వంపై దాడి ప్రారంభించినట్లు పైన చెప్పుకున్నాం. కేసీఆర్ తమకు పూర్తి విధేయునిగా ఉండగలరనే భ్రమలు ఆ సరికి తొలగటం, ఇక్కడ స్వతంత్రంగా ఎదుగాలనుకోవటం అందుకు కారణం. అంతవరకు మంచిదే. కానీ కేసీఆర్‌పై దాడిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలపై సైతం దాడి చేయటం మొదలుపెట్టారు. రెండింటిని విడిగా చూస్తూ కేసీఆర్‌పై దాడి, రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి అనే వ్యూహాన్ని అనుసరిస్తే ప్రజలు దానిని ఆ విధంగా అర్థం చేసుకుంటారు. కానీ కేసీఆర్ పాలనలో అభివృద్ధి జరిగితే ఆ పేరు ఆయనకు పోతుందని, అటువంటప్పుడు రాష్ట్ర అవసరాల కోసం తాము ఢిల్లీలో ఎందుకు ప్రయత్నించాలని హ్రస్వదృష్టితో ఆలోచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరే వాటిపై ఫిర్యాదులు చేసి మోకాలు అడ్డుపెడితే ఆ నష్టాలు, అపఖ్యాతి కేసీఆర్ ఖాతాలోకి పోయి ప్రజలు బీజేపీ వైపు మళ్లుతారని అంచనాలు వేశారు. ఇది ఎంతమాత్రం వివేకం లేని రాజకీయమని చెప్పేందుకు పాండిత్యం అక్కరలేదు. రాష్ట్రానికి ఎన్నో అవసరాలుంటాయి గనుక కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతూనే ఉంటుంది. ఆ కోరికలు ఒకోసారి మితిమీరినవి కూడా కావచ్చు. అయినా అడుగటం తప్ప రాష్ట్రాలకు మార్గాంతరం లేదు. ముఖ్యంగా కేంద్రం రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాలకు, హక్కులకు, ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రతిఘటించటం, డిమాండ్లు చేయటంలో తప్పేమిటి? మన దేశంలో సోకాల్డ్ సహకార ఫెడరలిజం చరిత్ర అంతా రాష్ట్రాల హక్కులను హరించి కేంద్రీకరణలను పెంచటం, ఆ స్థితిని రాష్ట్రాలు ప్రతిఘటించటం చరిత్రగానే మారలేదా? ఇదిగాక రాష్ట్ర విభజన చట్టంలో గల అనేక అంశాలను మోదీ ప్రభుత్వం సాగదీస్తుండటం వల్ల తెలంగాణకు కలుగుతున్న నష్టాలు ఇక్కడి బీజేపీ నాయకులకు తెలియనివా? రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కనపెట్టి అన్ని పార్టీలు ఒకటి కావాలనే సూత్రం వారు విననిదా?

కేసీఆర్ ప్రభుత్వంపై దాడిచేసి, పథకాలకు, నిధులకు మోకాలడ్డి ఆ క్రమంలో లభించే పబ్లిసిటీని చూసి బీజేపీ నేతలు ఆనందించటం కనిపిస్తున్నదే. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిబంధనల ప్రకారం ఏమి అడిగినా, అవసరాల దృష్ట్యా కొన్ని అదనంగా కోరటం అన్ని రాష్ట్రాలు చేసేదే అయినందున ఆ ప్రకారం చేసినా, అదేదో మహా నేరం, దేశద్రోహం అయినట్లు వెంటనే విరుచుకుపడటం తెలంగాణ బీజేపీ నేతలకు ఒక ఆనవాయితీగా మారింది. ఉదాహరణకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా కావాలని కోరితే ఆ మాట విభజన చట్టంలో లేదంటూ వాదించేవారి తీరు జుగుప్సాకరంగా లేదా? పార్టీని ఒక పద్ధతి ప్రకారం పాజిటివ్‌గా ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించుకోలేని అసమర్థులు, విభజన తర్వాత కూడా అదే అసమర్థత చూపుతున్నవారు తమను తాము ఇటువంటి కుహనా వ్యూహాలకు బందీలుగా మార్చుకున్నారు. ఆ విధంగా వారు తమకు తాము హాని చేసుకుంటే ప్రజలకు అభ్యంతరం ఏమీ ఉండనక్కరలేదు. కానీ తెలంగాణ ప్రయోజనాలకు సైంధవులుగా మారితే మాత్రం తప్పకుండా అభ్యంతరకరమే.

# అభివృద్ధికి ప్రతీక మేడారం

సంస్కృతి



**రమేశ్ హజారి**

సోషియాలజీలో మానిఫెస్ట్ ఫంక్షన్స్, (ఉద్దేశింపబడిన కార్యాలు) లేటెంట్ ఫంక్షన్స్ (ఒక కార్యం ద్వారా లభించే అనుద్దేశపు ఫలం) అనే అంశమొకటి ఉన్నది. ఒక పనిని చేపట్టినప్పుడు మనం సదరు పనిని ఏమి ఉద్దేశించి చేస్తున్నామో.. అది నెరవేరుతూనే.. దాంతో పాటు ఉద్దేశింపబడని అదనపు కార్యం కూడా మనకు తెలియకుండానే నెరవేరడమనే సామాజిక సిద్ధాంతాన్ని మాలినోవిస్కీ అనే ఫ్రెంచి సోషియాలజిస్ట్ ముందుకుతెచ్చాడు. దీన్నే రాబర్ట్ మర్టన్ అనే సామాజిక శాస్త్రవేత్త మరింతగా అభివృద్ధి చేసిండు.

ఒక మతం అనేది ఆయా సమాజాల్లోని మనుషులను కట్టుబాట్లలో పెట్టి కొన్ని నిర్దిష్ట ప్రామాణిక విలువలతో సహజీవనం చేసే ఏర్పాట్లను చేస్తుంది. ఇది ఆ మతం మానిఫెస్ట్ ఫంక్షన్. అదే సందర్భంలో ఆ మతం నెరవేర్చే లేటెంట్ ఫంక్షన్ ఏమంటే ఆ మతాన్ని ఆచరించే మనుషుల నడుమ ఐక్యత సాధించడం. ఈ నేపథ్యంలోంచి మనం సమ్మక్కసారలమ్మ జాతరను అర్థం చేసుకోవచ్చు. సమ్మక్క సారక్క మేడారం జాతర జరుపడంలోని ఉద్దేశం (మానిఫెస్ట్ ఫంక్షన్) ఏందంటే దేవతల జాతర. హిందు మతంలోని అన్ని భక్తిమార్గాల మాదిరే ఇక్కడికీ జనం వెల్లి తమ మొక్కులు తీర్చుకుంటారు. కానీ ఈ జాతర ద్వారా మనం అర్థం చేసుకోవాల్సిన లేటెంట్ ఫంక్షన్ ఉంది. అది తెలుసుకుందాం. మేడారం జాతర ద్వారా మనం మూడు ముఖ్యమైన అదనపు నిర్వచనాలను అర్థం చేసుకోవాల్సి ఉంటది. హిందూ తత్వం అంటే మత రాజకీయవాదులు చెప్పే మనువాద హిందుత్వమే కాదు, మూలవాసి హిందుత్వం కూడా ఉన్నదని సమ్మక్క-సారక్క జాతర నిరూపించిన మొదటి అంశం. ఇక రెండోది- తెలంగాణలోని గోదావరి లోయ ప్రాంతమంటే కల్లోలిత ప్రాంతమని తూపాకులు తూటాల మోతలనే వలసపాలనలోని ప్రతీకలకు విరుగుడుగా కాళేశ్వర ప్రాజెక్టుల ద్వారా వాగులై వంకలై సాగునీరై పారుతున్న ప్రాణహిత గోదావరి జీవజలంగా మారిపోయింది. తద్వారా అడివి జీవితాల్లో మైదాన ప్రాంతాల్లో మారుతున్న అభివృద్ధి ఆనవాళ్లను కన్నేపల్లి అడవిలో సరికొత్త ప్రతీకలకు అద్దం పట్టింది. ఇక మూడోది- నాగరికులంటే నగరాల్లో జీవించేవాళ్లు కాదు. ప్రకృతితో మమేకమై జీవించేవాళ్లు అనే అసలు సిసలు జీవన నిర్వచనాన్ని జాతర ఇచ్చింది. ఇట్లా మూడు రకాలుగా మన మెదళ్ల మీద ఇన్నాళ్లు రుద్దబడిన ప్రతీకాత్మక రూపక ప్రతీకలను రద్దుచేసి వాటి స్థానంలో వినూత్న ప్రతీకలను ముందుకుతెచ్చే మానిఫెస్ట్ ఫంక్షన్‌ను మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మనకు అందించింది.

**సమ్మక్క సారలమ్మ జాతర-మూలవాసీ హిందుతత్వం:** హిందూమత రూపంలో ఆధిపత్య విలువలు నడిపిస్తున్న మెయిన్ స్ట్రీమ్ సంస్కృతికి భిన్నంగా పంచభూతాలే కేంద్రంగా, గుడి లేని, తలుపులు తాళం లేని తనంతో ప్రకృతి దేవతలను కొలిచి మొక్కే ఓ సబ్బండ భారత మూలవాసీ సామాజిక సంస్కృతి ఇది. గుడి కడితేనే గుణం కుదురుకుంటుంది, భక్తి పరవశిస్తుందనే సంప్రదాయ మత విశ్వాసానికి భిన్నమైనది ఇది. గుడి లేని, తలుపులు లేని, సమ్మక్క-సారక్క గద్దెల మీదినుంచి భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక జ్ఞానబోధ చేసింది. అసలు సిసలు భారత ఆధ్యాత్మిక తాత్వికతకున్న మూలాల మాయిముంతను దోలాడి పట్టి మతం ముసుగున కొనసాగుతున్న విచ్ఛిన్న నిర్వచనాల బూజును తొలిగించిన మహా క్రతువే సమ్మక్క-సారక్క జాతర.

తెలంగాణకే తలమానికమై సబ్బండ జాతులను తలెత్తుకునేలా చేస్తున్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నిజంగా ఒక అప్రకటిత 'ములవాసి హిందూ' జాతీయ పండుగ. ఈ జాతర దేశీయ సాంస్కృతిక వారసత్వ సంపద. ఇందులో తరగని ఆధ్యాత్మికత వేదాల పురాణాల భావనలకన్నా లక్షల రెట్లు విస్తరించి ఉన్నది. అన్ని మతాల మానవులు కోట్లాదిగా తరలి వచ్చి మొక్కిన మేడారం.. మొత్తంగా లౌకికవాద అలౌకికత్వాన్ని ప్రోదిచేసుకున్నది. గంగా జమునా తెహజీబ్ అనే దేశీయ సంస్కృతికి సరికొత్త నిర్వచనాన్ని అందిస్తూ సాగిన మేడారం జాతర వర్తమాన మత రాజకీయాలకు విరుగుడుగా నిలిచింది. సర్వమత ప్రేమికుడు ధార్మిక దార్శనికుడు సీఎం కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా సాగిన సమ్మక్క సారక్కల జన మేళా విజయవంతమవ్వడం వెనుక ప్రజల అలౌకిక భావనే కాదు, తెలంగాణ పాలకుల లౌకికవాద ఆధ్యాత్మికత దాగి ఉన్నదని నిరూపించింది.

> నాటి సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తికి కొనసాగింపుగా ఆవిష్కృతమైన కేసీఆర్ స్వయం పాలన, నాడు కోల్పోయిన సుందర మనోహర చిత్ర ప్రతీకలను సరికొత్తగా ముందుకుతెస్తున్నది. నాటి స్వయం పాలనకోసం పోరాడిన సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న వనవీరుల రక్తంతో తడిసింది. నేడు తెలంగాణ కోసం అదే స్ఫూర్తిని కొనసాగించి సాగునీటి జలాలతో ఆ రక్తపు మరకల జ్ఞాపకాల స్థానంలో అభివృద్ధి ఆనవాళ్లను ప్రవేశపెట్టింది. నేడు సాగునీటి సెలయేటి సవ్వళ్ళు వినిపిస్తున్నవి. జంగల్‌లోని ఆదివాసీల జమీన్లో నిత్య జల ప్రవాహంతో జల్‌జంగల్ జమీన్ అనే ఉద్యమ నినాదాన్ని నాటి మన్యం వీరుల స్ఫూర్తిని వాస్తవీకరిస్తున్నది.

**గోదావరి లోయకు మారుతున్న రూపక ప్రతీక:** గోదావరి లోయ తెలంగాణ రాకముందు, సాగునీటి అభివృద్ధి జరుగకముందు గోచరమయ్యే ప్రతీకలు కల్లోలిత ప్రాంతం, సాయుధ పోరాటం. ఇది వలస పాలనలోని 'గోదావరి లోయ' అనే పదానికి మెటాఫర్. కానీ నేడు అదే గోదావరి లోయ తన రూపాన్ని తానే తీర్చిదిద్దుకునే కాళేశ్వర జీవజల ప్రాంతమైం ది. అభివృద్ధికి ఆనవాలుగా మారుతున్నది. స్వయం పాలనలో తెలంగాణ వినూత్న ప్రతీకలకు నెలువవుతున్నది. నిన్నటిదాకా నిత్యం భయకంపితులను చేసే అభద్రత. ఇందుకు కారణం అడవిలోని క్రూరమృగాలు కాదు.. జీవనదులను ఎండబెట్టి, వాన నీటిని మళ్లించి మైదానంలోని బతుకులను ఎడారి చేసి, తెలంగాణ భావితరాన్ని అడవిపాల్జేసిన నాటి క్రూర వలస పాలన. తత్ఫలితంగా అమరుల రక్త తర్పణలతో తల్లడిల్లిన అడవితల్లి ఆక్రందన. దశాబ్దాలుగా అట్లా కొనసాగిన పోరాట ప్రతీకలు ఇప్పుడు రూపం మార్చుకొని సరికొత్తగా జీవం పోసుకున్నాయి. ఇందుకు సమ్మక్క సారక్క జాతర ఒక చారిత్రక నిదర్శనం.


నాటి సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తికి కొనసాగింపుగా ఆవిష్కృతమైన కేసీఆర్ స్వయం పాలన, నాడు కోల్పోయిన సుందర మనోహర చిత్ర ప్రతీకలను సరికొత్తగా ముందుకుతెస్తున్నది. నాటి స్వయం పాలన కోసం పోరాడిన సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న వనవీరుల రక్తంతో తడిసింది. నేడు తెలంగాణ కోసం అదే స్ఫూర్తిని కొనసాగించి సాగునీటి జలాలతో ఆ రక్తపు మరకల జ్ఞాపకాల స్థానంలో అభివృద్ధి ఆనవాళ్లను ప్రవేశపెట్టింది. నేడు సాగునీటి సెలయేటి సవ్వళ్ళు వినిపిస్తున్నవి. జంగల్‌లోని ఆదివాసీల జమీన్లో నిత్య జల ప్రవాహంతో జల్‌జంగల్ జమీన్ అనే ఉద్యమ నినాదాన్ని నాటి మన్యం వీరుల స్ఫూర్తిని వాస్తవీకరిస్తున్నది.

**తెలంగాణ ధార్మిక దార్శనికత దేశానికి అవసరం:** సీఎం కేసీఆర్ దార్శనికతతో అన్ని శాఖలు అద్భుతమైన సమన్వయంతో సమ్మక్క-సారలమ్మ దిగ్విజయం చేయడం చారిత్రాత్మకం.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# నయా వాల్ రాహుల్..!



**స్థానమేదైనా.. పిచ్ ఎలాంటిదైనా.. ప్రత్యర్థి ఏ జట్టయినా.. అదే దూకుడు, అదే ఆత్మవిశ్వాసం, అదే నిలకడతో లోకేశ్ రాహుల్ రెచ్చిపోతున్నాడు. పరుగుల వరద పారిస్తూ టీమ్ఇండియాకు ఆపద్బాంధవుడిలా మారాడు. ఓపెనింగ్, మిడిలార్డర్.. బ్యాటింగ్‌లో ఎక్కడొచ్చినా దుమ్ముదులుపుతున్న రాహుల్... వికెట్ కీపింగ్‌లోనూ అంతే మెరుగ్గా రాణిస్తున్నాడు. ఎంతో ప్రతిభ ఉన్నా.. మూడు నెలల క్రితం వరకు జట్టులోకి వస్తూ పోతూ ఉన్న ఈ కర్ణాటక కెరటం తనలోని కసినంతా పరుగులుగా మలుస్తూ విశ్వరూపమే చూపుతున్నాడు. జట్టు అవసరాలకు అనుగుణంగా రాణిస్తూ.. దిగ్గజ రాహుల్ ద్రవిడ్‌తో పోల్చేంతలా ఈ రాహుల్ ఆకట్టుకుంటున్నాడు.**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

రాహుల్ ద్రవిడ్.. భారత క్రికెట్ దిగ్గజం. తన అత్యున్నత టెక్నిక్, అసమాన ప్రతిభ, అంకితభావంతో ప్రపంచ మేటి బౌలర్లకు చెమటలు పట్టించాడు. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా క్రీజులో పాతుకుపోయి ఎన్నో సార్లు జట్టును పరాజయాల నుంచి కాపాడాడు. జట్టుకు ఆపద్బాంధవుడిగా పేరు తెచ్చుకున్నాడు. అవసరమైనప్పుడల్లా వికెట్ కీపింగ్ చేస్తూ అన్ని విధాల జట్టు కోసం ద్రవిడ్ చెమటోడ్చాడు. పరిమిత ఓవర్ల వరకు క్రికెట్ దిగ్గజం సచిన్‌తో విరాట్ కోహ్లీని కొందరు పోల్చినా మరో ద్రవిడ్ అంటూ ఇంకెవరినీ అనలేదు. అయితే, ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు ద్రవిడ్‌తో పోల్చగల ఆ పేరున్న ప్లేయరే వచ్చాడు. అతడే టీమ్ఇండియా నయా స్టార్ కేఎల్ రాహుల్. మూడు నెలల క్రితం వరకు భారత జట్టులో చోటు ఉంటుందో లేదో అనే అనుమానం నుంచి ఇప్పుడు జట్టులో అతడు ఉండాల్సిందేనన్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్లేస్ కోసం పడిగాపుల నుంచి ప్రధాన ప్లేయర్‌గా ఎదగడం వరకు కేఎల్ రాహుల్ కెరీర్ ఒడిదొడుకులపై ప్రత్యేక కథనం..

### దేశవాళీల్లో నిరూపించుకొని...

టీమ్ఇండియా టెస్టు, వన్డే జట్టులో చోటు కోల్పోయాక కర్ణాటక కెరటం కేఎల్ రాహుల్ దేశవాళీ క్రికెట్‌లో విశేషంగా రాణించాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ 2019-20లో 66.44సగటుతో 598 పరుగులతో అదరగొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ 52కు పైగా సగటుతో 331పరుగులు చేశాడు. దీంతో టీమ్ఇండియా సెలెక్టర్ల నుంచి రాహుల్‌కు మళ్లీ పిలుపొచ్చింది.

### కొత్త అవతారం

వెస్టిండీస్ తర్వాత శ్రీలంకతో స్వదేశంలో జరిగిన టీ20 సిరీస్‌లోనూ కేఎల్ రాహులే టాప్ స్కోరర్‌గా నిలిచి ఏ దశలోనూ తగ్గేదిలేదన్నట్టు చెలరేగాడు. అయితే, గాయం నుంచి కోలుకున్న ధవన్.. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం జట్టులోకి వచ్చేశాడు. ధవన్‌ను కాదనలేని పరిస్థితి.. సూపర్ ఫామ్‌లో ఉన్న రాహుల్‌ను తప్పిస్తే జట్టుకే నష్టం.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ నంబర్ వన్ ర్యాంకు ఆటగాడు, కెప్టెన్ కోహ్లీనే నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ధవన్, రోహిత్ శర్మను ఓపెనింగ్‌కు పంపి రాహుల్ (47)ను వన్‌డౌన్‌లో పంపాడు. అయితే, ఆ ప్రయోగం సఫలం కాకపోవడంతో రాహుల్‌ను ఆ తర్వాతి మ్యాచ్‌లో మిడిలార్డర్‌లో బరిలోకి దింపారు. పంత్‌కు గాయమవడంతో తొలి మ్యాచ్ నుంచి రాహుల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. రెండో వన్డేలో ఐదో స్థానంలో వచ్చిన రాహుల్ విశ్వరూపమే చూపాడు. 52 బంతుల్లోనే 80పరుగులు బాది తనలో మంచి ఫినిషర్ ఉన్నాడని నిరూపించుకున్నాడు. జట్టు గెలుపులో ప్రధాన పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను దక్కించుకున్నాడు. రాహుల్ లాంటి బ్యాట్స్‌మన్‌ను వదులుకోవడం ఎంతో కష్టమని కోహ్లీ సైతం అన్నాడంటే అతడి ప్రదర్శన ఎలా ఉందో అర్థమవుతుంది. కీపర్‌గానూ రెండు క్యాచ్‌లు సహా ఓ స్టంపింగ్‌తో రాణించాడు. చివరి వన్డేలో మళ్లీ ఓపెనర్‌గా వచ్చాడు. మొత్తం మూడు మ్యాచ్‌ల్లో 146పరుగులతో అదరగొట్టి జట్టులో చోటు పక్కా చేసుకున్నాడు.

### ఒకేఒక్కడిగా..

న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్ ఇండియా పేలవ ప్రదర్శన చేసినా.. రాహుల్ తన ప్రైమ్‌ఫామ్‌ను కొనసాగించాడు. ఈ సిరీస్‌లోనూ బ్యాటింగ్ ఆర్డర్ ఐదో స్థానంలో దిగిన కేఎల్.. తొలి వన్డేలో 64బంతుల్లోనే 88పరుగులు బాది జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. రెండో మ్యాచ్‌లో త్వరగానే వెనుదిరిగినా.. చివరి మ్యాచ్‌లో రెట్టించిన కసితో ఆడాడు. శతకం(112) బాది జీవిత కాల ఫామ్‌ను కొనసాగించాడు. ఇక వన్డేల్లో కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో స్థిరపడట్టేనని చెప్పొచ్చు.

### కివీస్ గడ్డపై సింహనాదం..

గత నెల ప్రారంభమైన న్యూజిలాండ్ పర్యటనలో కేఎల్ రాహుల్ దూకుడు మరింత పెరిగింది. అతడి షాట్ల ఎంపిక, ఆత్మవిశ్వాసం, హిట్టింగ్ చూసి వారెవ్వా అనని క్రికెట్ అభిమాని ఉండడు. సిక్సర్లు కొట్టడం ఇంత సులువా అనుకునేలా అతడు బాదిన కొన్ని షాట్లకు మాజీలు సైతం ఫిదా అయిపోయారు. ఐదు మ్యాచ్‌ల్లో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ రెండు అర్ధశతకాలు సహా 224పరుగులతో విదేశీ గడ్డపైనా మెరుపులు మెరిపించాడు. 56కు పైగా సగటు నమోదు చేయడంతో పాటు సిరీస్‌లో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. సిరీస్‌ను 5-0తో కివీస్‌ను టీమ్ఇండియా క్లీన్‌స్వీప్ చేయడంలో ప్రధాన పాత్ర రాహుల్‌దే.

### కీపర్‌గానూ సఫలం

స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో రిషభ్ పంత్ గాయపడడంతో వికెట్ కీపింగ్ బాధ్యతలను కేఎల్ రాహుల్ చేపట్టాడు. దేశవాళీ సహా ఐపీఎల్‌లోనూ కీపింగ్ చేసిన అనుభవంతో ఆ బాధ్యతను రాహుల్ చక్కగా నిర్వర్తించాడు. రెగ్యులర్ కీపర్‌కు ఏ మాత్రం తగ్గకపోవడం, పంత్ కూడా పేలవంగా ఆడుతుండడంతో న్యూజిలాండ్‌తో సిరీస్‌కు అతడు రెగ్యులర్ కీపర్‌గా ఎంపికయ్యాడు. కివీస్ గడ్డపై బ్యాటింగ్‌లో రాణించిన తీరుగానే గ్లౌస్‌తోనూ అదరగొట్టాడు. క్యాచ్‌లు ఒడిసిపట్టుకోవడంలోనూ, స్టంపౌట్లు చేయడంలోనూ ఎక్కడా తడబడలేదు.

### ఎందుకలా..

ఇంత భీకర ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్‌కు న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ కోసం జట్టులో చోటు దక్కలేదు. ఈ విషయంపై జహీర్ ఖాన్ సహా కొందరు మాజీ క్రికెటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇక అభిమానులైతే సోషల్ మీడియా వేదికగా హోరెత్తించారు. మూడు ఫార్మాట్లలో ఏ పరిస్థితుల్లోనైనా రాణించే సామర్థ్యంతో పాటు ఏ స్థానంలోనైనా ఆడే రాహుల్‌ను ఎందుకు తీసుకోలేదని సెలెక్టర్లపై ప్రశ్నల వర్షం కురిపించారు.


### ప్రారంభం అదిరినా..

దేశవాళీ క్రికెట్‌లో నిరూపించుకొని 2014 డిసెంబర్‌లో ఆస్ట్రేలియా గడ్డపై కేఎల్ రాహుల్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాతి నెలలో తాను ఆడిన రెండో టెస్టులోనే భీకర ఆసీస్ బౌలింగ్‌ను ఎదుర్కొని సిడ్నీలో శతకంతో కదం తొక్కాడు. 2017 వరకు 4శతకాలతో పాటు 43పైగా బ్యాటింగ్ సగటుతో రాణించాడు. ఆ తర్వాత సంప్రదాయ ఫార్మాట్‌లో రాహుల్ తడబాటు మొదలైంది. తర్వాతి రెండేండ్లలో జరిగిన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ పర్యటనల్లో ఆకట్టుకోలేకపోయాడు. దీంతో కర్ణాటకకే చెందిన మయాంక్ అగర్వాల్.. రాహుల్ స్థానంలో వచ్చాడు. వన్డేల్లోనూ 2016లో అరంగేట్రం చేసిన రాహుల్ ఏ స్థితిలోనూ క్రమంగా అవకాశాలు దక్కించుకోలేకపోయాడు. దేశవాళీలు, ఐపీఎల్‌తో పాటు అప్పుడప్పుడూ రాణించడంతో 2019 ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కింది. విశ్వకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో 45కు పైగా సగటుతో 361పరుగులతో రాహుల్ ఆకట్టుకున్నాడు. కానీ ఆ తర్వాత విండీస్‌తో ఆ దేశంలో జరిగిన సిరీస్‌లో చోటు కోల్పోయాడు. అయితే, పొట్టిఫార్మాట్‌లో 2016లో అరంగేట్రం చేసిన కేఎల్ రాహుల్ నిలకడగా అదరగొడుతూ.. టీమ్ ఇండియా టీ20 జట్టులో మాత్రం రెగ్యులర్ ప్లేయర్‌గానే కొనసాగుతున్నాడు.

### రాహుల్ 2.0

గాయం కారణంగా స్వదేశంలో గతేడాది డిసెంబర్‌లో వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు శిఖర్ ధవన్ దూరమయ్యాడు. దీంతో కేఎల్ రాహుల్ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. ఇది వరకు జరిగిన తప్పులను పునరావృతం చేయకూడదని నిశ్చయించుకున్న లోకేశ్.. విండీస్‌పై ప్రతాపం చూపాలని నిశ్చయించుకున్నాడు. దేశవాళీల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో తనను తాను నాయకుడిగా భావించుకొని ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆడాడు. ఆ సిరీస్‌లో బ్యాటింగ్ శైలితోనే అతడు ఈ విషయాన్ని తేటతెల్లం చేశాడు. మూడు టీ20ల్లో రెండు అర్ధశతకాలు సహా 164పరుగులు చేశాడు. దీంతో తర్వాతి మూడు వన్డేల సిరీస్‌కు సైతం ఓపెనర్‌గానే కొనసాగాడు. ఈ సిరీస్‌లోనూ ఓ శతకం సహా 185 పరుగులతో సత్తాచాటాడు.

### 12వ ఆటగాడిగా కూడా శతకం చేస్తావ్



కేఎల్ రాహుల్ భీకర ఫామ్‌పై టీమ్ఇండియా ఓపెనర్ శిఖర్ ధవన్ ఇన్‌స్టాగ్రామ్‌లో చమత్కారంగా పోస్ట్ పెట్టాడు. 'బాగా ఆడావు, అద్భుతమైన శతకం. ఇలాగే సమర్థవంతంగా కొనసాగు రాహుల్. నీ బ్యాటింగ్ తీరు చూస్తుంటే.. ఒకవేళ జట్టులో 12వ ఆటగాడిగా ఉన్నా శతకం చేస్తావనిపిస్తున్నది' అని ధవన్ పేర్కొన్నాడు.

## 17న సీఎం క్రికెట్ టోర్నీ

ట్రోఫీ, జెర్సీలను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సీఎం కేసీఆర్ క్రికెట్ టోర్నీ జెర్సీ, ట్రోఫీలను బుధవారం రవీంద్రభారతిలో ఆవిష్కరిస్తున్న క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న క్రీడాశాఖ ఆధ్వర్యంలో సీఎం టీ-10 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు పర్యాటక, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విన్నర్, రన్నర్ ట్రోఫీలు, క్రీడాకారుల జెర్సీలను బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆయన ఆవిష్కరించారు. టాలీవుడ్ తల్వార్స్, టాలీవుడ్ టీవీ ఆర్టిస్ట్స్, టాలీవుడ్ టెలివిజన్ హీరోస్, టీఎన్జీవోస్, టీజీవో, పోలీస్, సీఐఐ, ప్రెస్‌క్లబ్, ఎమ్మెల్యేలతో టీంలను ఏర్పాటు చేశామని, మొత్తం తొమ్మిది జట్లతో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తామని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. టోర్నీ అనంతరం మొక్కలు నాటనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అరుణ్‌కుమార్, హైదరాబాద్ సిటీ, జిల్లా శాఖల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కృష్ణయాదవ్, హరికృష్ణ, టీజీవో జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేన్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో సీఎం కేసీఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం




**వరంగల్ స్పోర్ట్స్:** సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా టోర్నీ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి టోర్నీలకు ఆతిథ్యమిచ్చే విధంగా స్టేడియం నిర్మాణం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈనెల 17 వరకు జరిగే టోర్నీలో 32 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వహణ కమిటీ కన్వీనర్ ఉదయ్ భానురావు వెల్లడించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, కార్పొరేటర్లు విజయ్‌భాస్కర్, రమేష్, శ్రీనివాస్, డిన్న, గణేష్ పాల్గొన్నారు.

# ఆందోళనకరం

పడకేసిన పారిశ్రామికోత్పత్తి • నిరుత్సాహపరిచిన తయారీ రంగ కార్యకలాపాలు

డిసెంబర్‌లో -0.3 శాతంగా నమోదు • మెజారిటీ సంస్థల్లో నిరాశ, నిస్పృహలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**




దేశీయ పారిశ్రామికోత్పత్తి మళ్లీ పడకేసింది. గతేడాది డిసెంబర్‌లో -0.3 శాతంగా నమోదైంది. కీలకమైన తయారీ రంగంలో ఉత్పత్తి క్షీణించడం పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)ని రుణాత్మకంలోకి నెట్టింది. 2018 డిసెంబర్‌లో ఐఐపీ వృద్ధిరేటు 2.5 శాతంగా ఉన్నట్లు బుధవారం అధికారిక గణాంకాల ద్వారా స్పష్టమవుతున్నది. నిరుడు ఆగస్టు నుంచి వరుసగా మూడు నెలలపాటు మైనస్‌లోనే నమోదైన గణాంకాలు.. నవంబర్‌లో తిరిగి వృద్ధిని సంతరించుకున్నాయి. ఆగస్టులో -1.4 శాతం, సెప్టెంబర్‌లో -4.6 శాతం, అక్టోబర్‌లో -4 శాతంగా నమోదైన ఐఐపీ.. నవంబర్‌లో 1.8 శాతానికి పెరిగింది. మళ్లీ డిసెంబర్‌లో గణాంకాలు నిరాశపరిచాయి. తయారీ రంగంలో ఉత్పాదక రేటు 2019 డిసెంబర్‌లో -1.2 శాతంగా ఉన్నది. 2018 డిసెంబర్‌లో 2.9 శాతం వృద్ధిగా నమోదవడం గమనార్హం. విద్యుదుత్పత్తి కూడా 0.1 శాతానికి పడిపోయింది. 2018 డిసెంబర్‌లో 4.5 శాతంగా ఉన్నది. అయితే గనుల రంగంలో మాత్రం ఉత్పత్తి 5.4 శాతానికి పెరిగింది. అంతకుముందు ఇది -1 శాతంగా ఉన్నది. అయినప్పటికీ ప్రధానమైన తయారీ రంగంలో కార్యకలాపాలు నిరుత్సాహకరంగా ఉండటం ఐఐపీని స్థూలంగా దెబ్బతీసింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) ఏప్రిల్-డిసెంబర్ వ్యవధిలో ఐఐపీ వృద్ధిరేటు కేవలం 0.5 శాతానికే పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఇదే కాలంలో 4.7 శాతం వృద్ధిరేటు ఉన్నది. కాగా, క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి, పెట్టుబడుల ప్రామాణిక సూచీ క్రిందటేడాది డిసెంబర్‌లో -18.2 శాతానికి పతనమైంది. అంతకుముందు డిసెంబర్‌లో 4.2 శాతం వృద్ధి కనిపిస్తున్నది. మొత్తంగా తయారీ రంగంలోని 23 పరిశ్రమల్లో 16 ప్రతికూల వృద్ధినే సూచిస్తుండటం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతిపై భయాల్ని పెంచుతున్నది.

### మోడువారిన ఆశలు

డిసెంబర్‌లో ఐఐపీ గణాంకాలు మైనస్‌లోకి జారుకోవడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక రంగంలో మోడువారిన ఆశలకు కొత్త చిగురులు వేస్తున్నాయన్న ఆనందం లేకుండా పోయిందని డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుంకీ మజుందార్ అన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న విపత్కర పరిస్థితులు.. భారతీయ పారిశ్రామిక రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నదన్న మజుందార్.. కరోనా వైరస్ చైనాతోపాటు భారత్‌ను తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. చైనాలో తాత్కాలికంగా చాలా సంస్థలు మూతబడ్డాయని, దీనివల్ల భారత్‌లోని ఎలక్ట్రానిక్స్, ఆటో పరిశ్రమ ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. చైనా నుంచి ఆయా రంగాల్లోకి విడిభాగాల సరఫరా నిలిచిపోవడమే ఇందుకు కారణమని స్పష్టం చేశారు.




## వాట్సప్ @ 200 కోట్లు

ప్రపంచ జనాభాలో 25% మంది యూజర్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వినియోగదారులను ఆకట్టుకోవడంలో వాట్సప్ దూసుకుపోతున్నది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాట్సప్‌కు 200 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. ప్రపంచ జనాభాలో 25 శాతం మంది వాట్సప్‌ను వినియోగిస్తుండటం విశేషం. గతేడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్..వాట్సప్‌కు నెలలో 150 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారని, ఒక్కరోజు 6000 కోట్ల మేసేజ్‌లు వెళ్లుతున్నాయని, వాట్సప్‌కు అతిపెద్ద మార్కెట్ భారతేనని వ్యాఖ్యానించారు. గతేడాది జూలైలో సంస్థకు భారత్‌లో 40 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఫేస్‌బుక్‌కు చెందిన ఈ సామాజిక వెబ్‌సైట్ వాట్సప్ వినియోగదారులు ప్రస్తుతం 200 కోట్లకు చేరుకున్నారని, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి.


## అంతా బాగు

ఈ ఏడాదిపై సహారా చీఫ్ సుబ్రతా రాయ్ ఆశాభావం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ఈ ఏడాది తమ సమస్యలన్నీ పరిష్కారం కాగలవన్న ఆశాభావాన్ని సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ వ్యక్తం చేశారు. సహారా సంస్థల్లో దాచుకున్న సొమ్ము భద్రంగా ఉంటుందన్న ఆయన వడ్డీతోసహా ఆ మొత్తాలను మదుపరులు తిరిగి అందుకుంటారని హామీ ఇచ్చారు. ఇప్పటిదాకా సెబీకి రూ.22 వేల కోట్లు డిపాజిట్ చేశామని, కానీ మదుపరులకు కేవలం రూ.100 కోట్లే అందిందని అన్నారు. మదుపరులకు వారి సొమ్ము వారికి అందేలా దేశవ్యాప్తంగా నాలుగుసార్లు 154 వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేసిన ఆయన సెబీ తీరుపట్ల ఒకింత అసంతృప్తిని వెలిబుచ్చారు. గ్రూప్ 42వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మదుపరులనుద్దేశించి సుబ్రతా రాయ్ ఓ లేఖ రాశారు.

# చుక్కల్లో ధరలు

- జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం మరింత పైకి
- ఆరేండ్ల గరిష్ఠాన్ని తాకుతూ 7.59 శాతంగా నమోదు
- కూరగాయలు, ఆహారోత్పత్తుల ధరల ప్రభావం





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** రిటైల్ ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. గతకొద్ది నెలలుగా క్రమేణా పెరుగుతున్న ధరలు.. జనవరిలో దాదాపు ఆరేండ్ల గరిష్ఠాన్ని తాకాయి. గత నెల వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత చిల్లర ద్రవ్యోల్బణం ఐదున్నరేండ్లకుపైగా స్థాయికి ఎగిసి 7.59 శాతంగా నమోదైంది. 2014 మే తర్వాత ఇదే అత్యంత గరిష్ఠం. నాడు 8.33 శాతంగా ఉన్నట్లు బుధవారం ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేశాయి. ఇక అంతకుముందు నెల డిసెంబర్‌లో 7.35 శాతంగా ఉండగా, నిరుడు జనవరిలో కేవలం 1.97 శాతంగానే ఉండటం గమనార్హం. కూరగాయలు, పప్పుధాన్యాలు, మాంసం, చేపల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తులో పలుకుతుండటం ద్రవ్యోల్బణానికి దారితీస్తున్నది. అయినప్పటికీ స్థూల ఆహార ద్రవ్యోల్బణం అంతకుముందుతో పోల్చితే జనవరిలో 13.63 శాతానికి తగ్గడం విశేషం. ఇంతకుముందు 14.19 శాతంగా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యాచరణ అమలు మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) తెలిపింది. కూరగాయల ధరలు 50.19 శాతం, పప్పులు ఇతర ఆహారోత్పత్తుల ధరలు 16.71 శాతం, మాంసం, చేపల ధరలు 10.50 శాతం మేర పెరిగాయి. గుడ్ల ధరలు కూడా 10.41 శాతం ఎగిశాయి. ఆహార, శీతలపానియాల విభాగంలో ద్రవ్యోల్బణం 11.79 శాతంగా నమోదైనట్లు ఎన్ఎస్‌వో తెలిపింది. ఇదిలావుంటే హౌజింగ్ 4.20 శాతం ఖరీదైందని, ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 3.66 శాతంగా ఉందని వివరించింది. కాగా, రాబోయే నెలల్లో కూరగాయలు ఇతర ఆహారోత్పత్తుల ధరలు తగ్గవచ్చని, ముఖ్యంగా మాంసం, గుడ్ల ధరలు దిగిరావచ్చన్న అంచనాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అయితే వివిధ రంగాల్లోని సేవలు ప్రియం కావడం కూడా ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయంటున్నారు.

### ద్రవ్యసమీక్షపై ఎఫెక్ట్

నానాటికీ ఎగబాకుతున్న ద్రవ్యోల్బణ గణాంకాలు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్యసమీక్షను ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే గత రెండు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో కీలక వడ్డీరేట్ల జోలికి ఆర్బీఐ వెళ్లని విషయం తెలిసిందే. రెపో, రివర్స్ రెపోలను యథాతథంగా ఉంచింది. అంతకుముందు వరుసగా వీటిని తగ్గిస్తూ వచ్చిన ఆర్బీఐ.. వృద్ధిరేటుకు ఊతమిచ్చే ప్రయత్నం చేసింది. కానీ ద్రవ్యోల్బణం అదుపు తప్పుతున్నదని గ్రహించిన ఆర్బీఐ.. వడ్డీరేట్ల కోతలకు బ్రేకేసింది. నిజానికి ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో ఉంటే.. వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచాలి. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఆ పని చేయలేకపోతున్నది.

## సర్కారీ బీమా సంస్థలకు ధీమా

రూ.2,500 కోట్ల సాయం.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కేంద్రం మూలధన సాయం చేస్తున్నది. మూడు కంపెనీల్లోకి రూ.2,500 కోట్లను చొప్పించేందుకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. బుధవారం ఇక్కడ జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఓఐసీఎల్), నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐసీఎల్), యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీఎల్)లకు నిధులివ్వాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 'ఈ మూడింటికి తక్షణ సాయంగా రూ.2,500 కోట్లను ఇచ్చేందుకు క్యాబినెట్ అనుమతించింది' అని సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ఈ సంస్థల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యానే ఈ తక్షణ సాయాన్ని ప్రకటిస్తున్నామని చెప్పారు. వచ్చే నెలాఖరుకల్లా ఈ మూడు సంస్థలను ఒక్కటిగా కలిపేయాలని కేంద్రం చూస్తు న్న నేపథ్యంలో ఈ సాయం అందుతున్నది. ఆర్థికంగా ఉమ్మడి సంస్థ బలోపే తం కావాలన్నదే దీని లక్ష్యం. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ మూడు సంస్థల విలీనాన్ని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. మార్చి 31, 2017 నాటికి ఈ సంస్థల బీమా ఉత్పత్తులు 200లకుపైగానే ఉన్నాయి. వీటి మొత్తం ప్రీమియం రూ.41,461 కోట్లుగా ఉన్నది. మార్కె ట్ వాటా సుమారు 35 శాతం.

### 'వివాద్ సే విశ్వాస్' విస్తరణ

'ప్రత్యక్ష పన్ను వివాద్ సే విశ్వాస్ బిల్లు, 2020' పరిధిని పెంచాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఇక రుణ రికవరీ ట్రిబ్యునల్స్ (డీఆర్టీ)ల్లో పెండింగ్ కేసులకూ ఈ పథకం వర్తించనున్నది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో తెచ్చిన ఈ బిల్లు ప్రధాన లక్ష్యం.. పెద్ద ఎత్తున పేరుకుపోయిన పన్ను బకాయిలను తగ్గించడమే.

## సెలెక్ట్‌లో వాలంటైన్స్‌డే ఆఫర్లు




**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సెలెక్ట్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 'ది గ్రాండ్ వాలంటైన్స్ డే' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్లు ఈ నెల 13 నుంచి 14 వరకు రెండు రోజుల పాటు అమలులో ఉండనున్నాయని కంపెనీ ఫౌండర్, చైర్మన్ వై గురు తెలిపారు. కంపెనీ వృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమైనదని, వీరికి ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ఎంపిక చేసిన మోడళ్లపై భారీ రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. వీటిలో రూ.8,999 విలువైన 3జీబీ+32జీబీ 4జీ మొబైల్‌ను కేవలం రూ.3,999కే అందిస్తున్న సంస్థ.. రూ.6,999 ధర కలిగిన మైజు స్మార్ట్ ఫోన్‌ను రూ.3,999కే, రూ.25,500 విలువైన సామ్‌సంగ్ ఏ6ని రూ.8,999కే, రూ.3,999 విలువైన బ్లూటూత్ టీడబ్ల్యూస్‌ను రూ.1,499కి, 1,999 ధర కలిగిన బ్లూటూత్ స్పీకర్‌ను రూ.399కే, రూ.3,928 విలువైన 10 వేల ఎంఏహెచ్ పవర్ బ్యాంక్, బ్లూటూత్ నెక్‌బ్యాండ్‌ను కేవలం రూ.1,499కే విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. వీటితో పాటు రూ.12,143కి టీసీఎల్ ఎల్ఈడీని కొనుగోలు చేసిన వారికి ఉచితంగా హోమ్ థియేటర్ సిస్టమ్‌ను అందిస్తున్నది సంస్థ.

## ఆకట్టుకున్న గల్ఫ్ ఆయిల్

**ముంబై, ఫిబ్రవరి 12:** హిందుజా గ్రూపునకు చెందిన ఇంధన విక్రయ సంస్థ గల్ఫ్ ఆయిల్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలలకుగాను సంస్థ రూ.55.87 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.49.79 కోట్లతో పోలిస్తే 12.21 శాతం అధికమైంది. ఆదాయంలో మాత్రం సంస్థకు ఎదురుదెబ్బ తగిలింది. గతేడాది అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను రూ.462.02 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన సంస్థ..గత త్రైమాసికానికిగాను రూ.421.86 కోట్లకు పడిపోయింది. నికరంగా 8.69 శాతం తగ్గినట్లు అయిందని పేర్కొంది.

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
జిందగీ
గురువారం 13 ఫిబ్రవరి 2020
/nt.zindagi

# లిప్‌బామ్ ఇంట్లోనే..



- కాఫీ పొడి చర్మానికి మెరుగ్గా పనిచేస్తుంది. ఒక గిన్నెలో కాఫీ పొడి, తేనె తీసుకోవాలి. ఈ రెండింటిని బాగా మిక్స్ చేసుకొని పది నిమిషాల పాటు పెదాలపై రుద్దాలి. ఆ తర్వాత చల్లని నీటితో కడిగేస్తే పెదవులు సున్నితంగా మృదువుగా మారుతాయి.
- ఒక గిన్నెలో అర టీస్పూన్ చక్కెర, అర టీ స్పూన్ ఆలివ్ ఆయిల్‌ను తీసుకోవాలి. బాగా మిక్స్ చేయాలి. రోజూ పెదవులకు రాస్తూ ఉంటే పెదవులు మృదువుగా, కోమలంగా తయారవుతాయి.
- కొబ్బరి నూనె కూడా పెదవులకు మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. చర్మానికి కొబ్బరి నూనె చాలా మేలు చేస్తుంది. రోజూ రాత్రి పడుకునే ముందు కాస్త కొబ్బరి నూనెతో పెదవుల్ని మర్దన చేయాలి. ఇది మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది.
- కొబ్బరి నూనెలో చక్కెర కలిపి ఈ మిశ్రమాన్ని పెదవులకు పది నిమిషాలు పట్టించాలి. ఈ మిశ్రమం పెదవులను పగులకుండా నివారిస్తుంది. పెదవులు పొడిబారకుండా చేస్తుంది. అర స్పూన్ దాల్చిన చెక్క పొడికి పావు స్పూన్ తేనె, పావు స్పూన్ ఆలివ్ ఆయిల్ చేర్చి బాగా కలిపి పెదాలకు రాసుకుంటే పెదాలు మెరిసిపోతాయి.
- పాదాలు, పెదవుల పగుళ్లున్న చోట బాగా రుద్ది మసాజ్ చేయాలి. కాసేపయ్యాక తిరిగి నీటిలో కాళ్లను ఉంచి మళ్లీ బాగా రుద్దాలి. వారంలో మూడు సార్లు చేస్తే పగుళ్లకు చెక్ పెట్టవచ్చు. కాళ్ల పగుళ్లు ఉన్న చోట గోరింటాకు పేస్ట్‌ను పట్టించి ఆరాక కడిగేస్తే పగుళ్లు క్రమంగా తగ్గుతాయి.

# స్వగ్రామం బాగుకోసం



**విద్యావంతురాలై విదేశాల్లో స్థిరపడింది. అదే సమయంలో ఆమె పుట్టిన ఊరికి సేవలందించే అవకాశం వచ్చింది. తన విలాసవంతమైన జీవితాన్ని వదులుకొని సొంతూరి బాగుకోసం ముందుకు వచ్చింది. సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుంటున్నదీమె.**

మధ్యప్రదేశ్‌లోని 'భర్‌కేడి అబ్దుల్లా' గ్రామానికి చెందిన భక్తిశర్మ అనే మహిళ ఉన్నత చదువులు చదివింది. అనంతరం అమెరికాలో ఆమెకు ఉద్యోగం లభించింది. ఉద్యోగం చేసుకుంటూ అక్కడే స్థిరపడిపోయింది. అదే సమయంలో భక్తిశర్మ పుట్టిన ఊరికి సేవలందించే అవకాశం వచ్చింది. దీంతో విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని వదిలేసి సొంతూరుకు వచ్చింది. విద్యావంతులు ఊరుబాగు కోసం ముందుకు రావడం వల్ల ఆయా గ్రామాలు ప్రగతి పథంలో రాణించగలుగుతున్నాయి. చదివిన చదువును పుట్టిన ఊరిబాగుకోసం ఉపయోగిస్తే జీవితంలో అంతకుమించిన ఆనందం ఉండదు. ఇదే విషయాన్ని భక్తిశర్మ ఓ పుస్తకంలో చదివి తెలుసుకున్నది. ఆ సమయంలోనే సొంత గ్రామమైన 'భర్‌కేడి అబ్దుల్లా'కు సేవలందించాలనుకున్నది. అందుకోసం అమెరికా ఉద్యోగాన్ని వదిలి సొంతూరుకు వచ్చేసింది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందింది. భక్తిశర్మ పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేసింది. జనాలు పడే ఇబ్బందులను గుర్తించి అవసరమైన సౌకర్యాలను సమకూర్చింది. ప్రజాసమస్యలను తెలుసుకొనేందుకు గ్రామ సభలను ఏర్పాటు చేసింది. వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించింది. ఆమె సర్పంచ్‌గా పదవి చేపట్టక ముందు ఆగ్రామంలో పది కుటుంబాలకు మాత్రమే సొంత ఇండ్లున్నాయి. భక్తిశర్మ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే 80 శాతం మందికి ఇండ్లు నిర్మించి ఇచ్చింది. పరిసరాల పరిశుభ్రతతోపాటు పచ్చదనాన్ని పెంచడంలో ఆ ఊరి ప్రజలను భాగస్వాములను చేసింది. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు పలు సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరుచుకున్నది. పలు చేతివృత్తులపై వారికి శిక్షణ ఇప్పించింది. ఊరికి రవాణా సౌకర్యం, వైద్యం, విద్య వంటి సదుపాయాలు అందించి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దింది. భక్తిశర్మ అందించిన సేవలకుగానూ అనేక జాతీయ స్థాయి అవార్డులూ ఆమెను వరించాయి.

# నడక ప్రారంభించారా?



- నడక ప్రారంభించిన వారు మొదటి రోజు ఎక్కువ దూరం ఎక్కువ సమయం నడవకూడదు. మామూలుగా 5 నిమిషాల నుంచి 15 నిమిషాల వరకు నడవొచ్చు. ఆ తర్వాత రోజు నుంచి ఎక్కువ సమయం నడవాలి. మొదట్లో కాస్త నెమ్మదిగా ప్రారంభించి వేగం పెంచాలి.
- కొత్తగా వాకింగ్ ప్రారంభించేవారు షూ ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. కొత్త షూ కొనేటప్పుడు షాపింగ్ మాల్‌లోనే వేసుకొని నడవాలి. అవి సౌకర్యంగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. సైజ్ పెద్దగా కాకుండా, చిన్నగా ఉండకుండా చూసుకోవాలి.
- ఎప్పుడు పడితే అప్పుడు నడిస్తే అనుకున్న ఫలితాలు రావు. ముఖ్యంగా ఉదయం నడిస్తే ఆ ఎనర్జీ రోజంతా ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు నడిస్తే శరీరానికి డీ విటమిన్ కూడా అందుతుంది. సాయంకాలం నడక వల్ల రాత్రిళ్లు హాయిగా నిద్రపడుతుంది.
- నడిచేటప్పుడు చేతులు ఊపుతూ శరీరాన్ని నిటారుగా ఉంచాలి. వాకింగ్ మొదలు పెట్టేటప్పుడు, తగ్గించేటప్పుడు వేగంగా ఉండకూడదు. మెల్లిగా మొదలు పెట్టి వేగం పెంచాలి. ఆపేటప్పుడు వేగాన్ని తగ్గిస్తూ ఆపాలి. వేసుకునే బట్టలు వదులుగా ఉండేవి ఎంపిక చేసుకోవాలి. రోజూ 30 నుంచి 45 నిమిషాలు నడిస్తే మంచిది.

మ్యాంగో జ్యూస్, ఆరెంజ్ జ్యూస్.. ఇలా..ఏదైనా ఇంట్లో తయారు చేసుకోవచ్చు. మరి, మాక్‌టెయిల్ మాటేమిటి? ఇది తాగాలంటే.. స్టార్‌హోటల్‌కో, రెస్టారెంట్‌కో వెళ్లనవసరం లేదు.. ఇంట్లోనే చేసుకొని తాగొచ్చు అంటున్నారు ప్రముఖ చెఫ్‌లు. ఎండలు ముదిరాక ప్రిపరేషన్ మొదలుపెట్టడంకంటే.. ముందుగానే తయారు చేయడం నేర్చుకుంటే మంచిది. అందుకే రకరకాల మాక్‌టెయిల్స్ మీకోసం..

# బెర్రీ.. బెర్రీ మాక్‌టెయిల్స్



## రాస్బ్ర్రీ సోడా

**కావాల్సినవి :**

ఫ్రోజన్ రాస్బ్ర్రీ సోడా : 100 గ్రా.
చక్కెర సిరప్ : 20 మి.లీ.
సోడా : 90 మి.లీ.
పుదీనా : సరిపడా

**తయారీ :**

ఫ్రోజన్ రాస్బ్రీకి చక్కెర సిరప్ కలుపాలి. దీనికి సోడా జోడించాలి. తర్వాత మిశ్రమాన్ని గ్లాస్‌లోకి సర్వ్ చేసుకోవాలి. పుదీనాతో గార్నిష్ చేసుకొని తాగితే అద్భుతంగా ఉంటుంది.

## బ్లూబెర్రీ స్మూతీ

**కావాల్సినవి :**

బ్లూబెర్రీస్ : 8, తులసి ఆకులు : 2, పెరుగు : 100 మి.లీ., తేనె : 30 మి.లీ

**తయారీ :**

బ్లూబెర్రీస్, తులసి ఆకులు, పెరుగు, తేనెలను తగిన మోతాదులో తీసుకొని మిక్సీ పట్టించాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని మాసన్ జార్‌లోకి సర్వ్ చేసుకొని మిగిలిన తులసి ఆకులతో గార్నిష్ చేసుకోవాలి. ఇక అంతే.. ఎంతో రుచికరమైన బ్లూబెర్రీ స్మూతీ రెడీ!



## కోల్డ్ కాఫీ

**కావాల్సినవి :**

ఎస్ప్రెసో : 30 మి.లీ.
వనిల్లా ఐస్‌క్రీమ్ : 2 స్కోప్స్
పాలు : 100 మి.లీ.
చక్కెర సిరప్ : 20 మి.లీ.
కాఫీ బీన్స్ : 3

**తయారీ :**

ముందుగా ఎస్ప్రెసో, వనిల్లా ఐస్‌క్రీమ్, పాలు, చక్కెర సిరప్ పదార్థాలన్నింటినీ జార్‌లో వేసి మిక్సీ పట్టించాలి. తర్వాత మిశ్రమాన్ని జార్ గ్లాస్‌లోకి సర్వ్ చేసుకొని కాఫీ బీన్స్‌తో గార్నిష్ చేసుకుంటే కోల్డ్ కాఫీ టేస్టీగా ఉంటుంది.



## రుస్టమ్ షేక్

**కావాల్సినవి :**

తమలపాకు : ఒకటి
గుల్‌కండ్ : 2 బార్ స్పూన్స్ (100 మి.లీ)
వనిల్లా ఐస్‌క్రీమ్ : 2 స్కూప్స్
బాదంపప్పు : 3

**తయారీ :**

తమలపాకు , గుల్‌కండ్, వనిల్లా ఐస్‌క్రీమ్, బాదంపప్పును జార్‌లోకి తీసుకోవాలి. దీన్ని మిక్సీ పట్టించి మాసన్ జార్‌లోకి సర్వ్ చేసుకోవాలి. తర్వాత తమలపాకులతో గార్నిష్ చేసుకొని సేవిస్తే టేస్ట్ అదిరిపోతుంది.



## ఫైవ్ బెర్రీ సోబర్ సాంగ్రియా

**కావాల్సినవి :**

బెర్రీ, కాక్‌టైల్ షేక్ : 100 గ్రా.
క్రాన్‌బెర్రీ జ్యూస్ : 90 మి.లీ.
ఆరెంజ్ జ్యూస్ : 90 మి.లీ.
పీచ్ సిరప్ : 20 మి.లీ.
ఐస్‌క్యూబ్స్ : 4
ఆరెంజ్ ముక్కలు : సరిపడా

**తయారీ :**

బెర్రీని కాక్‌టెయిల్ షేకర్‌తో మిక్స్ చేయాలి. ఇందులో క్రాన్‌బెర్రీ జ్యూస్, ఆరెంజ్ జ్యూస్, పీచ్ సిరప్, ఐస్ క్యూబ్స్ వేసి బాగా కలుపాలి. దీన్ని గ్లాసులోకి సర్వ్ చేసుకోవాలి. తర్వాత ఆరెంజ్ ముక్కలతో అలంకరించుకుంటే ఫైవ్ బెర్రీ సోబర్ సాంగ్రియా తయారైనట్లే!





అనీష్
చెఫ్
సోడా బాటిల్ ఓపెనర్‌వాలా
జూబ్లీహిల్స్,
హైదరాబాద్

# తమలపాకుతో చాలా లాభాలు

**తమలపాకు ఆరోగ్యానికి మంచిది. ఇందులో కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ సాయపడుతుంది. తమలపాకు తింటే మరెన్నో ఉపయోగాలు..**



- ప్రతి రోజు 7 తమలపాకులను ఉప్పుతో కలిపి ముద్దగా నూరి వేడినీళ్లతో తీసుకుంటే బోద వ్యాధితో బాధపడుతున్న వారికి చక్కని ఫలితం కనిపిస్తుంది. తమలపాకు రసాన్ని రెండు కళ్లలోనూ చుక్కలుగా వేస్తే రేచీకటి సమస్య క్రమంగా తగ్గుతుంది. తమలపాకు రసాన్ని టీ స్పూన్ మోతాదులో తీసుకుంటే గుండె పనితీరు మెరుగుపడుతుంది.
- ఎక్కువగా కూర్చొని పనిచేసేవారికి సాధారణంగా ఎదురయ్యే సమస్య వెన్నునొప్పి. వేడిగా ఉండే తమలపాకు రసాన్ని కొబ్బరినూనెతో కలిపి బాగా మిక్స్ చేసి, వెన్నుకు మర్దన చేయడం వల్ల తక్షణ ఉపశమనం కలుగుతుంది. శ్వాస సంబంధిత సమస్యతో బాధపడేవారు ఆవనూనెను గోరువెచ్చగా చేయాలి. దీనిలో తమలపాకును నానబెట్టి ఈ మిశ్రమాన్ని ఛాతి మీద రాస్తే ఉపశమనం దొరుకుతుంది.
- రోజూ ఒక తమలపాకును తింటే మలబద్ధకం సమస్య తగ్గిపోతుంది. దెబ్బలు తగిలినప్పుడు వాపు, రక్తం గడ్డ కట్టడం లాంటివి జరిగినప్పుడు తమలపాకును వేడి చేసి వాపు లేదా రక్తం గడ్డ కట్టిన ప్రాంతంలో కట్టులాగా కడితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- భోజనం తర్వాత తమలపాకు తింటే నోరు శుభ్రమవుతుంది. ఇది జీర్ణక్రియకు బాగా తోడ్పడుతుంది. కానీ ఈ ఆకును అధికంగా తీసుకుంటే అనర్థాలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాన్, ఇతర ఏ రూపంలో అయినా రోజుకు ఒక ఆకును మించి తీసుకోవద్దని చెబుతున్నారు.
- చుండ్రు సమస్యతో బాధపడుతున్నవారు తమలపాకులను ముద్దగా చేసి తలకు పట్టించాలి. గంటసేపు ఆగి తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది. ఇలా చుండ్రు సమస్య తగ్గే వరకు వారానికి రెండుసార్లు చొప్పున చేయవచ్చు.




## వ్యాధులు రాకుండా జాగ్రత్తలు

- సబ్బు, నీళ్లు లేదా ఆల్కహాల్ ఆధారిత హ్యాండ్ రబ్స్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- దగ్గు, తుమ్ము వచ్చేటప్పుడు టిష్యూ లేదా హ్యాండ్ కర్చీఫ్‌తో ముక్కు, నోటికి అడ్డంగా పెట్టుకోవాలి.
- జలుబు, ఫ్లూ లాంటి లక్షణాలు ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- మాంసం, గుడ్లు బాగా ఉడికించి తినాలి.
- రక్షణ లేకుండా పెంపుడు జంతువులు, మిగతా జంతువులను తాకకూడదు.

# కేరళ బడ్జెట్ కవర్‌పేజీగా..



**ప్రతిభ ఉన్నవారికి వయసుతో పనిలేదు. ఎప్పుడైనా ఎలా అయినా ఏదో రూపంలో గుర్తింపు వస్తుంది. అలా కేరళ ప్రభుత్వం జెండర్ బడ్జెట్ కవర్‌పేజీగా ఓ బాలుడి పెయింటింగ్‌ను ఎంచుకున్నది. ఈ చిత్రం ఆలోచింపచేసేది కావడం విశేషం.**



త్రిసూర్‌కు చెందిన అనుజత్ సింధు వినయల్ 9వ తరగతి చదువుతున్నాడు. అతనికి పెయింటింగ్ అంటే ఇష్టం. నాలుగేండ్ల వయసులోనే కుంచె పట్టుకున్నాడు. అమ్మ దగ్గర పెయింటింగ్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. దురదృష్టవశాత్తు గత ఏడాది నవంబర్ 14న అనుజత్ తల్లి అనారోగ్యంతో మరణించింది. ఈ విషాదం నుంచి కోలుకోవడానికి ఆ కుటుంబానికి చాలారోజులు పట్టింది. అనుజత్ పెయింటింగ్‌లో రాణించడానికి తన తల్లే కారణం. ప్రతి పెయింటింగ్‌ను మునుపటి చిత్రాల కంటే మెరుగ్గా వేయడానికి ప్రోత్సహించేది. ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2020 కోసం భారత కేంద్ర బడ్జెట్‌ను సమర్పించారు. దేశబడ్జెట్ కేటాయింపు తర్వాత కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ 2020-2021 ఏడాదికి రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించారు. ఈ బడ్జెట్ల గురించి కొంతమేరకు తెలుసుకున్న వినయల్ మనసులోని భావాలను కుంచె ద్వారా స్పష్టీకరించాడు. ఇంటి ఆవరణలో జరిగే పనులన్నింటినీ ఒకే చిత్రపటంలో చిత్రించాడు. దీన్నే కేరళ ప్రభుత్వ బడ్జెట్ కవర్‌పేజీగా ఎంపిక చేశారు ఆ రాష్ట్ర ఆర్థికమంత్రి. దీనికి 'మై మథర్ అండ్ మదర్స్ ఇన్ ది నైబర్‌హుడ్' (నా తల్లి, పొరుగున్న ఉన్న తల్లులు) అనే శీర్షికతో విడుదల చేశాడు. తన పెయింటింగ్ బడ్జెట్ కవర్‌పేజీగా ఎంపిక అవ్వడంతో అనుజిత్ తండ్రి ఆనందం వ్యక్తం చేశాడు. 'నా చదువు పూర్తి చేసిన తర్వాత వృత్తిపరంగా చిత్రకారుడిగా కొనసాగించాలని ఆశిస్తున్నాను' అని అనుజిత్ పేర్కొన్నాడు.

# ఏయ్ పిల్ల.. ప్రేమ నజరానా


నాగచైతన్య, సాయిపల్లవి

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్‌స్టోరీ'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. ఏమిగోస్ క్రియేషన్స్, సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్.ఎల్.పి పతాకంపై నారాయణ్ దాస్ కె నారంగ్, పి. రామ్మోహన్‌రావు నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న సినిమాలోని 'ఎయ్ పిల్లా' అనే పల్లవితో సాగే మొదటి గీతాన్ని విడుదలచేయబోతున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'మ్యూజికల్ లవ్‌స్టోరీ ఇది. 'ఫిదా' తర్వాత అందమైన ప్రేమకథతో శేఖర్‌కమ్ముల ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఓ జంట మధురానుభూతులకు చక్కటి దృశ్యరూపంగా ఉంటుంది. నాగచైతన్య, సాయిపల్లవి పాత్రచిత్రణ, నటన నవ్యరీతిలో ఉంటాయి. వారిద్దరి కెమిస్ట్రీ అలరిస్తుంది. ఏ.ఆర్.రెహమాన్ స్కూల్ నుంచి వచ్చిన పవన్ సి.హెచ్ వీనులవిందైన బాణీలను అందిస్తున్నారు. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. రాజీవ్ కనకాల, ఈశ్వరీరావు, దేవయాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: భాస్కర్ కటకంశెట్టి, సంగీతం: పవన్ సి.హెచ్.


'భీష్మ' చిత్రంలో రష్మిక మందన్న


నాని, సుధీర్‌బాబు

# రాక్షసుడు వర్సెస్ రక్షకుడు

చట్టం, న్యాయంతో పనిలేకుండా తనకు ఎదురుతిరిగిన వారిని శిక్షిస్తుంటాడో రాక్షసుడు. ఆ రాక్షసుడి బారి నుంచి అందరిని కాపాడుతుంటాడో రక్షకుడి లాంటి పోలీస్. ఆ ఇద్దరి కథను తెరపై చూడాల్సిందే' అంటున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వి'. సుధీర్‌బాబు మరో హీరోగా నటిస్తున్నారు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రాజు, శిరీష్, హర్షిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అదితిరావ్‌హైదరీ, నివేథా థామస్ కథానాయికలు. ఈ నెల 17న టీజర్‌ను విడుదలచేయనున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'రాక్షసుడి పాత్రలో నాని, పోలీస్ క్యారెక్టర్‌లో సుధీర్‌బాబు నటిస్తున్న చిత్రమిది. ఈ ఇద్దరి మధ్య పోరుకు కారణమేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుతున్నాం. ఉగాది సందర్భంగా మార్చి 25న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదలచేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అమిత్ త్రివేది, నేపథ్య సంగీతం:ఎస్.ఎస్.తమన్, సినిమాటోగ్రఫీ: పి.జి.విందా, ఎడిటింగ్: మార్తాండ్ కె వెంకటేష్.

# సూపర్‌హీరో శక్తి

శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'శక్తి'. పి.ఎస్. మిత్రన్ దర్శకుడు. కేజేఆర్ స్టూడియోస్, గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై కోటపాడి జె రాజేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమిళ చిత్రం 'హీరో'కు అనువాదమిది. కల్యాణి ప్రియదర్శన్ కథానాయిక. అర్జున్, అభయ్ డియోల్, ఇవానా కీలక పాత్రల్ని పోషించారు. ఈ నెలలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. విద్యావ్యవస్థలోని లోపాలను ఓ సూపర్‌మెన్ ఎలా చక్కదిద్దాడన్నది ఆసక్తిని పంచుతుంది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆహ్లాదాన్ని పంచుతూనే ఆలోచనను రేకెత్తిస్తుంది' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ ''అభిమన్యుడు' తర్వాత పి.ఎస్.మిత్రన్ దర్శకత్వం వహించిన సినిమా ఇది. సృజనాత్మకంగా ఆలోచించే వారిని ప్రోత్సహిస్తే భావితరాలు బాగుంటాయనే సందేశంతో దర్శకుడు రూపొందించారు. సూపర్‌మెన్‌గా శివకార్తికేయన్ చేసే సాహసాలు, ఆయనపై చిత్రీకరించిన పోరాట ఘట్టాలు రొమాంచితంగా ఉంటాయి. అర్జున్ పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్‌కు సిద్ధమయ్యాం. ఈ నెలలోనే పాటలను, సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్‌రాజా.


కల్యాణి ప్రియదర్శన్

# కింగ్..గబ్బర్‌సింగ్..!


సందీప్‌కిషన్, లావణ్య త్రిపాఠి

'కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఆటుపోట్లను ఓ హాకీ ఆటగాడు ఎలా ఎదుర్కొని అసలైన విజేతగా నిలిచాడో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు సందీప్‌కిషన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఏ1 ఎక్స్‌ప్రెస్'. డెన్నిస్ జీవన్ కనుకొలను దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వెంకటాద్రి టాకీస్ పతాకాలపై టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, సందీప్‌కిషన్, దయాపన్నెం నిర్మిస్తున్నారు. లావణ్య త్రిపాఠి కథానాయిక. ఈ చిత్రంలోని 'సింగిల్ కింగులం'అనే గీతాన్ని బుధవారం చిత్రబృందం విడుదలచేసింది. హిప్‌హాప్ తమిళ సంగీతాన్ని అందించిన ఈ గీతాన్ని రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. సామ్రాట్ సాహిత్యాన్ని సమకూర్చారు. సందీప్‌కిషన్, లావణ్య త్రిపాఠిలపై చిత్రీకరించిన ఈ గీతానికి శేఖర్‌మాస్టర్ నృత్యాలను సమకూర్చారు. నిర్మాతలు మాట్లాడుతూ 'హాకీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న తొలి తెలుగు చిత్రమిది. ఓ క్రీడాకారుడి జీవనగమనానికి చక్కటి దృశ్యరూపంగా ఉంటుంది. హాకీ ప్లేయర్‌గా సందీప్‌కిషన్ పాత్ర సరికొత్తగా ఉంటుంది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. వేసవిలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. రావు రమేష్, మురళీశర్మ, పోసాని కృష్ణమురళి, ప్రియదర్శి, సత్య, మహేష్‌విట్టా, పార్వతీశం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, కెమెరా: కవిన్‌రాజ్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

# తెలంగాణ పోరడు బాగుంది


కె. విశ్వనాథ్

'తెలంగాణ పోరడు' పాట వీనులవిందుగా ఉంది. నూతన తారాగణంతో దర్శకుడు పాలిక్ చేస్తున్న ఈ ప్రయత్నం ఫలప్రదం కావాలి' అని అన్నారు ప్రముఖ దర్శకుడు కె. విశ్వనాథ్. శ్రీజీత్ లవన్, జీవా, సుమన్‌శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్‌డి కేరాఫ్ వెంచపల్లి'. పాలిక్ దర్శకుడు. గోదారి భానుచందర్ నిర్మాత. ఈ చిత్రంలోని తొలి పాటను కె. విశ్వనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలిక్ మాట్లాడుతూ 'దర్శకుడిగా నా తొలి చిత్రమిది. సినిమాలోని మొదటిపాటను విశ్వనాథ్‌గారు విడుదలచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. తెలంగాణ మట్టి పరిమళాల్లాంటి సాహిత్యంతో సురేష్ గంగుల ఈ పాట రాశారు' అని తెలిపారు. చిత్రీకరణ తుది దశకు చేరుకున్నదని, త్వరలో ఆఖరి షెడ్యూల్‌ను ప్రారంభిస్తామని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రఘురామ్ ,రామ్ పాల్గొన్నారు.

# సైకో లేడీ కథ


ప్రియాంషా

లేడీ సైకో థ్రిల్లర్ కథాంశంతో గౌతమ్ క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నది. ప్రియాంషా, ముప్పిడి వాసు, ఘటికాచలం ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీనివాస్.జి దర్శకుడు. రెగ్యులర్ షూటింగ్ ఈ నెల మూడో వారం నుంచి మొదలుకానుంది. 'గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. జగిత్యాల ఫారెస్ట్, నెల్లూరు, వరంగల్ జలపాతాల లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం. ఇదొక థ్రిల్లర్. ఒక లేడీ సైకో వల్ల ఎదురయ్యే పరిణామాలేమిటనే అంశాన్ని ఆసక్తికరంగా చూపించబోతున్నాం' అని దర్శకుడు తెలిపారు. వెంకటేష్ తాతిరాజు, మల్లాది శాస్త్రి, శ్రీలం శ్రీను, కేవీవీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాసు వర్మ, కథ, మాటలు, సంగీతం: ఘటికాచలం, నిర్మాత: ముప్పిడి వాసుదేవ రావు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీనివాస్.జి.

# ఆరుద్ర ఉగ్రరూపం


పా.విజయ్

పా.విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆరుద్ర'. కె. వాసుదేవ రావు నిర్మాత. కె. భాగ్యరాజా కీలక పాత్రధారి. మేఘాలీ, దక్షిత, సోనీ, సంజనసింగ్ కథానాయికలు. సెన్సార్ పూర్తయింది. క్లీన్ 'యు' సర్టిఫికెట్ లభించింది. నిర్మాత మాట్లాడుతూ 'లవ్, కామెడీ ఎమోషన్స్ సమ్మిళితమైన చిత్రమిది. సామాజిక ఇతివృత్తంతో రూపొందిస్తున్నాం. మహిళలపై జరుగుతున్న అమానుష చర్యలపై ఉగ్రరూపం దాల్చిన ఆరుద్ర కథేమిటి?మానవ మృగాలను అతడు ఏ విధంగా అంతమొందించాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. పిల్లలకు, తల్లిదండ్రులకు చక్కటి సందేశాన్ని అందించే సినిమా ఇది. పా.విజయ్ నటన, దర్శకత్వం, భాగ్యరాజా పాత్ర, విద్యాసాగర్ సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తాయి. తమిళంలో విమర్శకుల ప్రశంసల్ని అందుకున్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది. త్వరలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సమర్పణ: వరకాంతం సునీల్‌రెడ్డి.

# పవన్‌తో తీన్‌మార్

'గబ్బర్‌సింగ్', 'కాటమరాయుడు' చిత్రాల్లో పవన్‌కల్యాణ్, శృతిహాసన్ జోడీ తమ కెమిస్ట్రీతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ముచ్చటగా మూడోసారి ఈ జంట వెండితెరపై సందడిచేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నది. మైత్రీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇటీవల వెలువడింది. ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ సరసన శృతిహాసన్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కథానాయిక పాత్ర కోసం చిత్రబృందం ఆమెతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ఈ సినిమాలో నటించడానికి శృతిహాసన్ సుముఖతను వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత 'క్రాక్' సినిమాతో తెలుగులో పునరాగమనం చేస్తున్నది శృతిహాసన్. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది.


శృతిహాసన్



నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 13 ఫిబ్రవరి 2020

raithubadi@ntnews.com

మన రాష్ట్రంలో 85 శాతం రైతులు చిన్న, సన్నకారు రైతులే. ఒకప్పుడు రైతులందరు పంటలతో పాటు పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపడుతూ కచ్చితమైన ఆదాయాన్ని పొందడమే కాకుండా పశువుల పేడను పొలంలో వేయడం వలన భూసారాన్ని కూడా కాపాడేవారు. క్రమంగా వివిధ కారణాల దృష్ట్యా పశు సంపద లేని వ్యవసాయాన్ని రైతులు చేపడుతున్నారు. కొంతమంది రైతులు ఒకే వాణిజ్య పంటను సాగు చేస్తూ నష్టపోతున్నారు. దీనిని అధిగమించేందుకు సమగ్ర వ్యవసాయాన్ని చేపడితే లాభాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సమగ్ర వ్యవసాయం లాభదాయకం



**వ్యవసాయాన్ని** దాని అనుబంధ రంగాలతో కలిపి చేయడాన్నే సమగ్ర వ్యవసాయం అంటారు. అంటే వ్యవసాయ వ్యర్థాలను లేదా ఉప ఉత్పత్తులను ఉపయోగించుకుంటూ పుట్టగొడుగుల పెంపకం, పట్టు పురుగుల పెంపకం, తేనె టీగల పెంపకం, వర్మికంపోస్ట్, బయోగ్యాస్ యూనిట్ల వంటి వాటిని చేపట్టి ఆశించిన దిగుబడులు పొందవచ్చు. ఒక వ్యవస్థ నుంచి లభించే ఉత్పత్తులు లేదా వ్యర్థాలను మరో వ్యవస్థకు వనరులుగా లేదా పెట్టుబడులుగా పెట్టి అక్కడి భూమిలో లభ్యమయ్యే వనరులను బట్టి ఆహారపంటలు వేసి తదనుగుణంగా అనుబంధ రంగాలను ఎంచుకుని సరియైన విధానాలను అవలంబించాలి. తద్వారా రైతులు మంచి ఫలితాలను సాధించవచ్చని కేవీకే మృత్తికా శాస్త్రవేత్త అరిగెల కిరణ్ తెలిపారు. అదనపు సమాచారం కోసం 7893989055 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. సమగ్ర వ్యవసాయంలో చేపట్టవలసిన విధానాలను గురించి వారు తెలిపిన వివరాలు..

### వర్షాధార తేలిక భూములు

నైరుతి రుతుపవనాల ద్వారా పడే వర్షమే వ్యవసాయానికి ఆధారం. రైతులు వానకాలం పంటగా జొన్న, మక్కజొన్న, ఆముదం, పల్లి, పొద్దుతిరుగుడు, పత్తి, కంది, పెసర, సజ్జ పంటలను సాగు చేస్తున్నారు. సగటు భూమి 2–3 ఎకరాలు. అందులో ఇంటికి అవసరమైన చిరుధాన్యాలు, పప్పుదినుసులు, నూనె గింజలను సాగు చేసుకోవచ్చు. సమగ్ర వ్యవసాయానికి రైతు ఎకరా పొలంలో జొన్న+ కందులు, ఒక ఎకరాలో ఆముదం సాగు చేసుకున్నట్లైతే సగటున 10 టన్నుల జొన్న చొప్ప, 1 టన్ను కంది పొట్టు, 4 టన్నుల వేరుశనగ మొదళ్ళు, 4 టన్నుల రాగి మొదళ్ళు, 3 టన్నుల ఆముదం అవశేషాలు ఉత్పత్తవుతాయి. వీటిని వినియోగించుకుని పాడి పశువుల పోషణ చేపట్టవచ్చు. అదనంగా పొలం గట్లపైన సుబాబుల్, తుమ్మ, సెస్బేనియా, గ్లైరిసీడియ లాంటి బహువార్షికాలను కూడా పెంచుకుని పచ్చిమేతను పొందవచ్చు. అదేవిధంగా మెట్ట ప్రాంతంలో ఫలాలనిచ్చే రేగు, సీతాఫలం, నేరేడు చెట్లను కూడా గట్లపై పెంచుకోవచ్చు. పశువులకు మేతగా ఉపయోగపడని పంటల వ్యర్థాలను కాల్చి వేయకుండా కంపోస్ట్‌గా లేదా వర్మికంపోస్ట్‌గా తయారుచేసుకుని పంటలకు వేసుకున్నట్లైతే భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చు. ఈ విధంగా మూడు ఎకరాలలో సమగ్ర వ్యవసాయం చేపట్టినట్లైతే ఏడాదికి పంటల నుంచి (జొన్న+ కందులు– ఒక ఎకరా, పల్లి– ఒక ఎకరా, రాగులు– అర ఎకరా, ఆముదం– అర ఎకరా) రూ.35,000 నికర ఆదాయం, మేకల పెంపకం (5 ఆడ+1 మగ) నుంచి రూ.16,000 నికర ఆదాయం, 30 పెరటి కోళ్ళ (వనరాజా/గిరిరాజా/ గ్రామప్రియ) నుంచి రూ.9,000 నికర ఆదాయం పొందవచ్చు.
పశువుల పేడ, ఆముదం పంట అవశేషాలు, ఇతర వ్యర్థాల నుంచి 13–14 టన్నుల సేంద్రియ ఎరువులను పొందవచ్చు. ఇది 3 ఎకరాలకు సరిపోతుంది. ఈరకంగా భూసారాన్ని కాపాడుకుంటూ, కుటుంబ ఆహార, పోషక భద్రత సాధించి, ఆదాయాన్ని క్రమబద్ధంగా సంవత్సరం పొడవునా పొందవచ్చు. ఈ పద్ధతులను పాటించినట్లైతే అననుకూల వాతావరణ పరిస్థితులలోనూ నష్టపోకుండా వ్యవసాయాన్ని చేపట్టవచ్చు.

### వర్షాధార నల్లరేగడి నేలలు

ఈ పరిస్థితులలో రైతులు పత్తి, మక్కజొన్న, కంది, కూరగాయలు, పశుగ్రాస జొన్న– శనగ వంటి పంటలు విత్తుకుంటారు. ఈ విధంగా మూడెకరాలున్న రైతు వివిధ రకాల పంటలను సాగు చేసినట్లైతే ఒక ఎకరా మక్కజొన్న + కంది నుంచి రూ.20,000 నికర ఆదాయం, ఎకరా పత్తి నుంచి రూ.30,000 నికర ఆదాయం, ఎకరా పశుగ్రాస జొన్న– శనగల నుంచి రూ.20,000 నికర ఆదాయం మొత్తం మూడు ఎకరాల పంట నుంచి రూ.70,000 నికర ఆదాయం పొందవచ్చు. అలాగే పాడి పశువులు (గ్రేడెడ్ ముర్రా–2) నుంచి రూ.16,000 నికర ఆదాయం, మేకల పెంపకం (లోకల్ –8 ఆడ+1 మగ) ద్వారా రూ.20,000 నికర ఆదాయం, పెరటి కోళ్ళు (వనరాజా/ గిరిరాజా/ గ్రామప్రియ– 30) ద్వారా రూ.8,000 నికర ఆదాయం, వర్మి కంపోస్ట్ ద్వారా కూడా అదనపు ఆదాయం పొందవచ్చు. ఈ విధంగా సమగ్ర వ్యవసాయం ద్వారా సుమారు రూ.1.40 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చు. పశువుల, మేకల పచ్చిమేత కోసం సుబాబుల్, తుమ్మ, గ్లైరిసిడియా, సెస్బేనియా లాంటి బహువార్షికాలను గట్లపై వేసుకోవాలి. మక్కజొన్న, జొన్న చొప్ప, కంది పొట్టు, శనగపొట్టును జాగ్రత్తగా నిల్వ చేసుకుని మూడు పశువులను సమర్థవంతంగా మేపుకోవచ్చు. గట్లపైన బహువార్షికాలు మేకలకు సరిపోతాయి. ఈ విధానంలో కూడా రైతు మూడెకరాలకు కావాల్సిన 15 టన్నుల సేంద్రియ ఎరువును తయారుచేసుకుని పొలంలో ప్రతి సంవత్సరం వేయడం ద్వారా ఎల్లప్పుడు నేల సారాన్ని కాపాడుకోవచ్చు.

### బోరుబావుల కింద సాగు

నీటి వసతి ఉన్నప్పుడు తేలిక నేలల్లోనూ, నల్లరేగడి నేలల్లోనూ ప్రణాళికబద్ధంగా వానకాలం, యాసంగి పంటలు ఆధారిత అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని కచ్చితమైన ఆదాయాన్ని పొందవచ్చు. మేకల కోసం పొలం గట్లపై సుబాబుల్, సెస్బేనియా, గ్లైరిసిడియా, తుమ్మ మొక్కలను నాటుకోవాలి. అలాగే గట్ల పొడవునా కరోండ మొక్కలు నాటుకున్నట్లైతే అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఈ తరహా వ్యవసాయంలో పరిస్థితులు రైతులకు అనుకూలంగా ఉంటాయి, సంవత్సరం పొడవునా పని పొందడమే కాకుండా అదనంగా ఇతరులకు పని దినాలు కల్పించవచ్చు. ఇంటికి కావాల్సిన తిండి గింజలతో పాటు పశువులకు మేకలకు, కుందేళ్ళకు, కోళ్ళకు మేత సమృద్ధిగా లభిస్తుంది,. ప్రతి ఏడాది 15 టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది. కనుక దీర్ఘకాలికంగా నేల సారవంతంగా అవుతుంది. పశువుల పేడతో గోబర్ గ్యాస్ ప్లాంట్‌లు నెలకొల్పి గృహ అవసరాలకు కావాల్సిన ఇంధనాన్ని విద్యుత్‌ను తయారుచేసుకోవచ్చు. ఇందుకు గాను నెడ్‌కాప్ ద్వారా సబ్సిడీ కూడా పొందవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సోలార్ పంపు సెట్లను కూడా సబ్సిడీ ద్వారా ఏర్పాటు చేసుకుని విద్యుత్ సమస్యను అధిగమించి కచ్చితమైన దిగుబడులను పొందవచ్చు. రైతులకు వర్మికంపోస్ట్, వర్మివాష్‌ను సొంతంగా తయారుచేసుకుని వాడుకోవచ్చు. అన్ని అనుబంధ రంగాలను అనుసంధానం చేసి సమగ్ర వ్యవసాయం చేసినట్లైతే ఉదాహరణకు రెండున్నర ఎకరాలలో పంటల సాగు (పెసర+కంది– అర ఎకరా, రాగి, వేరుశనగ– అర ఎకరా, వరి, మొక్కజొన్న– అర ఎకరా, పశు గ్రాసాల కో–4, కో–5, లూసర్న్ గడ్డి– అర ఎకరా, కూరగాయలు– అర ఎకరా) నుంచి రూ.50,000 నికర ఆదాయం అర ఎకరాకు జామ తోట నుంచి రూ.10,000 నికర ఆదాయం, పాడి పశువులు ( మేలు జాతి ముర్రా–3) నుంచి రూ.1,15,000 నికర ఆదాయం, మేకల (లోకల్ 4 ఆడ+ 1 మగ) పెంపకం ద్వారా రూ.16,000 నికర ఆదాయం, పెరటి కోళ్ళ నుంచి (30 వనరాజా/గిరిరాజి/ గ్రామ ప్రియ) రూ.8,000 నిక ర ఆదాయం వీటితో పాటు కౌజు పిట్టలు లేదా కుందేళ్ళు పెంపకం చేపట్టినట్లైతే రూ.50–60 వేల వరకు నికర ఆదాయం లభిస్తుంది. మొత్తం మీద సుమారు రూ.2–2.30 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చు. ఈ విధంగా స్థిరమైన రాబడి పొందుతూ.. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు.

### ఆయకట్టు ప్రాంతం

ప్రాజెక్టులు, చెరువుల కింద రైతులంతా ఎక్కువగా వరిని సాగు చేస్తున్నారు. అక్కడక్కడ లోతట్టు ప్రాంతాలలో మురుగునీటి సౌకర్యం లేక వరి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. వరితో పాటు బహువార్షిక పశుగ్రాసాలు సాగు చేసుకునే అవకాశం ఉన్నందున పాడి పరిశ్రమ ఆశాజనకంగా ఉంటుంది. అదేవిధంగా నీటి ముంపు ప్రాంతాలలో చేపల పెంపకం కూడా చేపట్టవచ్చు. ఈ విధంగా పంట సాగు (ఒక ఎకరా వరి) నుంచి రూ.35,000, ఒక ఎకరా వరి, మక్కజొన్న నుంచి రూ40,000, ముప్పావు ఎకరా పచ్చిగడ్డి లేదా ప్యారాగడ్డి నుంచి రూ.20,000 నికర ఆదాయం, పావు ఎకరా కూరగాయల ద్వారా రూ.10,000 నికర ఆదాయం, పాడి పశువుల నుంచి (మేలు జాతి ముర్రా–3) రూ.1,15,000 నికర ఆదాయం, పెరటి కోళ్ళ ద్వారా (50 వనరాజా/గిరిరాజా/ గ్రామ ప్రియ) రూ.11,000 నికర ఆదాయం, కుందేళ్ళ పెంపకం లేదా పుట్ట గోడుగుల సాగు ద్వారా రూ.15–20 వేల వరకు నికర ఆదాయం, ఎకరా వరి పొలం చుట్టూ మూడు మీటర్ల వెడల్పు, 1.5 మీటర్ల లోతు కందకాలను చేసి చేపల పెంపకం చేస్తే రూ.10–15 వేల నికర ఆదాయం పొందుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో సాలిన రూపాయలు 2.50–2.70 లక్షల వరకు నికర ఆదాయం లభిస్తుంది. ఈ విధమైన సమగ్ర వ్యవసాయ విధానం వలన రైతుకు ఒక వ్యవస్థలో నష్టం వచ్చిన మరోదానిలో వచ్చే రాబడి వలన ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ వ్యర్థ్యాల సమర్థ వినియోగం జరిగి సాగు ఖర్చు తగ్గుతుంది. వంట చెరుకు, పశుగ్రాసాల కొరత ఉండదు. పశు పోషణ ఆరోగ్యవంతంగా ఉంటుంది, చిన్న, సన్నకారు రైతులకు నిరంతరం ఉపాధి, స్థిరమైన ఆదాయం లభిస్తుంది. భూసార, పర్యావరణ భద్రత లభిస్తుంది.

**నట్టె కోటేశ్వర్‌రావు**, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

# అగ్గితెగులు నివారణ

రాష్ట్రంలో యాసంగిలో సాగుచేస్తున్న పంటలలో వరి ప్రధానమైనది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులలో యాసంగి వరి పంటలో అగ్గితెగులు ఆశించి ఎక్కువగా నష్టపరుస్తున్నదని వివిధ జిల్లాల్లోని ఏరువాక కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయశాఖ, రైతుల ద్వారా సమాచారం అందుతున్నది. కాబట్టి వరి పైర్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఈ కింద సూచించిన నివారణ చర్యలు చేపట్టాలి.




- ఈ తెగులు అన్ని జిల్లాల్లోని వరి పంటను ఆశించి అపార నష్టాన్ని కలుగజేస్తున్నది. ముఖ్యంగా ఈ తెగులు ఉధృతి వనపర్తి, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నాగర్‌కర్నూల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నది.
- ఈ తెగులు లక్షణాలు ఆకులపైన, కణుపులు, వెన్నులపైన కనిపిస్తాయి. ఆకులపైన నూలు కండెం ఆకారపు మచ్చలు ఏర్పడుతాయి. మచ్చల చివర్లు మొనదేలి అంచులు మాత్రం ముదురు గోధుమ రంగులో, మచ్చల మధ్య భాగం బూడిద రంగు ఉంటుంది. ఈ మచ్చలు పెద్దవై కలిసిపోయి ఆకు అంతటా వ్యాపిస్తాయి. మొక్కలు ఎండిపోయి దూరం నుంచి పంట తగలబడినట్లుగా కనిపిస్తుంది.
- ప్రస్తుతం రాష్ట్రంలో వరి పంట వివిధ దశల్లో ఉన్నది. ముఖ్యంగా పిలకల దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలో అగ్గితెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నది.

### తెగులు ఉధృతిని పెంచే కారణాలు

- నత్రజని ఎరువులను మోతాదుకు మించి వాడటం.
- గాలి అధిక తేమ శాతం (90 శాతం).
- చిరుజల్లులతో కూడిన వర్షం, వారం రోజుల వరకు మబ్బులు లేదా మంచుతో కూడిన వాతావరణం.
- తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు (15–20 డిగ్రీల సెల్సియస్), ఎక్కువ పగటి ఉష్ణోగ్రతలు (25–30 డిగ్రీల సెల్సియస్)
- పొలం గట్లపై, పొలంలో గడ్డి జాతి కలుపు మొక్కలు

### నివారణ

- నాటిన పొలంలో, పొలం గట్లపైన గడ్డి జాతి కలుపు మొక్కులు ముఖ్యంగా తుంగ, గరిక, ఒడిపిలి లాంటివి లేకుండా చూసుకోవాలి.
- నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మేరకు ఎక్కువ దఫాలుగా (3–4 సార్లు) వేసుకోవాలి.
- ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, అగ్గితెగులు ఆశించడానికి అనుకూలంగా ఉన్నాయి. కాబట్టి రైతులు నత్రజని ఎరువులను వరి పంటలో కొన్నిరోజులు వేయడం ఆపాలి. ముందుగా తెగులును నివారించుకొని మళ్లీ మామూలు పరిస్థితులు నెలకొన్నప్పుడే నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో వేయాలి.
- మొక్కలలో రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు వీలుగా పొటాష్ ఎరువును మ్యూరెట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానికి 10–15 కిలోలు రెండు దఫాలుగా అంటే దమ్ములో ఒకసారి, చిరుపొట్ట దశలో మరోసారి వేసుకోవాలి.
- నివారణకు ట్రైసైక్లోజోల్+మాంకోజెబ్ మిశ్రమ మందును 2.5 గ్రా/లీటరు నీటికి లేదా ఐసోప్రొథయోలిన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ/లీ. నీటికి కలిపి ఏదైనా ఒక మందును తెగులు ఉధృతి బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి 7–10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



**డాక్టర్ యం. వెంకటరమణ**
ప్రధాన శాస్త్రవేత్త (వరి)&హెడ్
వరి పరిశోధన కేంద్రం,
రాజేంద్రనగర్
7337399470

# మామిడి తోటల్లో సస్యరక్షణ

**నిర్లక్ష్యం వహిస్తే కనీస దిగుబడి కష్టమే.. ముందస్తు జాగ్రత్తలు ఎంతో మేలు**

మామిడిలో అధిక దిగుబడులను సాధించాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. మామిడి వాతావరణ ఆధారిత పంట. వచ్చిన పూత కాయ దశకు చేరుకునే వరకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే మామిడి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నది.



**మా**మిడిలో పూత సాధారణంగా డిసెంబర్‌లో మొదలై ఫిబ్రవరి చివరివరకు వస్తూ ఉంటుంది. ఎనిమిది నెలలపాటు చేపట్టే యాజమాన్య పద్ధతులు ఒక ఎత్తయితే పూత నుంచి కోత వరకు ఈ నాలుగు నెలలపాటు చేపట్టే జాగ్రత్తలు మరో ఎత్తు. మామిడిలో పూత తోటంతా ఒకేసారి రాదు. పూత ఒకేసారి రాకపోవడంతో సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో గానీ, కోత కోయడంలో గానీ రైతులకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఈ సమస్య నివారణకు తేమ తక్కువగా ఉండే నేలల్లో, ఇసుక నేలల్లో మొగ్గలు బయటకు వచ్చే ముందు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి. మొగ్గలు బయటకు వచ్చే ముందుగానీ, పగిలే సమయంలో గానీ పొటాషియం నైట్రేట్‌ను యూరియాతో కలిపి పిచికారీ చేయాలి.

### పూతపై వాతావరణ ప్రభావం

మామిడిలో పూత చాలావరకు వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. చాలా తోటల్లో ఏటా పూత రాకపోవడం, వచ్చినా నిలువకపోవడం సమస్య గా మారింది. వానకాలంలో కొమ్మలు కత్తిరించక సూర్యరశ్మి, గాలి సరిగ్గా ప్రసరించకపోవడం, కాడలను కోత తరువాత తొలిగించడం, ఉష్ణోగ్రత, భూమిలో తేమ కూడా పూతపై ప్రభావం చూపుతాయి.

### తోటలను దున్నకూడదు

ప్రస్తుతం ఇది తోటలలో పూత వచ్చే సమయం. కాబట్టి తోటల్లో దుక్కిని దున్నకూడదు. చెట్ల కింద పాదులను కూడా కదిలించకూడదు. అలా చేస్తే చెట్ల వేర్లు, పోషక పదార్థాల సమతుల్యత దెబ్బ తిని పూత తగ్గిపోయే ప్రమాదం ఉన్నది. ఎరువులు కూడా ఎక్కువగా వేయకూడదు. నీటి తడులను సైతం ఎక్కువగా ఇవ్వకూడదు. ఒకవేళ ఈశాన్య రుతుపవన వల్ల వర్షం పడితే చెట్లలోని పోషకాల సమతుల్యత దెబ్బతిని చిగురిస్తాయి. ఈ సమయంలో తోటలో బెట్ట పరిస్థితులు ఏర్పడేలా చేయాలి. చిగురును ఆశించే తేనేమంచు పురుగులు ఏడాది పొడవునా తోటల్లో కనిపిస్తాయి. పూత లేని సమయంలో ఈ పురుగులు చెట్ల మొదల్లోని నెర్రెల్లో ఉంటాయి. పురుగుల నివారణకు 1.5 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

### ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలు

సూక్ష్మపోషకాల లోపాలను సవరించడానికి లీటరు నీటికి 5 గ్రాముల జింక్‌సల్ఫేట్, 3 గ్రాముల బోరాక్స్+యూరియా కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మామిడి తోటల్లో కలుపు లేకుండా చేయాలి. ఎండిన, వ్యాధి సోకిన కొమ్మలను తొలిగిస్తూ ఉండాలి. వానపడితే రసం పీల్చే పురుగులు ఎక్కువగా చేరతాయి. పచ్చిపూత, లేతమొగ్గలు ఉన్న చోట ఈ పురుగులు ఆశిస్తాయి. వీటి నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 3 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షాలకు కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి కలుపు మొక్కలను నివారించుకోవాలి. తోటల్లో మొగ్గలు రావడం మొదలైతే అవి పూతగా మారడానికిగాను 2 గ్రాముల బోరాన్ లేదా 10 గ్రాముల మల్టీకేతో పాటు 5 గ్రాముల ఫార్ములా–4 మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**నగిరి హరీష్**, త్రిపురారం

# పంటల్లో పురుగులు, తెగుళ్ల అడ్డుకట్టకు కషాయాల మందులే మేలు

**గరిడేపల్లి:** సాధారణంగా పంటలను తెగుళ్ళ బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు రసాయన మందులను విరివిగా పిచికారీ చేస్తుంటారు. అయితే అలా చేయడం వలన పంటల దిగుబడులలో వాటి అవశేషాలు మిగిలిపోయి ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి పంటలను ఆశించే పురుగులు, తెగుళ్ళ నివారణకు రసాయన మందులకు బదులు కషాయాలను ఉపయోగించాలి. దీనిద్వారా నాణ్యమైన దిగుబడులను పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. స్థానిక వనరులతో తక్కువ పెట్టుబడితో కషాయాలను తయారీచేసుకోవచ్చు అని సూచిస్తున్నారు. వాటిని పంటలపై పిచికారీ చేయడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించవచ్చుని తెలిపారు. పలురకాల కషాయాల తయారీ, వాటిని పంటలపై పిచికారీ చేయడం వలన కలిగే ప్రయోజనాలను గురించి వారు తెలిపిన వివరాలు..



### పురుగుల నివారణకు

**నీమాస్త్రం:** దీని తయారీకి కావల్సిన పదార్థాలు ఆవు పేడ– 1 కిలో, ఆవు మూత్రం– 5 లీటర్లు, వేపాకు– 5 కిలోలు



**తయారుచేసే విధానం:** 5 కిలోల వేపాకు మెత్తగా రుబ్బి 5 లీటర్ల ఆవు మూత్రం, 5 లీటర్ల నీరు, 1 కిలో ఆవు పేడలో కలిపి ఒకరోజు ఊరబెట్టాలి. ఉదయం, సాయంత్రం బాగా కలుపాలి. ఈ ద్రావణాన్ని వడబోసి 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంటపై పిచికారీ చేయాలి. దీనిద్వారా రసంపీల్చే పురుగులను, చిన్న చిన్న క్రిములను నివారించవచ్చు. దీన్ని ఉపయోగించడం వలన పురుగులు గుడ్లు పెట్టవు. పంటలపై రోగాలు రాక ముందే నివారించుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

**బ్రహ్మాస్త్రము:** దీని తయారీకి కావాల్సిన పదార్థాలు కానుగ ఆకులు– 2 కిలోలు, సీతాఫలం ఆకులు– 2కి



లోలు, వేపాకు– 3 కిలోలు, వావిలాకు– 2 కిలోలు, లాటెనా ఆకులు– 2 కిలోలు, ఆవు మూత్రం– 320 లీటర్లు.
**తయారీ విధానం:** ఆకులన్నింటిని విడివిడిగా మెత్తగా రుబ్బి ఆవు మూత్రంలో నాలుగు పొంగులు వచ్చే వరకు ఉడకబెట్టాలి. 3 రోజులు చల్లార్చి వడపోయాలి. అన్నిరకాల పురుగుల్ని నివారిస్తుంది. ఎకరానికి పావు లీటరు నుంచి 300 మి.లీ.ల వరకు వాడవచ్చు. ఇది 5 నెలల పాటు నిల్వ ఉంటుంది.

**అగ్ని అస్త్రము:** దీని తయారీకి పొగాకు– 1 కిలో, ఎల్లి పాయలు– అరకిలో, పచ్చిమిర్చి– అరకిలో, వేపాకు– 5కిలోలు, ఆవు మూత్రం–20 లీటర్లు.
**తయారు చేసే విధానం:** పొగాకు, ఎల్లి పాయలు, పచ్చిమిర్చి, వేపాకు, విడివిడిగా మెత్తగా రుబ్బి 20 లీటర్ల మూత్రంలో వేసి మూతబెట్టి 4 పొంగులు వచ్చే వరకు ఉడకనివ్వాలి. 3 రోజుల పాటు ఉంచి తర్వాత వడపోయాలి. 10 లీటర్ల నీటికి 200 మి.లీ.ల అగ్ని అస్త్రాన్ని కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి.

**వెల్లుల్లి, పచ్చిమిర్చి, అల్లం కషాయం:** వెల్లుల్లి– 200 గ్రాములు, పచ్చిమిర్చి, అల్లం– 100 గ్రాములు చొప్పున అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి వేర్వేరుగా మెత్తగా నూరాలి. 5 లీటర్ల నీటిలో బాగా కలుపాలి. దీన్ని వడబోసి 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంటపై పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగులు, ఇతర పురుగులతో పాటు కొంతవరకు తెగుళ్ళను నివారిస్తుంది.
పై కషాయాలు తయారు చేసినట్లుగానే లొట్టపీచు ఆకులు, సీతాఫలం కాయల పొడితో, కానుగ గింజల పొడితో, మారేడు ఆకులతో వాటి లభ్యతను బట్టి కషాయాలను తయారుచేసుకుని మొక్కలపై పిచికారీ చేసినట్లైతే అన్నిరకాల పురుగులను నివారించుకోవచ్చు.

**తెగుళ్ళ నివారణ:** ఆవు మూత్రంగానీ, జీవామృతంగానీ 10 లీటర్ల నీటికి ఒక లీటరు కలిపి 15–20 రోజుల వ్యవధిలో పంటలపై పిచికారీ చేస్తే ఏ తెగులు ఆశించదు. పంట ఆరోగ్యకరంగా ఉంటుంది.



**పులిసిన మజ్జిగ:** 1 లీటరు పాలతో 6 లీటర్ల మజ్జిగ చేసి 4 రోజులు పులియబెట్టి 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంటపై పిచికారీ చేయాలి. అన్నిరకాల తెగుళ్ళ నివారణకు ఉపయోగపడుతుంది.

**బూడిద తెగులు నివారణ:** కాగితపు పూలు– 1 కేజీ, బొప్పాయి ఆకులు– 1 కేజీ, కలబంద–1 కేజీ, నీరు– 10లీటర్ల నీటిలో పై ఆకులను వేసి అరగంట ఉడకబెట్టి, చల్లార్చి వడబోసి, 200 గ్రాముల పసుపు కలిపి 100 లీటర్ల నీటితో ఎకరం పంటపై పిచికారీ చేస్తే బూడిద తెగులును సమర్థవంతంగా నివారించవచ్చు.

### నాణ్యమైన దిగుబడులు



పంటలపై పురుగులు, తెగుళ్ళ నివారణ కోసం రైతులు రసాయన మందులే ఎక్కువగా వాడుతుంటారు. అయితే వాటి వాడకం వలన మందుల అవశేషాలు పంట దిగుబడులలో మిగిలి ఉంటాయి. వాటినే ఆహార పదార్థాలుగా వాడినప్పుడు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. కాబట్టి స్థానికంగా దొరికే పదార్థాలతో పలు రకాల కషాయాలను తయారుచేసుకోవచ్చు. నిపుణుల సూచనల మేరకు తగిన మోతాదులో పంటలపై పిచికారీ చేస్తే పురుగులు, తెగుళ్ళ బెడద నివారించుకోవచ్చు. అంతేగాకుండా నాణ్యమైన పంట దిగుబడులను పొందవచ్చు.

– **అరిగెల కిరణ్**,7893989055
కేవీకే మృత్తికా శాస్త్రవేత్త, గడ్డిపల్లి

**ఆవుపేడ, మూత్రము, ఇంగువ కషాయం:** 5 కిలోల పేడ, 5 లీటర్ల మూత్రం ఒక పాత్రలో ఉంచి 5 రోజులు ఊరనివ్వాలి. మధ్య మధ్యలో కలుపాలి. ఉపయోగించే ముందు వడబోసి 250–500 గ్రాముల ఇంగువ మిశ్రమాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంటపై పిచికారీ చేయాలి. అన్నిరకాల తెగుళ్ళను సమర్థవంతంగా నివారిస్తుంది.

**బంకకారుట నివారణ:** నిమ్మ, నారింజ, బత్తాయి, జామ, మామిడిలో బంకకారుట తెగులు నివారించడానికి ఆవు పేడను చిక్కగా కలిపి పూయాలి. తెగులు పూర్తిగా పోతుంది.



బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

# ప్రధాని మోదీతో ఏపీ సీఎం భేటీ

ఏపీకి ఆహ్వానించిన జగన్

**న్యూఢిల్లీ/ అమరావతి, ఫిబ్రవరి 12:** ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం గంటన్నరకుపైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ప్రధానికి జగన్ నివేదించారు. మూడు రాజధానులు, విభజన అంశాలు, ప్రత్యేక హోదా తదితర పది అంశాలపై ప్రధానికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉగాది రోజున (మార్చి 25న) 25 లక్షల ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతామని, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని మోదీని జగన్ ఆహ్వానించారు. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇండ్లు అందజేయాలనే ఉద్దేశంతో ఇండ్లస్థలాలు పంపిణీచేయనున్నట్టు తెలిపారు.

# కలుషితాహారమే కారణమా?

- రెండేండ్ల చిన్నారి మృతిపై పోలీసుల దర్యాప్తు
- ఆహార శాంపిళ్లు సేకరణ
- పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు వచ్చాకే స్పష్టత

**బేగంపేట:** హైదరాబాద్ బేగంపేటలోని మానస సరోవర్ హోటల్‌లో బసచేసి అనుమానాస్పద స్థితిలో ప్రాణాలుకోల్పోయిన రెండేండ్ల చిన్నారి విహాన్ మృతికి కారణం కలుషిత ఆహారమా? కాదా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ వైద్యాధికారులు బుధవారం బేగంపేట మానస సరోవర్ హోటల్‌లో తనిఖీ చేసి.. బాధితులు తీసుకున్న ఆహార పదార్థాలకు సంబంధించిన శాంపిళ్లను, బసచేసిన గదిలో వాంతుల శాంపిళ్లను సేకరించి ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించారు. ఫోరెన్సిక్ నివేదిక, విహాన్ శవపరీక్ష నివేదిక వచ్చాక మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులు రవి నారాయణరావు, శ్రీవిద్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వీరు ఏడేండ్లుగా బెంగళూరులో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు



మానస సరోవరం హోటల్‌లో ఆహార శాంపిళ్లను సేకరి స్తున్న అధికారులు

వరుణ్, విహాన్ (2) ఉన్నారు. అమెరికా వెళ్లేందుకు అవసరమైన వీసా ఫింగర్ ప్రింట్స్, స్టాంపింగ్ కోసం ఈ నెల 9న హైదరాబాద్‌కు వచ్చి బేగంపేటలోని మానస సరోవర్ హోటల్‌లో దిగారు. 10న బేగంపేటలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయంలో పని పూర్తిచేసుకొని తిరిగి హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. రాత్రికి కడాయి పనీర్, రొట్టెలను తిని గదిలోకి వెళ్లారు. కొద్దిసేపటికే భార్య పిల్లలకు వాంతులు కాగా, నారాయణరావుకు భరించలేని కడుపు నొప్పి వచ్చింది. భార్య, పిల్లలను హోటల్‌లోనే ఉంచి నారాయణరావు కిమ్స్ దవాఖానకు వెళ్లాడు. చికిత్స అనంతరం మంగళవారం తెల్లవారుజామున తిరిగి హోటల్‌కు వచ్చాడు. అప్పటికే చిన్న కుమారుడు విహాన్ స్పృహకోల్పోయి ఉండటాన్ని గమనించి, భార్య, పిల్లలను కిమ్స్‌కు తరలించాడు. పిల్లలకు 10 సార్లు వాంతులయ్యాయని, విహాన్ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడని వైద్యులు తెలిపారు. వరుణ్‌కు ఐసీయూలో చికిత్స అందించామని చెప్పారు. కలుషిత ఆహారం తినడంవల్లే విహాన్ మృతిచెందిఉండొచ్చని అనుమానిస్తున్నారు.

### మరేమైనా కారణాలున్నాయా?

విహాన్‌ది అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసిన బేగంపేట ఏసీపీ నరేశ్‌రెడ్డి .. నారాయణరావు కుటుంబసభ్యులు సోమవారం సాయంత్రం బయటకెళ్లి ఏమైనా తీసుకున్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం రాత్రి వీరు తీసుకున్న ఆహారాన్ని అదే హోటల్‌లో బసచేసిన మరో ఇద్దరు తిన్నారని, వారు ఆరోగ్యంగానే ఉన్నట్టు తెలిసింది.

# సిరిసిల్ల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఎమ్మార్పీఎస్ టీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్



**ఉస్మానియా యూనివర్సిటీ:** సిరిసిల్లలోని గిరిజన బాలికల వసతిగృహంలో లైంగిక వేధింపుల ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చదువుకోవాలనే ఆశతో హాస్టల్‌లోచేరిన బాలికలపై వేధింపులు జరుగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ ఘటనలో దోషులైన దేవయ్య, విజయతోపాటు తెరవెనుక పెద్దలెవరున్నా వదలొద్దని డిమాండ్‌చేశారు. దేవయ్య వేధింపులు తాళలేక సుమారు 70 మంది విద్యార్థినులు హాస్టల్ నుంచి వెళ్లిపోవడం వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుపుతున్నాయని పేర్కొన్నారు. అమ్మాయిలు ఫిర్యాదు చేసినపుడు పట్టించుకోని షీ టీమ్ పోలీసులను సైతం సస్పెండ్‌చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయాధికార ప్రతినిధి కొక్కెర భూమన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేగుంట సునీల్, ఉపాధ్యక్షుడు నగునూరి వేణుగోపాల్, యువసేన అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నందకిశోర్, ఎంఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు నర్సాని రమేశ్, కార్యదర్శి వరిగడ్డి చందు, ఓయూ అధ్యక్షుడు గుమిడెల్లి తిరుమలేశ్, నాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత హాజరుపై జగన్‌కు ఊరట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సీబీఐ కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యే విషయంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బుధవారం ఊరట లభించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని హైకోర్టులో జగన్ దాఖలుచేసుకున్న పిటిషన్లపై తుది విచారణ పూర్తయ్యేవరకు సీబీఐ కోర్టులో హాజరునుంచి మినహాయింపు కోరవచ్చని హైకోర్టు పేర్కొన్నది. జగన్ పిటిషన్లపై సీబీఐ బుధవారం కౌంటర్ అఫిడవిట్లు దాఖలుచేసింది. ఆరోపణలు తీవ్రంగా ఉన్నందున వ్యక్తిగత హాజరునుంచి మినహాయింపు ఇవ్వరాదని సీబీఐ అఫిడవిట్లలో తెలిపింది. సీబీఐ అఫిడవిట్లను పరిశీలించి ఏప్రిల్ తొమ్మిదిన తుది విచారణ చేపడుతామని తెలిపిన జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం.. విచారణను ఏప్రిల్ తొమ్మిదికి వాయిదావేసింది.

# ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి

మంత్రి సబితా ఇంద్రారెడ్డికి గ్రంథాలయ ఉద్యోగుల విజ్ఞప్తి

సీఎం కేసీఆర్‌కు వివరిస్తానని మంత్రి హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని ఆ సంస్థ ఎన్జీవో సెంట్రల్ ఫోరం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గ్రంథాలయ ఉద్యోగసంఘం నేతలు బుధవారం మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరిస్తారని సంఘం అధ్యక్షుడు దేవేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ తీసుకొనే కొన్ని సంస్థలకు మాత్రమే కేంద్రం నుంచి నిధులు వస్తాయని.. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు ఎలాంటి నిధులు రావని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరగ్రంథాలయశాఖలోని అన్ని విభాగాల్లో ఒకే పని విధానం ఉన్నదని.. ఒకే వేతనాలను అమలుచేయాలని దేవేందర్ కోరారు. ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సబిత హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో గ్రంథాలయ సంస్థ ఉద్యోగసంఘాల నాయకులు చాగంటి ఆయోధ్య, బుచ్చయ్య, మహేందర్, వరప్రసాద్, నరేందర్ తదితరులు ఉన్నారు.

# ఆయుధాల మిస్సింగ్‌పై ముమ్మర దర్యాప్తు

- సదానందంను విచారిస్తున్న పోలీసులు
- గంటకో సమాధానం చెప్తున్న నిందితుడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని అక్కన్నపేట కాల్పుల కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. సదానందం వాడిన తుపాకీ, కార్బన్.. 2016లో హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి చోరీ చేసినవే అని పోలీసులు గుర్తించారు. ఆయుధాల చోరీవిషయం ఇన్నాళ్లు ఎందుకు వెలుగులోకి రాలేదు అనేది పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది. సదానందం వాడిన రెండు ఆయుధాలు హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎవరు తీసుకెళ్లారు? నిందితుడు సదానందమే చోరీ చేశాడా? ఇంకా ఎవరి పాత్రైనా ఉన్నదా? ఆయుధాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు ఎవరు? ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరుకాల్సి ఉన్నది. సదానందంను కోహెడ బస్టాండ్‌లో శనివారం అదుపులోకి తీసుకొన్న పోలీసులు.. అతన్ని లోతుగా విచారిస్తున్నారు. పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు గంటకో రకమైన సమాధానాలిస్తూ పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నట్టు తెలిసింది. తొలుత తుపాకులను కొన్నానని, కాసేపటికే చోరీ చేశానని, మరోసారి పోలీసుల నుంచి తీసుకొన్నానని.. ఇలా అడ్డదిడ్డమైన సమాధానాలతో పోలీసులకు చెమటలు పట్టిస్తున్నాడు. సదానందం నిజం చెప్తే.. ఆయుధాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఆయుధాల భద్రతలో హుస్నాబాద్ పోలీసులు తీసుకొంటున్న చర్యల డొల్లతనం బట్టబయలయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కేసు విచారణను సీరియస్‌గా తీసుకొన్నారు. సదానందం మానసిక స్థితి బాగాలేక మందులు వాడుతున్నాడని, అతడికి నేరచరిత్ర లేదని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇద్దరు భార్యలున్న సదానందం.. కుటుంబ సంబంధ సమస్యలపై కొన్నిసార్లు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్టు పోలీసులు చెప్తున్నారు. నిందితుడు సదానందం మాజీ నక్సలైట్ అనే ప్రచారం అవాస్తవమని అధికారులు అంటున్నారు. సదానందం నోరు తెరిస్తేనే అసలు నిందితులు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.





